



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

గ్రామాల్లో 'తాగునీటి' సమస్య రావొద్దు..
వానాకాలం సాగుకు అన్ని ఏర్పాట్లు పూర్తి
కాళేశ్వరంపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదు
ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా గుర్తింపు ప్రక్రియ 03

సంపుటి 29, సంచిక: 19 | బుధవారం | 08-07-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి ఒప్పిస్తే..

# కాళేశ్వరాన్ని అప్పగిస్తా!




ఎందుకివ్వాలో చెబితే వారం కాదు.. మూడేళ్లు ఇస్తాం : ప్రతిపక్ష నేతకు సిఎం రేవంత్‌రెడ్డి సవాల్

- కాళేశ్వరంపై ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- 2027 జూలై నాటికి అందుబాటులోకి తెస్తాం : మంత్రి ఉత్తమ్‌కుమార్

ప్రజాపక్షం / హైదరాబాద్

'కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిందే వానలొచ్చి గోదావరి వరద జలాలు వృథాగా పోయి సముద్రంలో కలవకుండా ఎత్తిపోసేందుకు. ఇప్పుడు ఎల్‌నినో వచ్చి కరవు వస్తే వర్షాలు రావు. వరదలు రావు, తుఫానులు రావు. ఎట్లా లిఫ్ట్ చేస్తరు. కెసిఆర్‌కు వారం రోజులు ఇస్తే కన్నెపల్లి పంపు హౌజ్ నడిపి చూపిస్తా అంటుండు. ఒకవేళ కెసిఆర్ శాసనసభకు వచ్చి ఒప్పిస్తే, కాళేశ్వరంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజ్‌ల వద్ద మూడింటికి మూడు పంపుహౌజులు చంద్రశేఖర్‌రావుకు నూటికి నూరు శాతం అప్పజెబుతాం. వారం రోజులు కాదు రాబోయే మూడేళ్ళు అప్పజెబుతాం. ఏమి చేస్తడో చేయమనండి' అని బిఆర్ఎస్ నేతలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సవాలు విసిరారు. తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చించి, ఒప్పించేందుకు శాసనమండలి చైర్మన్‌కు, శాసనసభకు స్పీకర్‌కు లేఖలు తరువాయి 12లో




## ఆసుపత్రుల్లో కార్మికులకు కనీస వేతనం

# రూ.26 వేలకు పెంచాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్

ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ధర్నాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు పెంచాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా, నీలోఫర్, కింగ్‌కోఠి, పేట్లబురుజు ఆసుపత్రుల వద్ద భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించారు. ఉస్మానియా ఆసుపత్రిలో జరిగిన ధర్నాను ఉద్దేశించి నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వీరికి ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా ఒకటవ తేదీన జీతాలు తరువాయి 8లో

# ఇండోనేసియాకు బ్రహ్మోస్ క్షిపణులు

ఇండో–పసిఫిక్‌లో సుస్థిరశాంతికి ఉమ్మడి కృషి

14 ఒప్పందాలపై మోదీ–సుబియంతో సంతకాలు



జకర్తా : భారత్ దేశీయంగా తయారు చేసిన అత్యంత అధునాతనమైన సూపర్ సోనిక్ బ్రహ్మోస్ క్షిపణులను, ఆస్ట్రా క్షిపణులను ఇండోనేసియాకు సరఫరా చేస్తుంది. ఈ మేరకు రెండు దేశాలమధ్యా ఒప్పందం కుదిరింది. ఐతే ఎన్ని బ్రహ్మోస్ క్షిపణులు సరఫరా చేస్తారన్న విషయంపై ఒప్పందంలో స్పష్టత లేదు. బహుశా ఈ విధంగా 600 మిలియన్ డాలర్ల విలువైన ఈ రెండు రకాల క్షిపణులను సరఫరా చేసేందుకు ప్రధానమంత్రి మోదీ సమక్షంలో ఒక ప్రకటన వెలువడటం,ఒప్పందంపై సంతకాలు చేయడం భారత రక్షణరంగంలో ఇదే మొదటిసారి. బ్రహ్మోస్–ఆస్ట్రా క్షిపణులు తరువాయి 8లో

## తాడిచర్ల-2 బొగ్గుగనులు

# సింగరేణి చేతికి...

ప్రధాని మోదీ అంగీకారం

182 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రకటన

కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాపక్షం/హైదరాబాద్

తాడిచర్ల–2 బొగ్గు గనులను సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి మంగళవారమే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల–2లో 182 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40–50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి తరువాయి 8లో




## తొందరపడకుండా రాష్ట్రంలో లేబర్ కోడ్స్

కార్మికసంఘాలు, పారిశ్రామిక వేత్తలతో చర్చించాకే నిబంధనలు రూపకల్పన : కార్మిక మంత్రి వివేక్ 03







# రామాలయ నిధుల చోరీపై ఆత్మరక్షణలో హిందూత్వ శక్తులు

అయోధ్య బాలరామాలయంలో నిధుల దొంగతనం ఘటన షాక్ నుంచి ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బిజెపి నేతలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. సమగ్ర విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని అంటున్నారు. అదే సమయంలో, ప్రతిపక్షాలు దీన్ని అవకాశంగా వాడుకుంటాయనే భయం వారిలో వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తదితర ప్రతిపక్ష నాయకులు రామాలయ నిధుల గోల్‌మాల్‌పై ఆరోపణలు చేస్తున్నందున వారినీ విచారించాలని విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్‌కు లేఖ రాయటం ఇందుకు తాజా ఉదాహరణ. ఉత్తరప్రదేశ్‌లో 'డబుల్ ఇంజిన్ సర్కార్' పనిచేస్తోంది. 2027 ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తమ పరువు ప్రతిష్టలు కాపాడుకోవటానికి ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశారు. అది గత నెలలో సమర్పించిన తాత్కాలిక నివేదిక ప్రకారం ఎనిమిది మంది ఉద్యోగులను అరెస్టు చేశారు. దొంగతనం, విశ్వాస ద్రోహం, క్రిమినల్ కుట్ర ఆరోపణలు మోపారు. రూ.80 లక్షల నగదు, కొంత బంగారం, వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల నుంచి కొన్ని కోట్ల నగదు, ఆభరణాలు దొంగలించబడినట్లు ఆరోపణలుండగా, మొత్తం 40రోజుల్లో 70సార్లు దొంగతనం ఘటనలు జరిగినట్లు సిట్ ఇప్పటికే నమోదు చేయగా – ఇదంతా కిందిస్థాయి ఉద్యోగుల చేతివాటమేనా, పెద్దల పాత్ర లేకుండా ఈ ధనాపహరణ సాధ్యమా? పర్యవేక్షకులేమైనారు, సిసి కెమెరా ఫుటేజి ఎందుకు లేదు. రామతీర్థ క్షేత్ర ట్రస్టు తరఫున యాజమాన్యం నిర్వహిస్తున్నవారు ఏం చేస్తున్నారు? అనే ప్రశ్నలు ఉదయించటం సమంజసం. రాముణ్ణి రాజకీయంలోకి లాగి ఆయన పేరుమీద ఓట్లు దండుకుని అధికారం చలాయిస్తున్నవారే కదా ఈ ఆలయాన్ని సొంత ఆస్తిగా చూసుకుంటున్నది? 2026 ప్రారంభంలో ధనాపహరణ సందేహాలు అంతర్గతంగా ఉత్పన్నంకాగా జూన్ 25న గాని పోలీసులు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయలేదు. ఈ ఆలస్యానికి కారణమేమిటి? అందిన కానుకల మొత్తానికి బ్యాంక్ డిపాజిట్లకు మధ్య తేడా బయట పడటంతో అనుమానాలు తలెత్తాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక నివేదికలోని అంశాలు గోప్యంగా ఉంచారు. ట్రస్టు ఐదేళ్ల ఆర్థిక లావాదేవీల రీఆడిట్‌ను సిట్ ఉత్తర్వు చేసిందంటే అనుమానాల వ్రేళ్లు లోతుగా ఉన్నట్లు ఊహించుకోవచ్చు. ఇదిలావుండగా, ఆలయ నిధుల అపహరణ వెలుగులోకి వచ్చిన నెలరోజుల తర్వాత నింపాదిగా జులై 6 న తొలిసారి సమావేశమైన రామాలయ ట్రస్టుబోర్డు, తమ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలు ఆమోదించినట్లు ప్రకటించింది. ముఖ్య కార్యనిర్వహణాధికారిని (సిఇఒ) ఎంపిక చేసేందుకు ముగ్గురితో ఒక కమిటీని నియమించింది. ఆలయంలో ఇప్పుడు జరిగిన టువంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా నివారించేందుకు తీసుకోవలసిన అదనపు చర్యలు రూపొందించేందుకు మరో కమిటీని ఏర్పాటు చేశారు.

చంపత్‌రాయ్ సామాన్యుడు కాదు. ఆయన విహెచ్‌పి ఉపాధ్యక్షుడు, ఆర్ఎస్ఎస్ ప్రచారక్. అనిల్ మిశ్రా కూడా విహెచ్‌పి ప్రముఖుడు. సుప్రీంకోర్టు ఆదేశంపై ఈ ట్రస్టును ఏర్పాటు చేసింది ప్రధానమంత్రి నరేంద్రమోదీ. రామాలయ ఉద్యమాన్ని, ఆలయ నిర్మాణాన్ని ఆదినుంచీ చేబట్టిందీ ఆర్ఎస్ఎస్ విభాగమైన విహెచ్‌పి. ఇంత జరిగినా ఆలయంపై తన ఆధిపత్యం కనీసం తగ్గించుకోవటానికి కూడా విహెచ్‌పి సిద్ధంగా ఉన్నట్లు లేదు. రామాలయ అడ్మినిస్ట్రేషన్‌లో మార్పులపై చర్చ జరుగుతుండగా, ఆలయంపై ప్రభుత్వ నియంత్రణను తాము అనుమతించబోమని విహెచ్‌పి జాయింట్ ప్రధాన కార్యదర్శి సురేందర్ జైన్ సోమవారం చెప్పారు. వృత్తినిపుణుడైన సిఇఒని నియమించటానికి తమకు అభ్యంతరం లేదని, అయితే అతను సర్వీసులో ఉన్న బ్యూరోక్రాట్ కాకూడదని, అతను తీర్థక్షేత్ర ట్రస్టుకే జవాబుదారీగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ట్రస్టుడీడ్‌ను లేదా బైలాస్‌ను మార్చాలని ఎవరూ కోరటం లేదన్నారు. ట్రస్టు డీడ్‌ను రూపొందించింది ప్రభుత్వం అయినప్పటికీ అందులోని సమాచారాన్ని ఆర్‌టిఐ కింద వెల్లడి చేయటానికి హోంమంత్రిత్వశాఖ, సమాచార ముఖ్య కమిషనర్ నిరాకరించటం గమనించదగినది. అందులో ప్రభుత్వ ప్రమేయం, వ్యయం లో వాటా లేదు. అది పూర్తిగా ప్రైవేటు ట్రస్టు. ప్రైవేటు ట్రస్టు ఆర్‌టిఐ కిందకు రాదన్నది వారి వాదన. కోట్లాది భక్తుల ఆరాధ్యుడైన రాముని ఆలయ నిర్వహణ విధివిధానాల్లో ఎందుకీ గోప్యత?

ఈ రోజు (జులై 7) వరకు జరిగిన దర్యాప్తులనుబట్టి అయోధ్య రామునికి భక్తులు చెల్లించిన కానుకల్లో కోట్ల రూపాయల దొంగతనం ఆర్ఎస్ఎస్–బిజెపి వారి హస్తలాఘవం తప్ప మరెవరి ప్రమేయం లేదని తెలియజేస్తున్నది. అందువల్ల దీని రాజకీయ పర్యవసానాలు ఈ హిందూత్వ శక్తులపై ఉంటాయి. రామాలయం వారికి రాజకీయ చిహ్నం, అక్కడ ధనాపహరణం వారి ప్రతిష్టను భగపరిచింది. దాన్ని దాచిపెట్టకుండా దర్యాప్తు చేయిస్తున్నామని చెప్పుకోవటం ద్వారా రాజకీయ నష్ట నివారణకు ప్రయత్నిస్తున్నారు. అయితే దర్యాప్తు తీరు అనేక ప్రశ్నలకు జవాబు ఇవ్వనందున అది నిష్పాక్షికంగా జరుగుతున్నట్లు అనిపించదు. అందువల్ల సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలనే ప్రతిపక్షాల డిమాండ్‌కు అభ్యంతరం ఎందుకుండాలి. అటువంటి దర్యాప్తు ప్రజల్లో విశ్వాసం నింపుతుంది కదా! దర్యాప్తు ఆదేశించటంలో జరిగిన విపరీత జాప్యం పెద్దల విషయాలు అన్నీ సర్దుబాటు చేసుకున్నాక కిందిస్థాయి ఉద్యోగులను అరెస్టు చేసినట్లు సంకేతిస్తున్నది. ఈ దర్యాప్తు పర్యవసానాలు ఎలా ఉన్నా, రానున్న అసెంబ్లీ ఎన్నికల వరకు ఈ అంశాన్ని ప్రతిపక్షాలు జనంలోకి తీసుకెళుతూనే ఉంటాయి. విహెచ్‌పి హెచ్చరికలు వారిని భయపెట్టలేవు.



## సమగ్ర విచారణ చేయాలి

**విరాళాల చోరీకి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలి.సంబంధిత ట్రస్టుల ఉన్నతాధికారుల పాత్రను కూడా పరిశీలించాలి.అయోధ్య రామమందిరం తర్వాత, బద్రీనాథ్ ఆలయంలో కూడా కానుకలు, విరాళాల చోరీ, దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ట్రస్టులకు సంబంధించిన ముఖ్య నిర్వాహకులపై కూడా సరైన విచారణ జరగాలి, లేకపోతే, భవిష్యత్తులో వారి స్థానంలో వచ్చేవారు కూడా ఇదే సాకుతో తమ పదవులను దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం, సిట్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి.విరాళాల చోరీ జరిగిందని ఆరోపించిన ఎస్‌పి, కాంగ్రెస్, ఆప్ పార్టీల సీనియర్ నాయకులు అందుకు తగిన ఆధారాలను సమర్పించాలి.**

\- బిఎస్‌పి అధినేత్రి మాయావతి

ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేస్తే

# రైతుకు ఊరట... పల్లెకు పునర్జీవం!

గ్రామీణ భారతదేశానికి రైతు వెన్నెముక అయితే, కూలీ ఆ రైతు శ్రమకు జీవం. రైతు భూమిని నమ్ముకుని పంట పండిస్తాడు. కూలీ తన చెమటను నమ్ముకుని జీవిస్తాడు. ఈ ఇద్దరూ బలంగా ఉంటేనే పల్లె బలంగా ఉంటుంది. కానీ నేటి పరిస్థితి చూస్తే ఈ సహజ సమతుల్యం దెబ్బతింటోంది. ఒకవైపు చిన్న, సన్నకారు రైతులు పెరుగుతున్న కూలీ ఖర్చులతో, కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉపాధి హామీ పనులు వ్యవసాయానికి దూరంగా సాగుతుండటంతో, రైతు పొలంలో అవసరమైన సమయంలో కూలీలు దొరకక వ్యవసాయం మరింత భారంగా మారుతోంది. ముఖ్యంగా నాట్లు, కలుపు, కూరగాయలు, పప్పులు, ఉద్యాన పంటలు వంటి ఎక్కువ శ్రమ అవసరమైన రంగాల్లో ఈ సమస్య మరింత తీవ్రమైంది.

దేశంలో ఎక్కువ మంది రైతులు చిన్న భూస్వాములే. వారికి వ్యవసాయం లాభం ఇవ్వాలంటే కేవలం విత్తనాలు, ఎరువులు సరిపోవు, కూలీ కూడా అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం ఉపాధి హామీ పనులు చెరువుల పూడికతీత, మట్టి పనులు, గ్రామీణ నిర్మాణాల వరకే ఎక్కువగా పరిమితమవుతున్నాయి. గ్రామీణ ఉపాధి కల్పనలో ఇవి ఉపయోగకరమైనప్పటికీ, రైతు పొలానికి ప్రత్యక్షంగా బలం చేకూర్చే విధంగా వ్యవస్థ పూర్తిగా పనిచేయడం లేదు. ఫలితంగా రైతు తన పొలంలో పని చేయించుకోవడానికి అధిక వ్యయం భరించాల్సి వస్తోంది. శ్రమ ఎక్కువగా అవసరమయ్యే పప్పులు, కూరగాయలు, మిల్లెట్లు, పండ్ల తోటలు వంటి వైవిధ్య పంటల నుంచి రైతు వెనక్కి తగ్గి, తక్కువ శ్రమతో లేదా హామీ ఉన్న పంటల వైపు మొగ్గు చూపుతున్నాడు.

ఇది కేవలం రైతు సమస్య కాదు, ఇది భవిష్యత్తు ఆహార భద్రతకు సంబంధించిన అంశం. ఒకప్పుడు గ్రామాల్లో పెరటి తోటలు, పప్పులు, నూనెగింజలు, పశుగ్రాసం, పశు సంపద అన్నీ కలిసి ఒక సమగ్ర జీవన విధానంగా ఉండేవి. ఇప్పుడు ఒక్క పంట ఆధారిత వ్యవసాయం పెరగడం వల్ల మట్టి సారం తగ్గుతోంది, పోషకాహారం తగ్గుతోంది, నీటి వినియోగం పెరుగుతోంది. కాబట్టి ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయడం అంటే కేవలం రైతుకు కూలీ అందించ డం కాదు, పల్లె జీవన వ్యవస్థను మళ్లీ సమతుల్యం చేయడం.

చిన్న రైతుల పెరటి తోటలు, పప్పుధాన్యాలు, కూరగాయల సాగు, పశుగ్రాసం, భూమి సమతలీకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, నీటి సంరక్షణ వంటి పనులకు ఉపాధి హామీని అనుసంధానం చేస్తే రైతుకు కూలీ భారం తగ్గుతుంది. అదే సమయంలో కూలీలకు తమ గ్రామంలోనే స్థిరమైన ఉపాధి లభిస్తుంది. పట్టణాలకు వలస తగ్గుతుంది. మహిళలకు, వెనుకబడిన వర్గాలకు మరింత జీవన భద్రత లభిస్తుంది. రైతు వైవిధ్య పంటల వైపు తిరిగి అడుగులు వేయగలడు. గ్రామీణ కుటుంబాల్లో పోషకాహారం మెరుగుపడుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి హామీ వినియోగం మంచి ఫలితాలు ఇచ్చింది. పండ్ల తోటలు, భూసంరక్షణ, నీటి వినియోగ సామర్థ్యం పెంపు వంటి కార్యక్రమాల్లో రైతులు లాభపడ్డారు. అంటే సరైన ప్రణాళిక, నిజాయితీ, పారదర్శకత ఉంటే ఇది అసాధ్యం కాదు. అసలు అవసరం ప్రభుత్వ సంకల్పం.

ప్రభుత్వాలు తరచూ గ్రామాభివృద్ధి గురించి చెబుతాయి. కానీ నిజమైన గ్రామాభివృద్ధి అంటే రైతు పొలం లాభదాయకం కావడం. కూలీకి పని దొరకడం. రైతు ఖర్చు తగ్గడం. పంట వైవిధ్యం పెరగడం. గ్రామం స్వయం సమృద్ధి సాధించడం. ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయడం ద్వారా ఈ నాలుగు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమవుతా యి.

అవినీతి, అమలు లోపాలు, వ్యక్తిగత ప్రయోజనాల భయం వంటి అభ్యంతరాలు ఉండొచ్చు. కానీ వాటిని కారణంగా చూపి రైతు అవసరాన్ని నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు. గ్రామ సభల పర్యవేక్షణ, సామాజిక తనిఖీలు, డిజిటల్ పర్యవేక్షణ, చిన్న రైతులకు ప్రాధాన్యత వంటి పద్ధతులతో పారదర్శకత సాధ్యమే. నిజానికి దేశ భవిష్యత్తును కాపాడే విధానాల్లో ఇది ఒకటి కావాలి.

ఇప్పుడు వ్యవసాయానికి అవసరమైనది కేవలం పథకాలు కాదు, సమగ్ర దృష్టి. రైతు బతికితేనే గ్రామం బతుకుతుంది. గ్రామం బతికితేనే దేశ ఆహార భద్రత బలపడుతుంది. కాబట్టి ఉపాధి హామీ పథకం చేతులు రైతు పొలానికి చేరాలి. రైతు అడిగేది దానం కాదు, తన భూమిని నిలబెట్టే విధాన మద్దతు. రైతు చెమటకు ప్రభుత్వ పథకం తోడైతే, అది కేవలం పంటనేకాదు, గ్రామీణ భారత భవిష్యత్తును కూడా పండిస్తుంది.ఇక ఆలస్యం చేయరాదు. గుంతలు తవ్వే చేతులు పొలం దున్నే రైతుకు తోడైతేనే నిజమైన అభివృద్ధి. ఉపాధి హామీ వ్యవసాయాన్ని చేరిన రోజే పల్లెకు కొత్త ఊపిరి, రైతుకు కొత్త నమ్మకం, దేశానికి మరింత సురక్షితమైన భవిష్యత్తు లభిస్తుంది. ఇది రైతు కోసం తీసుకునే నిర్ణయం మాత్రమేకాదు, భారత భవిష్యత్తును కాపాడే చారిత్రక నిర్ణయం.

డి.శ్రీశైలం

# ప్రతి విద్యార్థి భవిష్యత్ కు భరోసా కోసం

## జులై 10న బంద్



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

రాష్ట్రంలో విద్యా రంగం రోజు రోజుకూ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. చాలా ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్లాస్ రూమ్‌లు, తాగు నీరు, టాయిలెట్ల లాంటి మౌలిక వసతులు కరువయ్యాయి. ఖాళీ టీచర్ పోస్టులు వెంటాడుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మీద ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. రాష్ట్రం వస్తే విద్యా రంగ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని, నిధులు వస్తాయనుకుంటే విద్యారంగాన్ని పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. మారింది రాష్ట్రమే తప్ప విద్యార్థుల భవిష్యత్ మాత్రం కాదు. కాంగ్రెస్ అయినా, బిఆర్ఎస్, బిజెపి అయినా అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడమేగానీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదు.

రాష్ట్రంలో విద్యశాఖకు ప్రత్యేకంగా ఒక మంత్రి లేరు. ఆ శాఖ సిఎం వద్దే ఉండడంతో విద్యారంగం మరింత అభివృద్ధి చెందుతుందనుకుంటే మరిన్ని కొత్త సమస్యలు ఎదుర్కొంటుంది. 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేల పాఠశాలలకు కుదిస్తామని స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం అంటే.. ప్రభుత్వ విద్యను బొందపెట్టడమే. చదువు కొనుక్కోలేని పేద విద్యార్థులను చదువుకు దూరం చేయడమే. రాష్ట్రంలో ఇప్పటికే 2,763 స్కూళ్లలో టాయిలెట్లు లేకపోవడం స్కూళ్ల దుస్థితికి అద్దం పడుతోంది. ఉన్న వాటిలోనూ చాలాచోట్ల నీళ్లు లేక నిర్వహణ సరిగ్గాలేవు.

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆసరాగా ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను గత కెసిఆర్ ప్రభుత్వం గతంలోనే రెండున్నరేళ్లు పెండింగ్‌లో పెట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి 30 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు సుమారు రూ.10వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయలేదు. మరోవైపు పైసలు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను సతాయిస్తున్నాయి. ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, తలతాకట్టుపెట్టి సర్టిఫికెట్లు తీసుకెళ్తున్నారు. ఫుట్ బాల్ పోటీలకు అందాల పోటీలకు, ఇతర రాష్ట్రాల పత్రికల్లో ప్రకటనలకు, మంత్రుల హెలీకాప్టర్ల ప్రయాణాలకు వందల కోట్లు ఖర్చు పెడుతు న్న ప్రభుత్వం.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మాత్రం చెల్లించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్వీర్యం చేయడం విషాదం.



రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా ఇప్పటివరకు విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్, నోట్ బుక్స్ పూర్తి స్థాయిలో అందలేదు. స్కూళ్ల ప్రారంభానికి ముందే సమకూర్చాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోకి రావడానికి వెనుకంజ వేస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతూ విద్యా వ్యాపా రం చేస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నాయి. ఎల్‌కేజీకి రాష్ట్రంలో రూ.లక్ష ఫీజు ఉంటే ఇంటర్ ఫీజు రూ.5లక్షలు ఉంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేదు. అనుమతి లేని పాఠశాలలు, కళాశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రెసిడెన్షియల్ విద్యాసంస్థలు జైళ్లకంటే హీనంగా మారి నిబంధనలు పాటించడం లేదు. రాష్ట్రం లో ఉన్న 33 జిల్లాల్లో సగానికి పైగా డిఇఒలు ఇన్చార్జిలే ఉన్నారు. ఎంఇఒలంతా ఇన్‌చార్జీలే. సంక్షేమ హాస్టల్, గురుకులాలు అనేకం అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణం గా విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ప్రభుత్వం సంక్షేమ హాస్టల్, గురుకులాలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్ల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తోంది. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం లేదు. ప్రతి ప్రభు త్వ పాఠశాల, ప్రతి జూనియర్ కళాశాల, హాస్టళ్లకు కరెంట్, ఇంటర్నెట్, తాగునీరు, మరుగుదొడ్లు, వంట షెడ్లు నిర్మించాలి. కెజి నుంచి పిజి వరకు ప్రతి విద్యార్థికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి. దక్షిణాది రాష్ట్రాలు అనేకం నూతన జాతీయ విద్యా విధానాన్ని(ఎన్ఈపి 2020)ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశాయి. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం చాపకింద నీరులా విడతలవారీ గా ఎన్ఇపి అమలవుతోంది. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో వెంటనే తీర్మానం చేయాలి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి విద్యార్థినికి ఎలక్ట్రిక్ స్కూటీలు, ప్రతి విద్యార్థికి ఉచిత ల్యాప్‌టాప్, ప్రతి విద్యార్థికి, ఇంటింటికి ఉచిత ఇంటర్నెట్, ఐదు లక్షల విద్యా భరోసా కార్డులాంటి హామీలను నెరవేర్చాలి.

ఈ నేపథ్యంలోనే విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యారంగ సమస్యల పరిష్కారంకోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 10న రాష్ట్రవ్యాప్తం గా పాఠశాలలు, కళాశాలల బంద్‌కి పిలుపునివ్వడం జరిగింది. ఈ బంద్ విజయవంతానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు సహకరించాలి. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ఒక్క చెంప పెట్టు లాగా జులై 10న రాష్ట్రంలో ఉన్న ఏ విద్యార్థి బడికి పోకుండా, ఏ విద్యార్థి విద్యాసంస్థ బస్సు ఎక్కకుండా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఈ బంద్ ద్వారా అయినా ప్రభుత్వంలో చలనం కలిగి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆశిస్తున్నాం.

# పసిప్రాణాలు హరిస్తున్న ఇజ్రాయెల్... నిద్రపోతున్న ప్రపంచం!

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మానవాళి సాధించిన అద్భుత ప్రగతి, యుద్ధభూమిలో పసిప్రాణాలను బలితీసుకునే పరిస్థితులకు దారితీస్తే, అది నాగరిక సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన నైతిక సంక్షోభంగా పరిగణించాల్సి ఉంటుంది. గజాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో పిల్లలపై పడుతున్న ప్రభావంపై ఐక్యరాజ్యసమితి సంస్థలు, మానవ హక్కుల సంస్థలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఐక్యరాజ్యసమితి సంస్థలు ఉదహరించిన గాజా ఆరోగ్య అధికారుల నుండి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, సుమారు 20వేల మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోగా, 44 వేల మందికి పైగా పిల్లలు తీవ్రంగా గాయపడినట్లు, వారిలో అనేక మంది శాశ్వత అంగవైకల్యానికి గురైనట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, దాడుల వెనుక అసలు లక్ష్యం ఏమిటి? అంతర్జాతీయ మానవతా చట్టాలు పసిప్రాణాలను రక్షించడంలో ఎందుకు విఫలమవుతున్నాయి? అనే ప్రశ్నలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.



**జస్టిస్ మురళీధర్ నేతృత్వంలోని కమిషన్ నివేదిక..**

ఇటీవల వెలువడిన ఒక ఐక్యరాజ్యసమితి స్వతంత్ర విచారణ కమిషన్ నివేదికలో నమోదైన ఆరోపణల ప్రకారం, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు, థర్మల్ ఇమేజింగ్ సాంకేతికత కలిగిన క్వాడ్‌కాప్టర్ డ్రోన్‌లను ఉపయోగించి పిల్లలను గుర్తించి కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, వైద్యుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను కూడా కమిషన్ నమోదు చేసింది. అయితే, ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ప్రభుత్వం పూర్తిగా తిరస్కరిస్తూ, సాధారణ పౌరులకు జరిగిన ప్రాణనష్టం ఉద్దేశపూర్వకమైనది కాదని తన అధికారిక వైఖరిని వెల్లడిస్తోంది. మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్. మురళీధర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఐక్యరాజ్యసమితి స్వతంత్ర కమిషన్ సమర్పించిన సుమారు 100 పేజీల నివేదిక గజాలో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన వివిధ ఆధారాలను పొందుపరిచింది. నివేదికలో నమోదైన వైద్యుల వాంగ్మూలాల ప్రకారం, కొందరు చిన్నారుల తలలు, మెడ భాగాలు లక్ష్యంగా చేసుకున్నట్లుగా కనిపించే గాయాలను తాము గమనించినట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. సాధారణ పౌరులకు, ముఖ్యంగా పిల్లలకు జరిగిన ప్రాణనష్టం యుద్ధ పరిస్థితుల్లో జరిగిన దురదృష్టకర పరిణామమే తప్ప ఉద్దేశపూర్వకమైనది కాదని ఇజ్రాయెల్ తన అధికారిక వైఖరిలో పేర్కొంటోంది. మరోవైపు, ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాలయాలు వంటి మౌలిక వసతుల ధ్వంసం, నిర్బంధంలో ఉన్న పిల్లలపై జరిగినట్లు నివేదికల్లో నమోదైన ఆరోపణలు ఈ వివాదాన్ని మరింత సంక్లిష్టంగా మార్చుతున్నాయి. ఆరోపణలపై భిన్న వాదనలు కొనసాగుతున్న నేపథ్యంలో, అంతర్జాతీయ స్థాయిలో స్వతంత్ర విచారణలు, పరిశీలనలు కొనసాగుతున్నాయి.

**అంతర్జాతీయ సమాజపు మౌనం..**

బాలల హక్కుల పరిరక్షణ గురించి బహిరంగంగా మాట్లాడే ప్రపంచ దేశాలు, ఇలాంటి తీవ్ర ఆరోపణలపై తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శకులు పేర్కొంటున్నారు. ఈ వైఖరి వెనుక భౌగోళిక, రాజకీయ, వ్యూహాత్మక ప్రయోజనాలు పనిచేస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చారిత్రకం గా అలీన విధానాన్ని అనుసరించిన భారతదేశం కూడా ఇజ్రాయెల్‌తో ఉన్న వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాల నేపథ్యంలో ఈ అంశంపై అత్యంత జాగ్రత్తతో కూడిన దౌత్య వైఖరిని అవలంబిస్తోందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్ష నాయకులు, విశ్లేషకులు, పలు జాతీయ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసా లు కూడా ప్రభుత్వాల ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తున్నాయి. అదే సమయంలో, భారత ప్రభుత్వం గాజాలో మానవతా సహాయం, పౌరుల రక్షణ, రెండు దేశాల పరిష్కారానికి మద్దతు వంటి అంశాలపై అధికారికంగా తన వైఖరిని పలు సందర్భాల్లో వెల్లడించింది. అయినప్పటికీ, అంతర్జాతీయ సంస్థలు అగ్రరాజ్యాల రాజకీయ ఒత్తిళ్ల ప్రభావంలో సమర్థవంతంగా పనిచేయలేకపోతున్నాయనే విమర్శలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. యుద్ధాలు కేవలం భూభాగాలను మాత్రమే కాదు, ఒక సమాజం యొక్క భవిష్యత్తును కూడా ఛిద్రం చేస్తాయి. గజాలో తన కుటుంబ సభ్యుల మృతదేహాల మధ్య కారులో చిక్కుకుని, రక్షణ కోసం గంటల తరబడి వేచి చూసిన ఐదేళ్ల చిన్నారి హింద్ రజబ్ చివరకు ప్రాణాలు కోల్పోయిన ఘటన ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆవేదన కు కారణమైంది. ఆ ఘటనకు సంబంధించిన పరిస్థితులపై పలు దర్యాప్తులు, నివేదికలు వెలువడినప్పటికీ, అది గాజాలో నెలకొన్న మానవతా సంక్షోభానికి ఒక విషాద ప్రతీకగా నిలిచింది. గాజాలో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన ఆరోపణలు, వాటిపై కొనసాగుతున్న దర్యాప్తులు, అంతర్జాతీయ స్పందన ప్రపంచ మానవ హక్కుల వ్యవస్థ ఎదుర్కొంటు న్న సవాళ్లను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ తరహా ఆరోపణలపై సమగ్ర, స్వతంత్ర, పారదర్శక విచారణలు జరిగి, వాస్తవాలు నిర్ధారితమైతే బాధ్యులపై అంతర్జాతీయ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవడం అంతర్జాతీయ సమాజం బాధ్యత. పసిప్రాణాల అరుపులు ప్రపంచ మనస్సాక్షిని మేల్కొల్పలేకపోతే, మానవత్వం తన అసలు అర్థాన్నే కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు విభేదాలకు అతీతంగా పిల్లల రక్షణను అత్యున్నత ప్రాధాన్యంగా గుర్తించి, అంతర్జాతీయ మానవతా చట్టాల అమలును మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# ఆదిలాబాదీయులకి అందనంత దూరంలో ఉన్నత విద్య

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం దాటినా, ఉన్నత విద్యా అవకాశాల విషయంలో ప్రాంతీయ అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు. తెలంగాణలోని అనేక ఉమ్మడి జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాధారణ విశ్వవిద్యాలయాలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాకతీయ విశ్వవిద్యాలయం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు విశ్వవిద్యాలయం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ విశ్వవిద్యాలయం, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శాతవాహన విశ్వవిద్యాలయం, ఉమ్మడి నల్గొండ జిల్లాలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకేంద్రాలు మరియు ఇతర ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. అయితే భౌగోళికంగా విస్తారమైన, గిరిజన జనాభా అధికంగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇప్పటికీ పూర్తి స్థాయి రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయం లేకపోవడం ఒక ముఖ్యమైన విద్యా సమస్యగా నిలిచింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ ఉత్తర సరిహద్దులో ఉంది. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలుగా విభజించబడిన ఈ ప్రాంతంలో వేలాది మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేస్తున్నారు. అయితే పీజీ, పరిశోధన, వృత్తి నైపుణ్య కోర్సుల కోసం హైదరాబాద్, వరంగల్ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత విద్యను మధ్యలోనే వదిలివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు ప్రాపంచిక జ్ఞానానికి దూరం అవుతూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వివక్షతలకి లోనవుతున్నారు.

ఉన్నత విద్య అనేది కేవలం ఉద్యోగాల కోసమే కాదు; అది సమాజంలో జ్ఞానం, అవగాహన, శాస్త్రీయ దృక్పథం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే సాధనం. ఒక ప్రాంతంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కావడం వల్ల స్థానిక విద్యార్థులకు చదువుల అవకాశాలు పెరగడమే కాకుండా, పరిశోధన, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి కూడా మార్గం ఏర్పడుతుంది. అంతే కాకుండా విశ్వవిద్యాలయం ఉన్న ప్రాంతంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తూ, నూతన వ్యాపార సంస్థలు కూడా ఏర్పాటవుతాయి.అందువల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం కాలానుగుణ అవసరంగా మారింది.నేటి తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలి. విద్యారంగంలో ప్రాంతీయ విభేదాలు తలెత్తకుండా సాధారణ విశ్వవిద్యాలయాలు లేని ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, ఖమ్మం జిల్లాలలో సాధారణ విశ్వవిద్యాలయాలు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా మొట్టమొదటగా భౌగోళికంగా వెనుకబడిన ఆదిలాబాద్ కేంద్రంగా లేదా జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిలో పూర్తిస్థాయి రాష్ట్ర విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలి. ముఖ్యంగా గిరిజన అధ్యయనాలు, అటవీ వనరులు, వ్యవసాయం, పర్యావరణ శాస్త్రం, ఖనిజ వనరులు, ప్రజా ఆరోగ్యం వంటి ప్రాంతీయ అవసరాలకు అనుగుణమైన ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. అయితే రాష్ట్ర పరిధిలోని సాధారణ విద్యాలయం ఉమ్మడి మెదక్, ఖమ్మం జిల్లాలో లేకున్నా హైదరాబాద్‌కి 100 కిలోమీటర్ల దూరం ఉండడం వల్ల ఓయూ పరిధిలో ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థులు, కేయూ పరిధిలో ఖమ్మం విద్యార్థులు సులభతరంగా ఆధునిక ఉన్నత విద్యని అభ్యసిస్తున్నారు. కానీ హైదరాబాద్ జిల్లాకి 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకి ఏ ఒక్క సాధారణ విశ్వవిద్యాలయం లేకపోవడం వల్ల ఆ ప్రాంత విద్యార్థులు అక్కడి భౌగోళిక పరిస్థితుల వల్ల దూరప్రాంతాలకు వెళ్లి ఆధునిక విద్యను పొందలేకపోవడం ఒక కారణం ఐతే, అత్యధికంగా ఆర్థికంగా వెనుకబడిన గిరిజన, దళిత, బహుజన కులాలు ఉండటం వల్ల ఉమ్మడి అదిలాబాద్ జిల్లా విద్యార్థులు ఉన్నత విద్యకి అందనంత దూరంలో ఉంటున్నారు. అది ప్రాంతీయ సమానత్వానికి, సామాజిక న్యాయానికి, విద్యా హక్కుల విస్తరణకు సంకేతం. ఇది ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చడమే కాకుండా, తెలంగాణ అభివృద్ధి చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

పుల్లెంల గణేష్, 9553041549



# గ్రామాల్లో ‘తాగునీటి’ సమస్య రావొద్దు..

- ‘నీటిపారుదల’ నిరంతరం సమన్వయం చేయాలి
- ప్రత్యామ్నాయ నీటి వనరులు వినియోగించండి: మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వర్షపాతం తగ్గినా, ‘ఎల్‌నినో’ ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. అన్ని జలాశయాల్లో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలను ప్రతి జలాశయాల్లో ముందుగానే నిర్ధారించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని నివాస ప్రాంతాలకు స్థానిక మంచి నీటి వనరులను వినియోగిస్తూ, ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా వ్యవస్థను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మంత్రి సీతక్క అధ్యక్షతన తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం జరిగింది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా పరిస్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, రాబోయే నెలల్లో తాగునీటి అవసరాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రంలోని గ్రామీణ జనావాసాలకు ప్రధానంగా కృష్ణా, గోదావరి బేసిన్ల ఉపరితల జల వనరుల నుంచి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. తాగునీటి కోసం వినియోగిస్తున్న 29 జలాశయాల నుంచి 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో, ప్రతి జలాశయంలో 45 రోజులు, 90 రోజులు, 180 రోజుల అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతపై మంత్రి సీతక్క సమీక్షించారు. జూలై నెలాఖరు వరకు తగిన నీటి ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసేలా ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రస్తుతం సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో, రాబోయే 45 రోజుల్లో సింగూర్‌లోకి తగిన నీటి ప్రవాహం రాకపోతే సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి (పాక్షికంగా), నిజామాబాద్ (పాక్షికంగా) జిల్లాల్లోని గ్రామీణ జనావాసాలు, పట్టణ ఆధారిత నివాస ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల ఆధారిత తాగునీటి పథకాలను వినియోగించేలా తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో బోర్లను లోతుగా తవ్వడం, ఫ్లషింగ్ చేసి, అవసరమైతే బోర్‌వెల్స్‌ను అద్దెకు తీసుకోవడం వంటి చర్యలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కి షోర్, మిషన్‌భగీరథ ఇంజనీర్‌ఇన్‌చీఫ్ కృపాకర్ రెడ్డి, ఇతర చీఫ్ ఇంజనీర్లు,బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

**విఒఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి**

రాష్ట్రంలో గత రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న విఒఎలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, ఐకెపి విఒఎ–ఫీల్డ్ అసిస్టెంట్లు–మిషన్ భగీరథ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించిన ప్రతినిధి బృందం, ఉద్యోగ భద్రతతో పాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది.



# వానాకాల సాగుకు వెంటనే ఏర్పాట్లు పూర్తి

- వ్యవసాయానికి అవసరమైన అన్ని చర్యలను పూర్తి చేయాలి
- అధికారులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ కార్యకలాపాలు ఎలాంటి అంతరాయం లేకుండా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు విత్తనం నాటినప్పటి నుంచి పంట విక్రయించే వరకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ పరిస్థితులు, ఆయిల్ పామ్ విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల సరఫరా, ఎరువుల లభ్యత, మొక్కజొన్న కొనుగోలు చెల్లింపులు, రైతు భరోసా నిధుల పంపిణీ, ఎల్‌నినో పరిస్థితులకు ప్రత్యామ్నాయ కార్యాచరణ తదితర కీలక అంశాలపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు పొలాల్లో నాటేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో మొక్కల కొరత రావడం లేదా సరఫరాలో ఆలస్యం జరగడం వంటివి ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. జిల్లాల వారీగా ఉన్న అవసరాలను ముందుగానే శాస్త్రీయంగా అంచనా వేసి, నర్సరీల నుంచి సకాలంలో రైతులకు మొక్కలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు విజయవంతం కావడానికి డ్రిప్ ఇరిగేషన్ ఎంతో కీలకమని మంత్రి స్పష్టం చేశారు. డ్రిప్ పరికరాల సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా తయారీ, సరఫరా క్షేత్రస్థాయిలో అమలు చేసే సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ సబ్సిడీ ప్రయోజనాలు రైతులకు చేరడంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా, పరిపాలనా ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**పెండింగ్ లేకుండా మొక్కజొన్న చెల్లింపులు, ఎరువుల సరఫరా**

మొక్కజొన్న కొనుగోళ్లపై జరిగిన సమీక్షలో భాగంగా, రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. చెల్లింపుల ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో నగదు జమయ్యేలా మార్క్‌ఫెడ్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, వానాకాలంలో యూరియా సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు జిల్లాల వారీగా ఉన్న నిల్వలు, పంపిణీ వివరాలను పర్యవేక్షిస్తూ, స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల సరఫరా జరిగేలా ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు జరిపించేందుకు గల సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని మంత్రి అధికారులకు కీలక సూచన చేశారు.

ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో తీసుకోవాల్సిన తొలి ప్రత్యామ్నాయ కార్యాచరణను జిల్లాల వారీగా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇందుకోసం రైతు వేదికలు, గ్రామసభలు, క్షేత్రస్థాయి సమావేశాలను వేదికగా చేసుకుని రైతులకు అవసరమైన శాస్త్రీయ సూచనలు, సలహాలు అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.




# లేబర్ కోడ్స్‌పై తొందరపాటు లేదు

**కార్మికులు, పరిశ్రమలకు సమతుల్య విధానమే లక్ష్యం : మంత్రి వివేక్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల సంక్షేమాన్ని కాపాడుతూనే పరిశ్రమల అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, లేబర్ కోడ్స్ అమలులో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోబోమని కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. కార్మిక సంఘాలు, పారిశ్రామిక వర్గాలతో విస్తృతంగా చర్చించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నిబంధనలను రూపొందిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో మంగళవారం నిర్వహించిన లేబర్ కోడ్స్‌పై భాగస్వాముల సంప్రదింపుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, పరిశ్రమలు సజావుగా, లాభదాయకంగా కొనసాగితేనే ఉపాధి అవకాశాలు పెరిగి కార్మికులకు మరిన్ని సంక్షేమ ప్రయోజనాలు అందించే అవకాశం ఉంటుందన్నారు. యాజమాన్యాలు, కార్మికులు పరస్పర సహకారంతో ముందుకు సాగితే పరిశ్రమలకు సానుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. లేబర్ కోడ్స్‌కు సంబంధించి కార్మిక న్యాయస్థానాల అంశాలు, రాష్ట్ర ప్రయోజనాలు, కేంద్ర ప్రభుత్వానికి చేయాల్సిన సిఫార్సులు, రూపొందించాల్సిన నిబంధనలపై సమగ్ర చర్చ జరగాలని మంత్రి సూచించారు. పారిశ్రామిక వర్గాలు, కార్మిక సంఘాలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు. కార్మికుల హక్కులు, పరిశ్రమల అవసరాలు రెండింటినీ సమన్వయం చేసే విధానానికే ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసేందుకు పారిశ్రామిక సంఘాలతో నెలలుగా చర్చలు జరుపుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్‌టెక్నాలజీ సెంటర్ల (ఎటిసిలు) ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను సిద్ధం చేస్తామని వివరించారు. లేబర్ కోడ్స్‌పై అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# కాళేశ్వరంపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదు

తొమ్మిదిన్నరేళ్లలో ఎందుకు సమస్యలు పరిష్కరించలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలి : మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టును అప్పగిస్తే వారం రోజుల్లో నీళ్లు ఇస్తామని చెబుతున్న మాజీ మంత్రి కెటిఆర్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్లలో ఎందుకు సమస్యలను పరిష్కరించలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. నీళ్లు లేని సమయంలో సముద్రంలోకి నీటిని వదులుతున్నారని చేస్తున్న వ్యాఖ్యలు ఆయన అనుభవ రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఎన్‌డిఎస్, సిడబ్ల్యుసి అనుమతులు లేకుండా బ్యారేజీల నిర్వహణ చేపట్టడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఎన్‌డిఎస్ఎ ఇప్పటికే బ్యారేజీల పునాదుల్లో లోపాలను గుర్తించిందని, వాటిని సరిచేయకుండా నీటిని నిల్వ చేయడం శాస్త్రీయంగా సరైంది కాదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అన్ని సాంకేతిక పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే కాళేశ్వరం పునరుద్ధరణ పనులు చేపడతామని మహేష్‌కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లుగా హడావుడి నిర్ణయాలు తీసుకోబోమని, ప్రజల నీటి సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని అక్రమాలు చేసిన గత ప్రభుత్వ వైఫల్యాలపై కెటిఆర్ ముందుగా పశ్చాత్తాపం వ్యక్తం చేయాలని, లేదంటే ప్రజలే బిఆర్ఎస్ నేతలకు తగిన బుద్ధి చెబుతారని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించా రు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బిఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదని, ఆ ప్రాజెక్టుపై బిఆర్ఎస్ నేతలు మాట్లాడడం విడ్డూరమని ఆయన విమర్శించారు. కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతి కారణంగానే ప్రాజెక్టు నాణ్యత దెబ్బతిని ‘కాళేశ్వరం’ కాస్తా ‘కూళేశ్వరం’గా మారిందని ఆయన ఆరోపించారు. ఇంజినీర్ల సూచనలను పక్కన పెట్టి అప్పటి సిఎం కెసిఆర్ తనను తాను ఇంజినీర్‌గా భావించుకుని తీసుకున్న ఏకపక్ష నిర్ణయాల వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యత దెబ్బతిన్నదన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగా దాని మనుగడకే ముప్పు ఏర్పడిందని ఆరోపించారు.

**బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేనని మరోసారి తేలింది**

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ వైఖరి చూస్తుంటే ఆయన బిజెపి నాయకుడిగా మాట్లాడుతున్నారో లేక బిఆర్ఎస్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని మహేష్ కుమార్ విమర్శించారు. కాళేశ్వరం విషయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన సూచనలను పక్కనబెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని విడుదల చేయొద్దని చెప్పింది రాష్ట్ర ప్రభుత్వం కాదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఎన్‌డిఎస్ఎ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. కెటిఆర్ సాంకేతిక నిపుణుడు కాదని, ఈ విషయంలో ఎన్‌డిఎస్ఎ నిపుణుల అభిప్రాయాలకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి ఎన్‌డిఎస్ఎ నిర్ణయంపై వివరణ కోరాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా కేంద్ర సంస్థ ఇచ్చిన సూచనలను విస్మరించి రాజకీయ ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ మధ్య ఉన్న రాజకీయ సంబంధాలు మరోసారి బయటపడుతున్నాయని, ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ అన్నట్లుగా రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఈ రాజకీయ నాటకాలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ముందుకు తీసుకెళ్లి ఎండగడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# శాఖ అధికారాలపై కాంగ్రెస్‌లో కొత్త వివాదం

కడియం శ్రీహరిపై సిఎం రేవంత్‌కు మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేవాదాయ శాఖ అధికారులతో తనకు సమాచారం ఇవ్వకుండా అధికారిక సమీక్ష సమావేశం నిర్వహించారని ఆరోపిస్తూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం ప్రభుత్వ పరిపాలనా విధానాలకు, శాఖా మంత్రి అధికార పరిధికి విరుద్ధమని పేర్కొంటూ పార్టీ క్రమశిక్షణా కమిటీతో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రికి రాసిన లేఖలో, దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన విధాన నిర్ణయాలు, అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ సంబంధిత శాఖా మంత్రి పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. అయినప్పటికీ తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పా టు ఇతర అధికారులతో సమావేశమై పలు దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అధికారులకు గడువులు నిర్దేశించడం వంటి అంశాలపై అధికారిక సమీక్ష నిర్వహించారని ఆరోపించారు. ఈ చర్య ప్రభుత్వ నిబంధనల స్ఫూర్తిని ఉల్లంఘించడమే కాకుండా, శాఖా మంత్రి అధికారాలను బేఖాతరు చేసినట్లేనని మంత్రి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులందరికీ శాఖా పరిపాలనకు సంబంధించిన విధాన నిర్ణయాలు సంబంధిత మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలన్న విషయం తెలిసినప్పటికీ, శాఖా మంత్రిని పూర్తిగా పక్కనపెట్టి సమీక్ష నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి దారితీస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వంలో పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీసి అధికార యంత్రాంగంలో అయోమయ పరిస్థితులు సృష్టించే ప్రమాదం ఉందని లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్టీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి సంబంధిత అంశాలపై వివరణ కోరాలని, అవసరమైతే పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

# రూ.360 కోట్లతో రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

10 ఆర్‌డిఒ, 107 తహసీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం
ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్‌డిఒ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రెవెన్యూ భవనాల నిర్మాణాలపై మంగళవారం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్‌డిఒ కార్యాలయాలకు రూ.263 కోట్లతో అలాగే స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్లతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు,నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డిఐజి కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి రూ.360 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో కలిసి నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదేళ్ల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

# ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా గుర్తింపు ప్రక్రియ

కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యమకారులతో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజమైన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరిగేలా సమగ్ర నివేదికను సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యమ నేతలకు హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, వారి సామాజిక భద్రత, సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ మంగళవారం అమరవీరుల జ్యోతి ప్రాంగణంలో కాకతీయ విశ్వవిద్యాలయం (కెయు) విద్యార్థి ఉద్యమకారులతో సమావేశమైంది. ఈ సమావేశంలో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరాం, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్, మోతే శోభన్‌రెడ్డి పాల్గొని విద్యార్థి నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన విద్యార్థి నాయకుల సూచనలు, అభిప్రాయాలను కమిటీ సభ్యులు స్వీకరించారు. తెలంగాణ ఉద్యమంలో కాకతీయ విశ్వవిద్యాలయం పోషించిన పాత్రను గుర్తిస్తూ, ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుంద ని సభ్యులు పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమకారులు మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు కార్డులతో పాటు వారి కుటుంబాలకు ఉపాధి, విద్య, వైద్యం, పెన్షన్ వంటి సామాజిక భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. మాజీ కాకతీయ విశ్వవిద్యాలయ జెఎసి వరంగల్ కన్వీనర్, ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రితో పాటు వివిధ కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యమ నాయకత్వం తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు సీనియర్ ఉద్యమ నా యకులు, విద్యార్థి నాయకులు, ఉద్యమ కార్యకర్తలతో కలిసి కమిటీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల విద్యార్థుల పాత్ర చారిత్రాత్మకమన్నారు. సమావేశంలో వచ్చిన అన్ని సూచనలు, సంక్షేమ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరిగేలా సమగ్ర నివేదిక సిద్ధం చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసి, ఉద్యమంలో విశేష సేవలందించిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవం, అధికారిక గుర్తింపు ఇచ్చి న్యాయం చేయాలని డాక్టర్. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కమిటీని కోరారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి



సిపిఐ శిక్షణా తరగతుల్లో జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాపక్షం/భద్రాచలం :** రాజకీయ పార్టీలను విభజించి లబ్ధి పొందే ప్రయత్నంలో బిజెపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ ఆరోపించారు. 2004 ఎన్నికల్లో 300 సీట్ల కోసం ప్రయత్నం చేసి భంగపడ్డ బిజెపి దేశంలోని రాజకీయ పార్టీలను చీల్చి పార్లమెంట్‌లో ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు వేంపర్లాడుతోందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కౌన్సిల్ సభ్యుల స్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు మంగళవారం భద్రాచలంలో ప్రారంభమయ్యాయి. ముందుగా పార్టీ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ఆవిష్కరించారు. శిక్షణా తరగతులను ప్రారంభించిన రామకృష్ణ , సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో విపక్షాలను చీల్చే ప్రయత్నం చేస్తూ కాషాయం పార్టీ వికృత క్రీడకు తెరలేపిందన్నారు. బెంగాల్‌లో బిజెపి వ్యవహరించిన తీరు ప్రజా స్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. ఒక పక్క సర్ పేరుతో ఓట్లను తొలగిస్తూ మరో పక్క రాజకీయ పార్టీలను ముక్కలు చేస్తుందని రామకృష్ణ ఆరోపించారు. బిజెపి అధికారంలోనికి రావడానికి కారణమైన రామనామానికే చివరకు శఠగోపం పెట్టే పరిస్థితి తీసుకొస్తోందన్నారు. దేశవ్యాప్తంగా రూ.3624 కోట్ల విరాళాలు వచ్చాయని చెబుతున్న మత సంస్థలు దారితప్పిన నిధులపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని రామకృష్ణ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాల నిధుల కైంకర్యంతో బిజెపి భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. దీనిపై బిజెపి మిత్రపక్షాలు స్పందించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల అవసరాలను గుర్తించి పాలన చేయని వారిని గద్దె దింపుతున్నారని, ఇందులో యువత ప్రధాన పాత్రపోషిస్తోందని రామకృష్ణ అన్నారు. ప్రస్తుత తరం మార్పు కోరుకుంటోందని తెలిపారు. ఇటీవల దేశంలో కాక్రోచ్ జనతా పార్టీకి వచ్చిన స్పం దన తమిళనాడులో టివికే గెలుపు ఇవన్నీ మార్పులను సూచిస్తున్నాయన్నారు. కొత్తగూడెంలో ఒక సానుకూల పరిణామం తొలి మేయర్ గెలిచేందుకు కారణమైందని, అలాంటి పరిస్థితులే దేశంలో పునరావృతం కానున్నాయన్నారు. పెరిగిన నిరుద్యోగం, అవినీతి, ఆర్థిక అంతరాలు రానున్న కాలంలో మార్పుకు దారితీస్తాయని ఆయన తెలిపారు. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లో వచ్చిన పరిణామాలు భారత్‌లో కూడా రానున్నాయన్నారు. యువత విద్యార్థులను ఆకర్షించడం ద్వారా ముందుకు సాగాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.

**బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ**

సిపిఐ బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందని రామకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు ఆగస్టు 6 నుండి 15 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామగ్రామాన పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న ప్రస్తుతం బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను నిరశిస్తూ చలో ఢిల్లీ పిలుపునిచ్చామని ఆయన తెలిపారు. ఈ తొలిరోజు శిక్షణ తరగతుల్లో మార్క్సిజం సమకాలీన సమాజంలో దాని ప్రాధాన్యత అనే అంశాన్ని ప్రొ॥యు గల్ రాయల్, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో భారదేశం అనే అంశాన్ని బివి మోహన్ రెడ్డి బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, జమ్ముల జితేందర్ రెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎర్రా బాబు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌కె జానీమియా, మున్నా లక్ష్మి కుమారి, ఏపూరి లతాదేవి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**మూసాపేట్ సర్కిల్-53**

**NIT No.** 12/EOI/CMC/MPT/EE/2026-27, తేది: 07.07.2026, **పని పేరు:** సిఎంసి, కెపిజెడ్, మూసాపేట్ సర్కిల్ పరిధిలోని క్రీడా ప్రాంగణం మరియు వైకుంఠదామం (హిందూ స్మశాన వాటిక) నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ మరియు బిడ్ ఆహ్వానం, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 09.07.2026 ఉ.10.30గం.ల నుండి 23.06.2026 ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీమతి టి.రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మూసాపేట్ సర్కిల్-53, సిఎంసి. ఫోన్ నెం. 8897507674. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మూసాపేట్ సర్కిల్-53.

DIPR R.O. No. : 5650-PP/CL/ADVT/2026-27, Date: 07-07-2026

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
"ELECTRICITY SAVED IS ELECTRICITY PRODUCED"

**టెండర్ నోటీసు నెం : 03/26-27**

**(A)Spec.T-13 :** ఏప్రిల్ -2026 నుండి మార్చి-2027వరకు SCADA సర్కిల్ ఆఫీస్ భవనంలో అందుబాటులో ఉన్న వివిధ విద్యుత్ పరికరాల నిర్వహణ కోసం. **(B) Spec.T-14 (SCలకు రిజర్వ్ చేయబడింది) :** ఏప్రిల్ 2026 నుంచి మార్చి 2027వరకు SCADA సర్కిల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఎయిర్ కండీషనర్ల నాన్ కాంప్రహెన్సివ్ యాన్యువల్ మెయింటెనెన్స్. **(C) Spec.T-15 :** SCADA-DMS డివిజన్‌లోని SCADA నార్త్ SD పరిధిలోగల బంజారాహిల్స్ సర్కిల్‌లోని వివిధ 33/11 KV సబ్ స్టేషన్ల (29సంఖ్య) వద్ద SCADA-DMS పరికరాల నిర్వహణ. **(D)Spec.T-16 (STలకు రిజర్వ్ చేయబడింది) :** SCADA-DMS డివిజన్‌లోని SCADA నార్త్ SD యొక్క సికింద్రాబాద్ సర్కిల్‌లో ఉన్న వివిధ 33/11 KV సబ్ స్టేషన్ల (27 సంఖ్య) వద్ద పరికరాల నిర్వహణ. **(E) Spec. T-17 :** SCADA-DMS డివిజన్‌లోని SCADA సౌత్ SD పరిధిలోగల వివిధ 33/KV సబ్ స్టేషన్ల (28 సంఖ్య) వద్ద పరికరాల నిర్వహణ. **(F) Spec. T-18 :** SCADA-DMS డివిజన్‌లోని SCADA సెంట్రల్ సర్కిల్‌లో వివిధ 33/11 KV సబ్ స్టేషన్ల (27 సంఖ్య) వద్ద SCADA-DMS పరికరాల నిర్వహణ. **(G) Spec.T-19 :** SCADA-DMS డివిజన్‌లోని RR-II SCADA–DMS SDలో హబ్సిగూడ సర్కిల్‌లో 33/11 KV సబ్‌స్టేషన్ల (30 సంఖ్య)లో SCADA -DMS పరికరాల నిర్వహణ (మరిన్ని వివరాల కోసం దయచేసి website https : // tgsouthernpower.org) : ఫోన్ : 040–23431333/1112/1125ను సందర్శించగలరు.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్/SCADA.

DIPR R.O. No. : 5699-PP/CL/ADVT/2026-27 Date: 07-07-2026

## అలియాబాద్ మున్సిపాలిటిలో ఓటరు సవరణ పరిశీలన

మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేటః** అలియాబాద్ మున్సిపాలిటిలో ఓటరు సవరణ కార్యక్రమాన్ని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు లిస్టులోని ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును ధృవీకరించుకోవాలని చెప్పారు. ప్రస్తుతం సర్‌లో భాగంగా బిఎల్‌ఒలు అందజేస్తున్న ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా పూర్తిచేసి సకాలంలో సమర్పించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, వ్యక్తిగత వివరాల సవరణ, చిరునామా మార్పు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తు ఓటు హక్కు పరిరక్షణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిపిఒ పాండు, బిఎల్‌ఎ, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

**ఉచిత వ్యాక్సిన్‌ను వేయించుకోవాలి**

కాగా అలియాబాద్ మున్సిపాలిటి పరిధిలోని తుర్కపల్లి ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పివి వ్యాక్సిన్‌ను పంపిణీ కార్యక్రమాన్ని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. అర్హులైన 14 నుంచి 15సంవత్సరాల వయస్సు గల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న హెచ్‌పివి వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్మార్ట్ వ్యవసాయంపై జ్యోతికి పిహెచ్‌డి పట్టా

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** వ్యవసాయరంగంలో కృత్రిమ మేధస్సు అంతర్జాల అనుసంధాన సాంకేతికతలతో పంటల దిగుబడి నాణ్యత ఉత్పాదకతను మెరుగుపరిచే వినూత్న పరిశోధనను పూర్తిచేసి అనురాగ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకురాలు వి.జ్యోతి పీహెచ్‌డీ పట్టా పొందారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన వి.జ్యోతి డీన్ డాక్టర్ జి విష్ణుమూర్తి పర్యవేక్షణలో కృత్రిమ మేధస్సు ఆధారిత అంతర్జాల అనుసంధాన ముందుస్తు అంచనా వ్యవస్థ ద్వారా స్మార్ట్ వ్యవసాయం అంశంపై పరిశోధన నిర్వహించి విజయవంతంగా పూర్తి చేశారు. ఈ పరిశోధన రైతులకు సాంకేతిక ఆధారిత వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవడంలో ఉపయోగపడుతుందని విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ అర్చనా మంత్రీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి నీలిమ, ఇంజినీరింగ్ పాఠశాల డీన్ డాక్టర్ వి.విజయ్ కుమార్, పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ముత్తా రెడ్డి, పరిశోధన పర్యవేక్షకులు డాక్టర్ జి. విష్ణుమూర్తి వి.జ్యోతిని అభినందించారు.



## పారిశ్రామికవాడలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు

**ప్రజాపక్షం/చర్లపల్లిః** కార్మికుల పరిరక్షణ కోసం చర్లపల్లి పారిశ్రామికవాడలోని సిఐఎ భవనంలో చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం, ఐలా,లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సంయుక్తంగా నిర్వహించిన ఫ్రీ హెల్త్ క్యాంపుకు ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ మెగా హెల్త్ క్యాంపుకు నీలిమ హస్పిటల్స్,ఎంఎన్‌జె కాన్సర్ ఆసుపత్రి, ఎంఎస్ రెడ్డి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 3000 జనరల్ చెకప్, ఆర్థోపెడిక్, క్యాన్సర్, స్క్రీనింగ్, గైనాకలాజి, గుండె, కిడ్నీ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐఎ అధ్యక్షులు డిసిరెడ్డి, టిఫ్ అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, నీలిమ ఆసుపత్రి డైరెక్టర్ నీలిమ, ఐలా అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలి

'ప్రజావాణి'లో చిన్నారెడ్డికి జెఏసి వినతి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ః** జవహర్ నగర్‌లోని గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకై స్థల సేకరణ చేసి, తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గబ్బిలాలపేట ప్రభుత్వ పాఠశాల పోరాట కమిటీ (జెఏసి) ఆధ్వర్యంలో మంగళవారం సీఎం క్యాంప్ ఆఫీస్ ప్రజావాణిలో చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుండి సేకరించిన సుమారు 6,000 సంతకాల పత్రాలను, గతంలో నిర్వహించిన మానవహారం ఫోటోలను ఆయనకు అందజేశారు. దీనిపై చిన్నారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, గబ్బిలాలపేట పరిసర ప్రాంతాల్లో పాఠశాల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు.



ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు లేని స్థానిక పిల్లలకు వాటిని జారీ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూస్తామని, ఈ సమస్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

**పేద పిల్లల భవిష్యత్తుకు విద్యే పునాది:** అనంతరం జెఏసి నాయకులు మీడియాతో మాట్లాడుతూ... వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలోని అసమానతల తొలగింపునకు విద్యే ఏకైక మార్గమని, అందుకే గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల సాధనకోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. పేద పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇక్కడ తక్షణమే పాఠశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి కన్వీనర్ తోటపల్లి శంకర్, కోకన్వీనర్లు ఎ.నరసింహా గౌడ్, షేక్ షావలి, కొండలు ముదిరాజ్, బిర్రు యాకస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఒలకు 'సర్'పై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని చంద్రపురి కాలనీ బూత్ లెవెల్ ఆఫీసర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్ ప్రోగ్రాం అవగాహన సదస్సు విజయవంతంగా ముగిసింది. గౌరవ డిప్యూటీ కమీషనర్, జవహర్ నగర్ ఏఈఆర్ఓ జి.రామలింగం, అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి కమీషనర్ రామలింగం మాట్లాడుతూ, ఓటరు నమోదు సవరణల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయడం కోసం సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## భూ సమస్యల పరిష్కారానికి
# భూ సర్వే ఎంతో దోహదం

స్పీకర్ ప్రసాద్‌కుమార్





**ప్రజాపక్షం/ వికారాబాద్ :** భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే ఎంతగానో దోహదపడుతుంది అని శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా, ధారూర్ మండల తరిగోపాల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న గోదాము నిర్మాణానికి స్పీకర్ శంకుస్థాపన చేశారు. భూ భారతి భూసర్వేపై అవగాహన, గ్రామ సభ, మోమిన్‌రుకుర్దు గ్రామంలోఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. తరిగోపుల గ్రామ సర్పంచు అంజిలయ్య ఆధ్వర్యంలో భూ భారతి భూ సర్వేపై అవగాహన కార్యక్రమంలో స్పీకర్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. భూ సర్వే ద్వారా భూ తగాదాలు పూర్తిగా తగ్గుతాయని ఆయన అన్నారు. గ్రామంలోని పొలాలకు గ్రామకంఠం, ఇంటి స్థలాలకు భూ సర్వేలో భాగంగా సరిహద్దులను నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని నిలువ చేసుకునేందుకు గోదామల నిర్మాణాలకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. రైతులకు రైతుబంధుతో పాటు యంత్రాలు, ఎరువులు సబ్సిడీపై ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి 90కోట్ల రూపాయల నిధులు మంజురు చేయడం జరిగిందని ఇప్పటివరకు 60కోట్ల పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం మోమిన్‌కుర్దులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి మధుసూదన్, తహసీల్దార్ సాజిదాబేగం, పిఎసిస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచు అంజిలయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా ఎస్‌ఐఆర్ ప్రక్రియలో బూత్ స్థాయి ఏజెంట్లు అందరూ భాగస్వాములు కావాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ బూత్‌స్థాయి ఏజెంట్లు మున్సిపల్ కౌన్సిలర్లుతో సమావేశం జరిగింది. స్పీకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్‌గా నమోదయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. సజావుగా జరిగేలా బిఎల్‌ఒలు యువత అధికారులకు సహకరించాలని ఆయన తెలిపారు.

గ్రామాల్లో , మున్సిపల్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్ కార్డు నమోదు అయ్యే విధంగా ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. ప్రతి ఓటర్ కు ఎన్యూమరేషన్ ఫారాలుఅందే విధంగా బిఎల్ ఎలు, బిఎల్‌ఒలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి నారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, చైతన్య, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి కార్మికుల ఆందోళన

రూ.26 వేల కనీస వేతనం కోసం పోరుబాట



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్,పేషెంట్ కేర్ భద్రతా కార్మకులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ పాంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వు నెం.60 ప్రకారం కార్మికులకు రావాల్సిన వేతనాలు చెల్లించకుండా నాలుగేళ్లుగా కేవలం రూ.11 వేలే ఇస్తున్నారని జయచంద్ర ఆరోపించారు.అధికారులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.కొత్త టెండర్లలో రూ.26 వేల కనీస వేతనం పొందుపరచాలని పండుగ జాతీయ ఆర్జిత సెలవులు అమలు చేయాలని భవిష్యనిధి ఉద్యోగుల రాష్ట్ర బీమా సక్రమంగా జమ చేయడంతో పాటు బోనస్ చట్టం ప్రకారం ఏడాదికి ఒక నెల జీతాన్ని బోనస్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం జులై 7,8 తేదీలలో ఆసుపత్రుల వద్ద ధర్నాలు జులై 9న కోఠిలోని కమిషనర్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క సిసిటివి 100 మంది పోలీసులతో సమానం : సిపి సుమతి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నేరాల నియంత్రణకు సాంకేతికను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు మరింత భద్రత కల్పించాలన్న లక్ష్యంతో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ చేపట్టిన "మీ సురక్ష నేను సైతం 2.0" కార్యక్రమానికి అన్ని ప్రాంతాల్లో విశేష స్పందన లభిస్తోంది. ఆయా ప్రాంతాలకు చెందిన కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు, హోటళ్లు ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చి తమ ప్రాంతాల్లో అవసరమైన మేరకు సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తున్నా రు. దీనిలోని భాగంగా నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 109 సిసి కెమెరాల్లో వాయుపరి రిక్రియేషన్ సెంటర్ ఏర్పాటు చేసిన 63 కమ్యూనిటి కెమెరాలు, బృందావన్ కాలనీలో 21కమ్యూనిటి కెమెరాలను పోలీస్ కమిషనర్ బి. సుమతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుమతి మాట్లాడుతూ పోలీస్, ప్రజల భాగస్వామ్యంతోనే సమాజంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయన్నారు. ఒక్క సిసిటివి కెమెరా వందమంది పోలీసులతో సమానమని, ప్రతి వీధి, ప్రతి కాలనీపై నిరంతరం నిఘా ఉండాలంటే సిసిటివి కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. నేర పరిశోధనల్లో ఆయా ప్రాంతాల్లో ఉండే సిసిటివి కెమెరాల్లో నిగూఢమైన దృశ్యాల ఆధారంగా పోలీసులు త్వరితగతంగా దర్యాప్తు చేసి, నిందితులను కటకటాల వెనక్కు పంపించగలుగుతారన్నారు. నేరం జరిగిన వెంటనే ఆధారాలను సేకరించటంలోనే కాకుండా నేరాలను ముందుగానే అరికట్టటంలో సైతం ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. సిసిటివి పుటేజి సాయంతో ఈ ఏడాదిలోనే 214 కీలక కేసులను విజయవంతంగా ఛేదించగలిగామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, కాలనీల్లో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా పోలీసులకు అమూల్యమైన సహకారం అందిస్తున్నారని ప్రజలను ఆమె కొనియాడారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం 2,45,035 సిసిటివి కెమెరాలు పని చేస్తున్నాయని, ఈ ఏడాది 16,339 కొత్త కెమెరాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఆధునిక సాంకేతికను పోలీసింగ్‌లో భాగం చేస్తూ లండన్ తరహా డ్రోన్ పెట్రోలింగ్ వ్యవస్థను ఇప్పటికే ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రారంభించామని, ఈ విధానాన్ని కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపి సిహెచ్ శ్రీధర్, మల్కాజిగిరి ఎసిపి వి.యాదగిరిరెడ్డి, నేరేడ్‌మెట్ ఎస్‌హెచ్‌ఓ వెంకటయ్య, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 105 సిసిటివి కెమెరాల ప్రారంభోత్సవం**

జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఎత్తున సిసిటివి కెమెరాలను ప్రారంభించారు. గౌరవనీయులైన రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, సోమవారం మీ సురక్ష నేను సైతం 2.0 ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మల్కాజ్‌గిరి జోన్ డిసిపి సి.హెచ్. శ్రీధర్ ఐపిఎస్, జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ తో కలిసి ఈ సిసిటివి నెట్‌వర్క్‌ను అధికారికంగా ప్రారంభించారు. 105 సిసిటివి కెమెరాలు సాకేత్ కాలనీ, ఓం శ్రీ పృథ్వీ అపార్ట్‌మెంట్స్, కౌకూర్, సాయి కృప కాలనీ దమ్మాయిగూడ మెయిన్ రోడ్ సర్కార్ మండి ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు ఎండి.ఇద్రిస్ అలీ, బి.వేణు మాధవ్, బి.మమత, ఎమ్.మౌనికలతో పాటు పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కాలనీవాసులతో కలిసి ఒక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో, కాలనీల్లో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సురక్షితమైన సమాజ స్థాపనకు సహకరించాలని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీల అధ్యక్షులు, ప్రతినిధులు ప్రజలు పాల్గొని పోలీసుల చొరవను అభినందించారు.

## ఫాగింగ్ నిర్వహించాలని వినతి

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ 296 డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామం, గాగిల్లాపూర్ గ్రామం, చర్చి గాగిల్లాపూర్, శంభీపూర్ గ్రామం, నాగులూరు గ్రామం, దుండిగల్ తండా01, దుండిగల్ తండా 02తో పాటు పరిసర కాలనీలు, బస్తీలలో దోమల బెడద తీవ్రంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వెంటనే ప్రత్యేక ఫాగింగ్ కార్యక్రమం చేపట్టాలని కోరుతూ దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట మణికరన్ కు కాంగ్రెస్ నాయకులు దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ పిట్ల సత్యనారాయణ ముదిరాజ్, వాపుల శ్రీనివాస్, శేఖర్ చారి, తదితరులు పాల్గొన్నారు.



## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**ప్రజాపక్షం/బంట్వారంః** అనుమాస్పద స్థితి లో మహిళ మృతి చెందిన ఘటన బంట్వారం మండల పరిధిలో తోర్‌మామిడి గ్రామంలో చోటు చేసుకోంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెంది న షేక్ అబ్దులు సలీం (45 సం.లు) కు చెందిన తన కూతురును సలీమా (26)ను 4 సంవత్సరాల క్రితం తుర్‌మామిడి గ్రామానికి చెందిన వాజెర్ సోయేల్‌కుకు ఇచ్చి వివాహం చేశారు. ఆదివారం రాత్రి సలీమా తల్లికి ఫోన్ చేసి హైదరాబాద్ వస్తానని చెప్పి తెల్లారే సరికి కూతురు చనిపోయిందన్న విషయం తెలియగానే ఆమె మృతి పట్ల అల్లుడి వాజెర్ సోయేల్ పై అనుమానం ఉందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సలీమా తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యుల కు అందజేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.విమల పేర్కొన్నారు.



## విద్యుత్ సమస్యల పరిరక్షణ కోసం బస్తీ బాట

**ప్రజాపక్షం/చర్లపల్లిః** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందకు బస్తీబాట చేపడుతున్నామని చర్లపల్లి ఏడిఇ రాం దాస్ తెలిపారు. చర్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఇసీనగర్ కాలనీలో సొసైటీ అధ్యక్షులు బి శ్రావణ్‌కుమార్‌గౌడ్‌తో కలసి ఏడిఇ రాందాస్ ఏఇ బాబూరావు బస్తీబాటలో పాల్గొన్నారు.కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిక్షరించి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నమని తెలిపారు.రోజురోజుకు పెరుగుతున్న విద్యు త్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్‌లో 12.5 పవర్ విద్యు త్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బం ది, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.






## కార్మిక సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటానికి పిలుపు

ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రవి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రవి పిలుపిచ్చారు. మల్కాజిగిరి నియోజకవర్గం వినాయకనగర్‌లో మంగళవారం జె.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన మల్కాజిగిరి మండల నాలుగవ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. తొలుత ఆయన ఎఐటియుసి నూతన పతాకాన్ని ఆవిష్కరించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి కార్మికులు పోరాడి సాధించుకొన్న 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు అమలు కాకుండా ఉండేందుకు పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అసంఘటిత కార్మికులకు నెలకు కనీసం రూ.9 వేలు పెన్షన్, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వటం, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం వర్తింప చేయటం, ఉద్యోగులకు పని భద్రత కల్పించటం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేస్తూ ప్రస్తుతం ఈ విధానంలో పనిచేస్తున్న వారందరిని పర్మినెంట్ చేయటం లాంటి కార్మికుల సమస్యలు పరిష్కరించటం లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం చేసుకోగలుగుతారన్నారు. ఈ మహాసభలో సిపిఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు. ఎఐటియుసి మల్కాజిగిరి మండల నూతన కమిటి అధ్యక్షుడిగా ఎస్‌కె అజీజ్, ఉపాధ్యక్షులుగా డి.శంకర్ గౌడ్, సయ్యద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా బెజ్జాల కృష్ణమూర్తి, కోశాధికారిగా ఎస్.కె.ఖాసింలతో పాటు మరో 14 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నేత పి.సత్యనారాయణ, మండల సహాయ కార్యదర్శి కె.అశోక్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ సింగ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.





## సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/నవాబ్‌పేటః** నవాబ్‌పేట్ మండల నూతన సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో మండల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా మండల సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా కావలి కొండయ్య యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా గాజులగూడెం నరసింహా రెడ్డి, దాన నర్సింహులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా దోసాడ మల్లేశం, గుడిసె అనసూయ అనంతరాములు, ఏక్మామిడి శ్రీనివాస్ రెడ్డిలను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా ఎల్వర్తి దీపక దశరథ్, వెంకటమ్మ యేసయ్యలను ఎన్నుకోగా, కార్యవర్గసభ్యులుగా బండారు అనిత ఆంజనేయులు, దుర్గయ్య, ఎలిమెల భాగ్యలక్ష్మి , ఏ.ప్రభాకర్, లావణ్య ప్రభు, జి.శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్‌ల మధ్య సమన్వయం పెంపొందించడం, మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. తనను సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న తోటి సర్పంచ్‌లకు, ప్రజాప్రతినిధులకు కావలి కొండయ్య యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఉపసర్పంచులు పులిమామిడి నాగిరెడ్డి, యావపూర్ లక్ష్మి ప్రవీణ్, ఆర్కతల భాగయ్య, తిమ్మారెడ్డిపల్లి మల్లేశం, గేటు వనంపల్లి బాలరాజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, బిబ్లాక్ అధ్యక్షుడు పోలీస్ మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవగాహన

ఆశా కార్యకర్తల సమావేశంలో డిఎంహెచ్ఒ డా॥ సుధాకర్ లాల్

**ప్రజాపక్షం/నవాబుపేటః** వికారాబాద్ జిల్లా నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా॥ సుధాకర్ లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణీ మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, అన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా ఆశా కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అలాగే వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి ఇంటికి చేరవేసి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. అదేవిధంగా, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ పరిధిలో మధుమేహం,రక్తపోటు వ్యాధుల గుర్తింపు, అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వైద్యాధికారి డాక్టర్ మిరియాల రోహిత్, సీహెచ్‌వో శివరాజ్, సూపర్వైజర్లు సుగుణ, శోభారాణి, ఎంఎల్‌హెచ్‌పీలు,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ః** పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లి గ్రామం సప్తగిరి కాలనీ రోడ్డు నంబర్ 13లో నెలకొన్న డ్రైనేజీ సమస్య తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల సమస్యను గుర్తించిన మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఈ విషయాన్ని ఘట్‌కేసర్ సర్కిల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ అయ్యా యి. ఆ ఆదేశాల మేరకు పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎర్ర మాధవిరాజు సోమవారం డ్రైనేజీ మరమ్మత్తు పనులను ప్రారంభించి పర్యవేక్షించారు.

## భూ కబ్జాదారులపై చర్యలు

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ పరిధిలో ప్రభుత్వ భూములను కబ్జా చేయడంలో భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారని, వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పి శివకుమార్ గౌడ్, సిపిఐ సీనియర్ నాయకురాలు అనురాధ,శివ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం తుర్కయంజాల్‌లో సిపిఐ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ తుర్కయాంజల్ రెవిన్యూ పరిధి సర్వేనెంబర్ 52, 212, 206లలో ప్రభుత్వ భూములను కాపాడాలని, సర్వేనెంబర్ 212లో స్మశాన వాటికను కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతి పేద వాడికి ఇల్లు, ఇంటి జాగా వచ్చేంతవరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం కార్యదర్శి రోజా, పద్మ,అజయ్ పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ వేడుక



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** ఎంఆర్‌పిఎస్ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించించామని బత్తిన సుధాకర్ మాదిగ అన్నారు .ఎల్ బి నగర్ నగర్ నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఎల్.బి.నగర్ మహనీయుల విగ్రహాలు దగ్గర ఎంఆర్‌పి ఎస్ ఆవిర్భావ వేడుకల కార్యక్రమానికి బత్తిన సుధాకర్ మాదిగ హాజరై జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చిత్రం. సైదులు, గద్దపాటి యాదయ్య మాదిగ ,హేమంత్ ,ప్రకాష్ మాదిగ, యాదగిరి మాదిగ, రాజు మాదిగ ,గిరి నర్సిగ్ రావు మాదిగ ,నరసింహ మాదిగ, క్రాంతికుమార్ మాదిగ, యాదయ్య బాస్తీ ,అధ్యక్షులు మౌలాలి మాదిగ పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి;** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మాదాపూర్ డివిజన్, మియాపూర్ డివిజన్‌లలో అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే అరికపూడి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు.

## లెక్చరర్స్ ఫోరం ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం చైర్మన్ కత్తి వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, టిఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిప్పిశెట్టి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి నీరటి మచ్చేందర్, కె.రాఘువేందర్‌లు హాజరయ్యారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య, టిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సదానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తుదిదశకు హైలెవల్ బ్రిడ్జి పనులు



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేసేందుకు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకుంటున్నాయని కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి వివరించారు. మంగళవారం కొందుర్గు మండల పరిధిలని రేగడిచిల్కమర్రి..రామచంద్రాపూర్ గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి అంజిరెడ్డి, కోయల నర్సింలు, ఏఈ తేజ్‌మోహ్రన్, కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, విష్ణులు పాల్గొన్నారు.

## పంటల బీమా పథకం అమలు చేయాలి

రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** పంటల భీమా పథకం తక్షణమే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలో పలు గ్రామలలో రైతు సంఘం బృంధం పర్యటించి రైతు సమస్యలను అడిగి తెలుసుకోని రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో పెట్టాలని, రైతులకు ఏలాంటి షరతులు లేకుండా రుణ మాపీ చేయాలని డిమాండ్ చేశారు.

# రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి/తుర్కయంజాల్ :** రహదారుల నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హెచ్ఎఎం) విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అదనంగా మరో రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. లక్ష్మీరెడ్డిపాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టియుఎఫ్ఐడిసి) చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదనరెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొత్త కురుమ మంగమ్మ, నాయకులు అభిషేక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ భాస్కరచారి, తొర్రూరు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోశిక ఐలయ్య, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త కురుమ శివకుమార్, మర్రి నిరంజన్ రెడ్డి, భూపతిగల్లా మహిపాల్, వంగేటి గోపాల్‌రెడ్డి, గుండ్లపల్లి హరిత ధనరాజ్, కొంతం వెంకట్‌రెడ్డి, కాకుమాను సునీల్, మేతరి దర్శన్, నక్క శివలింగం, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘సర్’ పట్ల అశ్రద్ధ వహించొద్దు

మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి



**ప్రజాపక్షం /హయత్‌నగర్ :** సర్ పట్ల అధికారులు అశ్రద్ధ వహించచవద్దు అని నిజమైన ఓటర్లకు అన్యాయం జరగనీయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారుల మీద ఉందని మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్ రెడ్డి అన్నారు. మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ లోని మధుర నగర్‌లో ఏర్పాటు చేసిన సర్ కార్యక్రమానికి విచ్చేసి బిఎల్ ఓ ల పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు మన్సూరాబాద్ డివిజన్ లో సర్ ప్రక్రియ నత్తనడక నడుస్తుందని అధికారులు అధికారుల తీరు బాగోలేదని ఏ ఓటరుకు నష్టం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## ఎస్ఐఆర్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో గుర్తింపుపొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ (ఎన్నికలు) బి.సంతోష్ కుమార్, జోనల్ కమిషనర్ కె.చంద్రకళతో పాటు వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయపార్టీలు క్షేత్రస్థాయిలో చురుకుగా పాల్గొని సహకరించాలని కోరారు. తమ పార్టీలకు చెందిన బూత్‌లెవల్ ఏజెంట్లకు (బిఎల్ఏలు) తగిన సూచనలు చేసి, అర్హులైన ఓటర్లతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపించి, వాటిని సకాలంలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయపార్టీల సహకారంతో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తవుతుందని కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిషేధిత సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో భారీగా నిషేధిత సింథటిక్ డ్రగ్స్‌ను ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్, డ్రగ్ కంట్రోల్ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. నాచారంలోని ఓ కెమికల్ ట్రేడింగ్ సంస్థపై నిర్వహించిన దాడుల్లో రూ.1.60 కోట్ల విలువైన 5.860 కిలోల ఎన్‌బెంజిల్ పైపెరజైన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుని, కంపెనీ యాజమాన్యంపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. డ్రగ్ కంట్రోల్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు మంగళవారం ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ డి టీమ్ డిఎస్పి తిరుపతి యాదవ్, సిఐ నాగరాజ్ బృందంతో పాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇందిరా ప్రియదర్శిని, అన్వేష్ సంయుక్తంగా నాచారంలోని హైమా సింథసిస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం1985 ప్రకారం నిషేధిత సింథటిక్ డ్రగ్‌గా గుర్తించిన ఎన్‌బెంజిల్ పైపెరజైన్ను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సంస్థలో ఉన్న 5.860 కిలోల డ్రగ్‌ను స్వాధీనం చేసుకోగా, దీని మార్కెట్ విలువ సుమారు రూ.1.60 కోట్లుగా అంచనా వేశారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ డ్రగ్‌ను గుజరాత్ నుంచి తీసుకొచ్చి హైదరాబాద్, బెంగళూరు, ముంబై నగరాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో హైమా సింథసిస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ముదిగొండ ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి, నిందితుడిని నాచారం ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

## ఇంట్లో వైన్ తయారీ.. ముగ్గురు అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా వైన్ తయారీపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. మెట్టుగూడ, తార్నాక ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో సుమారు రూ.50 వేల విలువైన వైన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. అంగ్లోఇండియన్ కుటుంబాలు ఎలాంటి అనుమతులు లేకుండా వైన్ తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సౌజన్య ఆధ్వర్యంలోని ఎక్సైజ్ బృందం రెండు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.మెట్టుగూడలోని హౌస్ నంబర్ 127 190లో నిర్వహించిన దాడిలో 25 వైన్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆంటోనిని అరెస్టు చేశారు. మరోవైపు తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రి సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో 20 లీటర్ల అక్రమంగా తయారు చేసిన వైన్‌ను స్వాధీనం చేసుకుని వేణు, ప్రకాష్‌లను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వైన్ మొత్తం విలువ సుమారు రూ.50 వేలుగా ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితులు, స్వాధీనం చేసుకున్న వైన్‌ను తదుపరి చట్టపరమైన చర్యల కోసం సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.

### అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు

## జాబితాలో నమోదయ్యేలా చూడాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ముసాయిదా జాబితాలో నమోదు అయ్యేలా చూడలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 92 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, మిగిలిన ఫారాల పంపిణీని ఈరోజు సాయంత్రంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) ప్రజల నుంచి నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సేకరించి, వెంటనే సంబంధిత యాప్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అనర్హులను ఓటరు జాబితా నుంచి తొలగించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలోని ప్రతి ఆర్డీవో, జోనల్ మున్సిపల్ కమిషనర్లతో విడివిడిగా మాట్లాడి, వారి కార్యాచరణ ప్రణాళికలను సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని ఆర్ డిఓ లు, జోనల్ మున్సిపల్ కమిషనర్లు,డిప్యూటీ కలెక్టర్లు,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డిఐఇఒ),జిల్లా విద్యాశాఖ అధికారి(డిఇఒ), వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు,తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు,ఎం పిడిఒ లు,ఎపిఎంలు, ఎపిఒలు, ఎంపిఒ లు, సిడిపిఒ లు, మెప్మా అధికారులు,ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి స్వర్ణకుమారి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి(డిఎంహెచ్ఒ)డాక్టర్ డి.స్వర్ణ కుమారి అన్నారు. మంగళవారం సీజనల్ వ్యాధుల నివారణపై వివిధ స్థాయిలోని వైద్యాధికారులతో డిఎంహెచ్ఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, అతిసారం వంటి సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని ఆరోగ్య సంస్థలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వైద్యాధికారి తమ పరిధిలో వ్యాధుల పర్యవేక్షణను నిరంతరం నిర్వహిస్తూ, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి చికిత్స అందించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి స్వర్ణకుమారి హెచ్చరించారు. సమావేశంలో జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఉప జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పూనమ్, జిల్లాలోని వైద్యాధికారులు, సంబంధిత కార్యక్రమాల అధికారులు పాల్గొన్నారు.

## చిత్తశుద్ధి ఉంటే..641జిఒ రద్దు చేయించాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సిద్దాపూర్ ప్రజల పట్ల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే 64జిఒను రద్దు చేయించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేయడంతోపాటు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. రోడ్డుపై భైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటంతో పోలీసులు రంగప్రవేశం చేసి అక్కడి నుండి తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చెత్త డంపింగ్ యార్డుకు వ్యతిరేకమని చెప్పిన ఎమ్మెల్యే ఎందుకు ప్రజల మధ్యకు వచ్చి ఉద్యమాలు చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ చెత్త డంపింగ్ యార్డు వల్ల సుమారు 30గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు, అవస్థలు పడాల్సి వస్తుందని, ప్రభుత్వం మొండివైఖరీ అవలంభిస్తే మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, కెటిఆర్‌కు సిద్దాపూర్‌కు తీసుకువస్తామని హెచ్చరించారు. చెత్త డంపింగ్ యార్డు వద్ద ప్రజలు అనేక రకాల పోరాటాలు చేస్తుంటే మాజీ ఎమ్మెల్యేలు ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నేతలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తుంటే మాజీ ఎమ్మెల్యేలు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. రాజకీయాలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమాల్లో పాల్గొన్నాలని కోరారు. తాను ఉన్నంత వరకు సిద్దాపూర్‌కు చెత్త డంపింగ్ యార్డు రానివ్వను అని చెప్పి తీరా జీవో 641తీసుకువచ్చావు.. ఇప్పుడు ప్రజలకు ఏం సమాదానం చెపుతారో చూడాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు తెలియకుండా జీవోలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో డంపింగ్‌యార్డు వ్యతిరేక కమిటి చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వి.నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మనే నరేందర్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్ యాదవ్, కోస్గి శ్రీనివాస్, షాద్‌నగర్ కౌన్సిలర్ నందారం అశోక్ యాదవ్, యుగంధర్, రామకృష్ణ, దినేష్‌సాగర్, శివాచారి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిజాలు తేల్చకుంటే భరతం పడతాం

ఎమ్మెల్సీ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు వ్యవహరంలో 50కోట్ల ముడుపులు తీసుకున్నట్లు నిజాలు తేల్చకుంటే నీ భరతం పట్టడం ఖాయమని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి నీకు దమ్ము..దైర్యం ఉంటే 50కోట్ల ముడుపుల వ్యవహారాన్ని తేల్చాలని..మా ఎమ్మెల్యేను మేము చౌరస్తాకు తీసుకువస్తాం..నీకు దమ్ముంటే రా అంటూ సవాల్ చేశారు. సిద్దాపూర్ చెత్తడంపింగ్ యార్డును అడ్డం పెట్టుకొని ప్రజలు రెచ్చగొట్టడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిర్విరామంగా పని చేస్తుంటే ఆసత్య ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వీధి సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, రఘునాయక్, విశ్వం, రాయికల్ శ్రీనివాస్, సర్వర్‌పాషా, శ్రీశైలం గౌడ్, బాలునాయక్, సింగిపాల అనిల్ కుమార్, మనీష్, శ్రీధర్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, రాళ్ళతో కొట్టి బట్టలు ఊడదీసి కొట్టి చంపాలని రెచ్చగొట్టే విధంగా మాట్లాడటంపై షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మున్సిపల్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఫిర్యాదు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న షాద్‌నగర్‌ను మాటలతో, ప్రసంగాలతో రెచ్చగొడుతున్నారని వివరించారు. ఆప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మెట్రో కార్యకలాపాలపై సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** మెట్రో రైళ్ల నిర్వహణ, భద్రతా వ్యవస్థలను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు ఎండీ బి.అజిత్‌రెడ్డి సమీక్షించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉప్పల్ మెట్రో డిపోను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా, ఆయన ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఓసిసి), కమాండ్ కంట్రోల్ సెంటర్ (సిసిసి)లను పరిశీలించారు. వివిధ కార్యాచరణ, నిర్వహణ అంశాలపై అధికారులతో చర్చించారు. పర్యటనలో హెచ్ఎంఆర్ఎల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డివిఎస్.రాజు, చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ ఎస్‌కె.దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ సాయపరెడ్డి, జనరల్ మేనేజర్(సెక్యూరిటీ) శ్రీనాథ్‌రెడ్డి తదితర హెచ్ఎంఆర్ఎల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## వైద్యులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** ఉస్మానియా ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన ఒకే వ్యక్తికి 5 అవయవాల మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులకు ఘన సన్మానం జరిగింది. ఈ మేరకు మంగళవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియలో భాగస్వాములైన 9 విభాగాల టీమ్‌లను, ఓంసీ, డీఎంఈల సంయుక్తాధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 36 గంటల పాటు శ్రమించి ఈ చారిత్రాత్మక శస్త్ర చికిత్సను పూర్తి చేసిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్వోడీ మధుసూదన్ బృందాన్ని, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి బి రమేష్ కుమార్, అనస్థీషియా విభాగాధిపతి ఆర్ పాండునాయక్, ప్రొఫెసర్ మాధవి, పీజీలు, స్టాఫ్ నర్సులు, ఓటి సిబ్బందికి శాలువాలుకప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ శంకర్ వెంకటేష్, నాగార్జున చారి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ వేడుకలు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఆహార భద్రతను జాతీయ బాధ్యతగా చాటి చెప్పే లక్ష్యంతో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ క్యులినరీ అసోసియేషన్స్, వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ చెఫ్స్ సొసైటీస్ అనుబంధ సంస్థ తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవాన్ని తాజ్ డెక్కన్లో నిర్వహించారు. వేడుకలను బ్యూరో డీ ఫ్రాన్స్ హెడ్ పాస్కల్ లోరియో ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ క్యులినరీ అసోసియేషన్స్ జనరల్ సెక్రటరీ చెఫ్ విజయభాస్కరన్, టీసీఏ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ రెడ్డి, హైదరాబాద్ తాజ్ డెక్కన్ జనరల్ మేనేజర్ అర్నాబ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో యువత ముందుండాలి



**ప్రజాపక్షం/ సికింద్రాబాద్:** సమాజ సేవలో యువత ముందుండాలని.. యువత తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని.. లష్కర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన మంద జగన్, అంబానగర్ బస్తీ అధ్యక్షునిగా ఎన్నికైన కిషోర్ గౌడ్‌లకు మర్యాదపూర్వకంగా శాలువాలు కప్పి సన్మానం చేయడం జరిగింది. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు నరేందర్ నేత, మల్లేష్, మార్కండేయ, ఈశ్వర్, మంద మురళి, పాపయ్య, యాదగిరి, బిజెపి నాయకులు అరవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత గడ్డం మల్లేష్ మృతి



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** అంబర్‌పేట్ డివిజన్ ప్రేమ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం మల్లేష్ మృతి చెందారు. గత కొన్ని దశాబ్దాలుగా మల్లేష్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లేష్ మంగళవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ఈ విషాద వార్త తెలుసుకున్న అంబర్పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పులి జగన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రేమ్‌నగర్‌లోని మల్లేష్ నివాసానికి వెళ్లి మల్లేష్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది



**ప్రజాపక్షం/కాచిగూడ:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా న్యూ గంగానగర్‌లోని బూత్ నెంబర్లు169,170 పరిధిలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన హెల్ప్ డెస్క్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సాయి కుమార్ గౌడ్, ఆర్కే బాబు, ఏ.సురేష్ గౌడ్, రాము, నర్సింగ్ యాదవ్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో లభ్యమైంది. హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ పర్యాటక భవనం సమీపంలో ఫుట్‌పాత్‌పై సుమారు 30 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికంగా కలకలం రేపింది. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించారు. పోలీసుల వివరాల ప్రకారం... మృతుడు తెలుగు రంగు షర్ట్, నీలం రంగు ట్రాక్ ప్యాంట్ ధరించాడు. గుండ్రటి ముఖం, సుమారు 5.5 అడుగుల ఎత్తు ఉంటాడు. మృతుడు ముస్లిం మతానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. అనారోగ్య కారణాలతో మృతిచెందినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కానిస్టేబుల్ పి.అప్పలరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, సంబంధీకులు వెరైనా ఉంటే నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

# ప్రత్యేక కాంటింజెన్సీ ప్రణాళిక

భవిష్యత్ అవసరాలకు కార్యాచరణ
రెండు వారాల్లో ప్రణాళిక రూపొందించాలి
జలమండలి ఎండి అశోక్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సింగూరు, మంజీరా జలాశయాల్లో సుమారు 50 రోజుల పాటు మాత్రమే నీటి లభ్యత ఉన్నది.. వర్షాలు సకాలంలో కురవని పరిస్థితి ఏర్పడితే హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ కాంటింజెన్సీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత వేసవిలో అనూహ్యంగా నీటి సమస్యలు ఎదురైన ప్రాంతాలను గుర్తించి.. వచ్చే వేసవికి ముందే ప్రత్యేక ప్రణాళికను వారం నుంచి పదిహేను రోజుల్లో ఖరారుచేసి.. అక్టోబర్ నాటికి అవసరమైన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జలమండలి పరిధి క్యూర్ వరకు విస్తరిస్తున్న నేపథ్యంలో.. భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే శాస్త్రీయ.. సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జెఎండి మయాంక్ మిట్టల్, మూడు రీజియన్ల ఇడిలు, డైరెక్టర్లు, ట్రాన్స్‌మిషన్, ఓ అండ్ ఎం, రెవెన్యూ విభాగాల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఎండి అశోక్‌రెడ్డి సమీక్ష సమావేశంలో కీలక సూచనలు చేశారు. రాబోయే ఒకటి నుంచి రెండు సంవత్సరాల్లో ఉస్మాన్ సాగర్ నుంచి షేక్‌పేట్ ప్రాంతాలకు గోదావరి జలాల ద్వారా అదనపు నీటి లభ్యత పెరగనున్న నేపథ్యంలో, ఆ నీటిని సమర్థవంతంగా పంపిణీ చేసేందుకు రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, పంపింగ్ వ్యవస్థలు, వాల్వులు, జంక్షన్లు, ఇతర మౌలిక వసతులపై ఇప్పటి నుంచే స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో కొత్తగా నీటి సమస్యలు ఎదురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెద్ద సామర్థ్యం కలిగిన ట్యాంకర్ల కోసం ప్రత్యేక ఫిల్లింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి, వేగంగా నీరు నింపే వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. నీటి పంపిణీలో శాస్త్రీయ విధానం.. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి లభ్యతను బట్టి వివిధ పరిస్థితులకు అనుగుణంగా కాంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేయాలని, అవసరమైతేప్రత్యామ్నాయ రోజు లేదంటే దశలవారీ నీటి సరఫరా విధానాలపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కాంటింజెన్సీ ప్రణాళికలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, ఏ ప్రాంతానికి ఎక్కడి నుంచి నీటిని మళ్లించాలి, దానికి అవసరమైన పైప్‌లైన్లు, వాల్వులు, జంక్షన్లు, రిజర్వాయర్లు వంటి మౌలిక వసతులపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అంచనాలు సిద్ధం చేయడం, టెండర్లు పిలవడం, పనులు ప్రారంభించడం వంటి ప్రక్రియలను రానున్న 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కృష్ణా, గోదావరి, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వంటి ప్రత్యామ్నాయ జలవనరులను కూడా సమర్థవంతంగా వినియోగించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎండీ సూచించారు. ట్యాంకర్ నిర్వహణలో నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం లేదా నిబంధనల అమలులో వైఫల్యం కనిపిస్తే సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, అవసరమైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో మూడు రీజియన్ల ఈడీలు పంకజ, స్వామాట్ అశోక్,సంతోష్, డైరెక్టర్లు సుదర్శన్, నారాయణ, వాస సత్యనారాయణ, ప్రభు, సీజీఎంలు, ట్రాన్స్ మిషన్, ఎలక్ట్రికల్, ఓ అండ్ ఎం, జీఎంలు, డీజీఎంలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి కబ్జా

అధికారుల వాటా ఎంత?
బిఆర్ఎస్ సీనియర్ నేత ఆనంద్‌గౌడ్ ఆగ్రహం

**ప్రజాపక్షం/గోషామహల్:** ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే కోల్సావాడి ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నా, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం లేదని బిఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లాల్ గోప్ పహిల్వాన్ ఇంటి వెనుక ఉన్న సుమారు 200 గజాల కామన్ ప్యాసేజ్ (ప్రజా ప్రయోజన స్థలం)ను కొందరు ఆక్రమించి, రాత్రికి రాత్రే అక్రమ షెడ్లను నిర్మిస్తుంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యంగా మారిందని ఆనంద్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కబ్జాపై లాల్ గోప్ పహిల్వాన్ ఇప్పటికే జోనల్ కమిషనర్, డెప్యూటీ కమిషనర్, సిటీ ప్లానర్, ఏసీపీకి ఫిర్యాదులు చేశారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో, తాజాగా ఆనంద్ గౌడ్ స్వయంగా రంగంలోకి దిగి బాధితులతో కలిసి 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. ఇకనైనా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ స్పందించి భూ ఆక్రమణ, అక్రమ నిర్మాణాన్నిఅడ్డుకోవాలని స్థానికులు లాల్ గోప్ పహిల్వాన్, బజ్జు పహిల్వాన్ తదితరులు కోరారు.



## వర్గీకరణతోనే ఉద్యమం ఆగిపోలేదు

ఎంఆర్‌పిఎస్
వ్యవస్థాపక అధ్యక్షుడు
మంద కృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్ :** ఎస్‌సి వర్గీకరణను సాధించుకోవడం జరిగింది.. దీంతో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆగిపోయిందని అనుకోవద్దు.. సమాజంలో అణగారిపోయిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, అగ్రకుల పేద సంక్షేమం కోసం, ఆ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేపట్టి ముందుకు కొనసాగుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను, మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలను సికింద్రాబాద్ పార్సిగుట్టలోని జాతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించ డం జరిగింది.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ పాల్గొని ముందుగా జెండాను ఆవిష్కరించారు. మాదిగ అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తన పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసి న కేక్‌ను కట్ చేయడం జరిగింది. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... దేశంలో 32 సంవత్సరాల ఉద్యమ ప్రయాణం కొనసాగించడం సాధారణమైన విషయమేమీ కా దన్నారు. ఉద్యమానికి ఎన్నో సమస్యలు, ఇబ్బందులు, కష్టాలు, నష్టాలు, కుట్రలు, వెన్నుపోట్లు ఎదురైనా మాదిగ ప్రజలు, సమాజం ఉద్యమాన్ని వెన్నంటే ఉన్నారని కొనియాడారు. రాజకీయంగా శాశ్వత మిత్రులు కానీ శాశ్వత శత్రువులు కానీ లేరని.. మేము ఎంచుకున్న లక్ష్యం పట్ల రాజకీయ పార్టీల వైఖరిని బట్టి మా మిత్రుత్వం, శత్రుత్వం భవిష్యత్‌లో తేలుతుందని స్పష్టం చేశారు. అప్పటి వరకు కూడా మా లక్ష్య సాధనకు అనుగుణంగానే రాజకీయ నిర్ణయాలు తీసుకున్నామన్నారు. జాతీ య స్థాయిలో ఎమ్మార్పీఎస్ అన్ని అనుబంధ సం ఘాల జాతీయ సదస్సులను వేరు వేరుగా 15 రోజుల పాటు వివిధ రాష్ట్రాల్లో జరుపుతామని ప్రకటించారు. జాతీయ సదస్సులో భవిష్యత్ ఉద్యమానికి సంబంధించిన లక్ష్యాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రతి సం వత్సరం ఆవిర్భావ దినోత్సవాన్ని జులై 7న మాదిగ జాతికి పండుగగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వివిధ మత విశ్వాసాలకు సంబంధించిన పండుగలను ఎంత ఘనంగా జరుపుకుంటామో జులై 7ను కూడా పండగగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రేపు జాబ్ మేళా

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** మల్లేపల్లి ప్రభుత్వ ఐటిఐ క్యాంపస్ వద్ద ఉన్న జిల్లా ఉపాధి కల్పనాధికార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ. వందన ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయసు గల వారు ఈ ఉద్యోగాలకు అర్హులని ఆమె పేర్కొన్నారు.

## పని ప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టం అమలు చేయాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల

**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** పని ప్రదేశాన్ని సురక్షితంగా మార్చడానికి పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ ,నిషేదం, పరిష్కారం) చట్టం సమర్థవంతంగా అమలు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం నిబంధనలు పాటించకపోతే సంబంధిత యజమానికి రూ. 50వేలు జరిమానాతో పాటు శిక్ష విధించబడుతుందని ఆమె చెప్పారు. పది అంత కంటె ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థ ఈ చట్టం ప్రకారం ఒక కమిటీని వేయాలన్నారు. ఈ కమిటీకి ఒక మహిళా ఉద్యోగిని ప్రెసైడింగ్ అధికారిగా నియమించాలని ఆమె సూచించారు.

## ఇంటింటికీ ఎన్యూమరేషన్ పత్రాలు

**ప్రజాపక్షం/కవాడీగూడ:** సర్ ప్రక్రియలో ప్రజలంతా పాల్గొని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని బిఆర్ఎస్ యువ నేత ముఠా జయసింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు కవాడిగూడ డివిజన్‌లో బూత్ స్థాయి ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను బిఎల్ఓ, బిఎల్ఏతో పాటు ఇంటింటికి తిరిగి అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, సెక్రెటరీ సాయికృష్ణ, సీనియర్ నాయకులు మల్లాల శ్రీనివాస్ యాదవ్, శివకుమార్, రాజేష్, స్వామి, శివ గౌడ్, సురేష్, శ్రీహరి, రామచందర్, రాజశేఖర్, రాజు యాదవ్, కార్తీక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 35 వాహనాలు స్వాధీనం

ఫతేనగర్ పరిసరాల్లో కార్డెన్ సర్చ్



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** పోలీసులు ఆకస్మికంగా జరిపిన కార్డెన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 35 ద్విచక్రవాహనాలు.. ఐదు ఆటో ట్రాలీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సనత్ నగర్ పిఎస్ పరిధిలోని ఫతేనగర్ పరిసర ప్రాంతాల్లో డీసీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ క్రమంలోనే గంజాయి వినియోగించినట్లు పరీక్షల్లో తేలిన ఐదుగురిని తరలించడం జరిగిందని డిసిపి రమణారెడ్డి తెలిపా రు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి శ్రీకాంత్, ఎస్ఆర్ నగర్ ఏసిపి రాఘవేంద్రరావు, బంజారాహిల్స్ ఎసిపి వెంకట్‌రెడ్డి, 11 మంది సిఐలతో పాటు 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## మొండి వైఖరి ప్రభుత్వానికే నష్టం

- ఫీజుల స్కీంపై కుట్ర చేస్తే తీవ్ర ప్రజావ్యతిరేక చర్యే
- విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫీజుల స్కీం అమలుకు మూడేళ్లుగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వం మొండివైఖరి అవలంబించడం సరికాదని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. విద్యార్థుల ఉద్యమాన్ని తక్కువ అంచనా వేస్తే , ప్రభుత్వానికే తీవ్ర నష్టమన్నారు.పేద విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఫీజుల స్కీంను ఎత్తివేయాలనే కుట్రలను మానుకోవాలని, రూ.8వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, ప్రధానకార్యదర్శి శివ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజుల స్కీంను రద్దు చేసే కుట్ర కాకుండా 23వేల ప్రభుత్వ బడులను రద్దు చేస్తానటం, గురుకులాలను డే స్కాలర్స్‌గా మార్చలనుకోవటం బిసి, ఎస్‌సి, ఎస్‌టి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడమే అవుతుందన్నారు. గత సిఎంలతా విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకొంటూ ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి గొడ్డలితో నరికి తిరోగమన చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఫీజుల చెల్లింపు లేక కళాశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని, లెక్చరర్లకు జీతాలిచ్చే పరిస్థితి లేదని, దాదాపు 200 కాలేజీలు మూతపడ్డాయన్నారు. బ్యాంకుల్లో వందల కోట్ల రుణా లు ఎగ్గొట్టే దొంగల కోసం తెచ్చిన ఆర్ఆర్ యాక్టును విద్యార్థులపై ప్రయోగిస్తారా? ఇది అత్యం త దుర్మార్గమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంను పాత పద్ధతిలో అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమం తప్పదని కృష్ణయ్య హె చ్చరించారు. సమావేశంలో బిసి సంక్షేమ సం ఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బిసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్ తదితర బిసి సంఘాల నేతలు పాల్గొన్నారు.

## జిఒల పేరిట కాలయాపన తగదు

గన్‌పార్క్ వద్ద విద్యార్థుల నిరసనలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ విషయమై జిఒలు, కమిటీల పేరిట కాలయాపన చేయడం తగదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద బిసి విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ.10వేల కోట్లు ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి జెఎసి ప్రధానకార్యదర్శి నందగోపాల్ తోపాటు వందలాది మంది విద్యార్థులు నల్లకండువాలు ధరించి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్‌పై నెలకొన్న గందరగోళంపై సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాలు, కోర్టు కేసుల మధ్య విద్యార్థుల నలిగిపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఫీజులు కట్టని విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. విద్యార్థుల ఖాతాలో నిధులు వేసి, వారంలోగా ఫీజులు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం తెస్తామనటం వారిలో భయాందోళనకు గురిచేయడమేనన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. వేముల రామకృష్ణ మాట్లాడుతూ పీజురీయింబర్స్‌మెంట్ స్కీం భిక్ష కాదని, ఇది తమ హక్కు అంటూ నినదిస్తూ ఈ నెల 14న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. ఫీజుల స్కీంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మారకపోతే 14 లక్షల మంది విద్యార్థులను ఒకటి చేసి, అన్ని విద్యార్థి సంఘాలు కలుపుకొని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం నేతలు నరసింహ నాయక్, సానియా, నరేశ్, సతీశ్, ప్రవీణ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో బోనాల ఏర్పాట్లు చేయాలి

**ప్రజాపక్షం/చార్మినార్:** ఆషాడమాసం బోనాల పండగ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. రానున్న బోనాల పండగ ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు మల్యాల మధుసూదన్ యాదవ్, మాజీ అధ్యక్షులు గాజుల అంజయ్య, రాకేష్ తివారి, కమిటీ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జోనల్ జాయింట్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డిసిలు సుభాష్‌రావు, సరిత, మంగతాయారు, ఇంకేశఫ్ అలీ, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ ఇందిరాదేవి, ఈఈలు యాదగిరి, మాధవి, యూబీడి డిప్యూటీ డైరెక్టర్ దేవజా, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద్, మలేరియా విభాగం ఎస్ఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి మహమ్మారిపై 'ఘన' పదర్శనలు



**పల్లె నర్సింహ్మా కళా బృందం ఆధ్వర్యంలో**

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడి విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ కళాకారుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతి పాల్కురికి సోమన్న మూల వేదికలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి, తెలంగాణ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు పల్లె నర్సింహ్మా ఆధ్వర్యంలో "ఎంజాయ్ పేరుతో – గంజాయి వద్దు" కళాకారులు వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ మోసాలు, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి మాయ మహమ్మారి జోలికి పోవద్దని పాటలు, కోలాటల ప్రదర్శనలు మరింత అవగాహన కల్పించాయి. "ఓ యువత నీకొక్క దండమురో.. గంజాయి జోలికి వెళ్లొద్దు", "వద్దు వద్దు గంజాయి ప్రాణం తీస్తుందయ్యో.. అంటుకుంటే బతుకు ఆగం చేస్తుందయ్యో" అనే పాటలు వీక్షకులను ఆలోచింపజేశాయి. గంజాయికి యువత ప్రభావితులైతే జరిగే నష్టాలపై రచన, దర్శకత్వం పల్లె నర్సింహ్మా ఆధ్వర్యంలో కళాకారులు చాలా చక్కగా వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నర్సింహ్మారెడ్డి హాజరై, మాట్లాడారు. కొంతమంది యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును చిన్నాభిన్నం చేసుకొంటున్నారన్నారు.యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు వీడి మంచిమార్గంవైపు మళ్లించేందుకు పల్లె నర్సింహ్మా ఆయన బృంద కళాకారులు కృషిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాం స్కృతిక శాఖ ఎఒ విజయ్‌కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, తెలంగాణ ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులు కె.లక్ష్మీ నారాయణ, సిపిఐ నేత చెట్టుకింది శ్రీనివాస్, మేడ్చల్, రంగారెడ్డి, ఆదిలాబాద్ కళాకారులు పాల్గొన్నారు.

## వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవడం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. మంగళవారం సనత్ నగర్‌లోని సెవెన్ టెంపుల్ ఆవరణలో మాతా సేవా సమితి, రోటరీ క్లబ్, ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, రమేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్, ఖలీల్, షాబాద్ శ్రీనివాస్, పురుషోత్తం, వైద్యులు ప్రదీప్, భవ్య, శిల్ప, మాతా సేవా సమితి నిర్వాహకులు విజయ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# వయనాడ్‌లో కొండచరియల బీభత్సం

**ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు, మరో ఏడుగురు గల్లంతు**







**వయనాడ్ / న్యూఢిల్లీ :** కేరళలోని వయనాడ్‌లో మరోసారి కొండచరియలు బీభత్సం సృష్టించాయి. కోజికోడ్, వయనాడ్ జిల్లాలను కలిపే సొరంగ మార్గ ప్రాజెక్టు పనులు జరుగుతున్న కల్లాడిలోని మీనాక్షి వంతెన సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. మరో ఏడుగురు గల్లంతయ్యారు. దీనిని 'మానవ తప్పిదం వల్ల జరిగిన విపత్తు'గా ఓ రాష్ట్ర మంత్రి అభివర్ణించారు. తాజాగా ప్రమాదం జరిగిన స్థలం మెప్పాడి పంచాయతీ పరిధిలోకి వస్తుంది. అయితే ఇదే ప్రాంతంలో 2024లో కూడా విషాదకరమైన కొండచరియల విపత్తు సంభవించింది. కాగా, మీనాక్షి వంతెన వద్ద పేరుకుపోయిన మట్టి కుప్ప వర్షం కారణంగా అకస్మాత్తుగా కూలిపోవడం, తద్వారా చెట్లు పడిపోవడం, నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేసిన లోహపు, వస్త్రపు బారికేడ్లు కొట్టుకుపోవడం ఒక వీడియోలో కనిపించింది. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (కెఎస్‌డిఎంఎ) అధికారులతో వారి కార్యాలయంలో పరిస్థితిని ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో పేరుకుపోయిన భారీ మొత్తంలో మట్టిని తొలగించాల్సిందిగా ప్రజా పనుల శాఖ మంత్రి పి.కె. బషీర్, జిల్లా కలెక్టర్ కాంట్రాక్టర్లకు చాలా కాలం క్రితమే సూచించారని చెప్పారు. అయితే, కాంట్రాక్టర్లు ఆ ఆదేశాలను పాటించలేదు అని అన్నారు. ఇది దురదృష్టకరమైన సంఘటన అని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సరైన వాతావరణ హెచ్చరిక జారీ చేయకపోవడం వల్ల ఈ విపత్తు జరగలేదని, అధికారులు సూచించినట్లుగా మట్టి కుప్పను సకాలంలో తొలగించకపోవడం వల్లే ఇది సంభవించిందని సతీశన్ చెప్పారు. ఘటనకు ముందు ఆ ప్రాంతంలో భారీ వర్షం కురిసిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం వర్షం తీవ్రత తగ్గినప్పటికీ, సహాయక సిబ్బందికి ఇబ్బందులు కలిగిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కల్లాడి సొరంగ మార్గ ప్రాజెక్టు స్థలంలో జరిగిన ఈ ఘటన సహజంగా సంభవించిన కొండచరియల విపత్తు కాదని, తవ్వకాల ద్వారా వెలికితీసిన మట్టిని శాస్త్రీయ పద్ధతిలో కాకుండా పారవేయడం వల్ల జరిగిన 'మానవ తప్పిదపు' విపత్తు అని వ్యవసాయ శాఖ మంత్రి టి. సిద్ధిక్ అన్నారు. ఇదిలా ఉండగా, మంగళవారం వయనాడ్ భారీ వర్షాల కారణంగా భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెండ్ అలర్ట్ జారీ చేసింది. మానంతవాడి, వైతిరి ప్రాంతాలలో అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. వైతిరిలో 123 మి.మీ, మానంతవాడిలో 64 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా, వయనాడ్‌లోని మెప్పాడి పంచాయతీ పరిధిలో ఉన్న ముండక్కై–చూరల్మల ప్రాంతంలో 2024లో సంభవించిన ఘోరమైన కొండచరియ విపత్తులో సుమారు 250 మంది మరణించారు. ప్రాణాలతో బయటపడినవారు ఇప్పటికీ ఆ ప్రకృతి వైపరీత్యాన్ని బాధతో గుర్తుచేసుకుంటున్నారు. ఆ కొండచరియ విపత్తు కూడా జులై నెలలోనే సంభవించింది.

**వయనాడ్‌లో విపత్తు తీవ్ర విచారకరం**

కేరళలోని వయనాడ్‌లో కొండచరియల విరిగిపడే ఘటనకు సంబంధించిన వార్త తీవ్ర ఆవేదన కలిగిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. ఇంకా చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రభుత్వం సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేయాలని ఆయన కోరారు. ఈ క్లిష్ట సమయంలో సహాయం అందించాలని కాంగ్రెస్, యుడిఎఫ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'గతంలో కూడా క్లిష్ట పరిస్థితులను వయనాడ్ అద్భుతమైన ధైర్యంతో ఎదుర్కొంది. ఈ విషాద సమయంలో బాధితులైన ప్రతి కుటుంబానికి అండగా నిలబడతాము' అని అన్నారు. కొండచరియల ఘటనలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. పరిపాలనా యంత్రాంగం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూనే, సాధ్యమైనంత సహాయం అందించాలని ఆమె యుడిఎఫ్ కార్యకర్తలు, నేతలు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సమయంలో, సహాయక, రక్షణ చర్యలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలన్నారు.

## అహ్మదాబాద్ వరుస పేలుళ్ల కేసు...

# 38 మందికి మరణశిక్ష

- 11 మందికి జీవిత ఖైదు
- గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన ఉన్నత న్యాయస్థానం






అహ్మదాబాద్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గతంలో జరిగిన వరుస పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఉగ్రవాద సంస్థ అయిన 'ఇండియన్ ముజాహిదీన్' (ఐఎం)కు చెందిన 38 మందికి మరణశిక్ష విధించింది. మరో 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో దోషులకు మరణశిక్ష విధించడం ఏ కోర్టు చరిత్రలోనైనా ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ దోషులలో నిషేధిత సంస్థ 'స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా' (సిమి) మాజీ నాయకుడు సఫ్దర్ నాగౌరీ, అతని అనుచరులు ఉన్నారు. వరుస పేలుళ్లలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తులు ఎ.వై. కోగ్జే, సమీర్ దవేలతో కూడిన డివిజన్ బెంచ్, దిగువ కోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లను కొట్టివేసింది. అలాగే, ఈ కేసులో ఇండియన్ ముజాహిదీన్ సభ్యులకు విధించిన శిక్షలను ఖరారు చేస్తూ ఇచ్చిన తీర్పును సమర్థించింది. 2008 జులై 26న, అహ్మదాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 70 నిమిషాల వ్యవధిలో 21 బాంబు పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 56 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు. ఇతర ప్రాంతాల నుండి పేలుడు బాధితులను చికిత్స కోసం తరలిస్తున్న సమయంలో నగరంలోని ఆసుపత్రుల వద్ద కూడా పేలుళ్లు జరిగాయి. ఇలాంటి దాడుల్లో వైద్య సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి. ఈ కేసులో 78 మందిని ప్రత్యేక కోర్టు విచారించగా, ఫిబ్రవరి 2022లో వారిలో 49 మందిని దోషులుగా నిర్ధారించింది. అహ్మదాబాద్‌లో జరిగిన 21 పేలుళ్లకు సంబంధించి నమోదైన 20 ఎఫ్ఐఆర్‌లు, సూరత్ నగరంలో (అక్కడ ఉగ్రవాదులు బాంబులు అమర్చినప్పటికీ అవి పేలలేదు) నమోదైన 15 ఎఫ్ఐఆర్‌లు తదితర మొత్తం 35 వేర్వేరు పోలీసు కేసులను విలీనం చేసి ఈ విచారణను నిర్వహించారు. ఫిబ్రవరి 2022లో ప్రత్యేక కోర్టు 38 మంది ఐఎం సభ్యులకు మరణశిక్ష, మరో 11 మందికి జీవిత ఖైదు విధించింది. దోషులుగా తేలిన వారిలో సిమి మాజీ నాయకుడు సఫ్దర్ నాగౌరీతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, కేరళ, ఉత్తరప్రదేశ్‌తో సహా 11 రాష్ట్రాలకు చెందిన అతని అనుచరులు ఉన్నారు. దిగువ కోర్టు దోషులుగా నిర్ధారించిన వారందరూ ఆ తీర్పును హైకోర్టులో సవాలు చేశారు. దోషులకు విధించిన శిక్షలను ఖరారు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ సమయంలో దోషులకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాధారాలన్నింటినీ ప్రభుత్వం హైకోర్టు ముందు ఉంచిందని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ తెలిపారు. హైకోర్టు ఈ కేసును ఏడాదిన్నరకు పైగా సమగ్రంగా విచారించిందని, ఈ ఏడాది ఫిబ్రవరి నుండి రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిపిందని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు, గాయపడిన వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారాన్ని 2027 మార్చి 30 లోపు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించిందని పటేల్ చెప్పారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో దోషులకు ఏ కోర్టు అయినా మరణశిక్ష విధించడం ఇదే మొదటిసారి. 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో, 1998 జనవరిలో తమిళనాడులోని టాడా కోర్టు మొత్తం 26 మంది దోషులకు మరణశిక్ష విధించింది.

# సిజెపి 'ఎక్స్' హ్యాండిల్‌ను పునరుద్ధరించాలి

- ఢిల్లీ హైకోర్టు ఆదేశం
- జంతర్‌మంతర్ సందర్శించిన ఎస్‌కెఎం నేతల
- సిజెపి నిరసన, సోనమ్ వాంగ్‌చుక్ నిరాహారదీక్షకు మద్దతు



**న్యూఢిల్లీ :** మే నెలలో నిలిపివేసిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) అసలైన 'ఎక్స్' హ్యాండిల్‌ను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 21న జరగాల్సిన నీట్ పునఃపరీక్ష ఇప్పటికే ముగిసిపోయినందున, నిరోధక ఉత్తర్వును ఉపసంహరించుకున్నట్లు కేంద్రం కోర్టుకు తెలియజేయడంతో జస్టిస్ స్వరనా కాంత శర్మ ఈ ఉత్తర్వును జారీ చేశారు. ఈ ఉత్తర్వుపై స్పందిస్తూ, దీప్కే దీనిని సిజెపికి, ఉద్యమానికి, భావ ప్రకటనా స్వేచ్ఛకు, డిజిటల్ హక్కులకు ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు. తాము ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ యువత గొంతును వినిపిస్తూనే ఉంటామని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో, ఈ ఉత్తర్వును సాధించడంలో తమ సంస్థకు సహాయపడినందుకు సీనియర్ న్యాయవాది అఖిల్ సిబల్, న్యాయవాది బృందా గ్రోవర్, న్యాయవాది నకుల్ గాంధీలకు దీప్కే ధన్యవాదాలు తెలిపారు. మే 21న భారతదేశంలో సిజెపి అసలైన ఎక్స్ హ్యాండిల్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత, ఈ బృందం నిరోధక ఉత్తర్వుకు వ్యతిరేకంగా చట్టపరమైన పరిష్కారాలను కోరుతూనే, ఒక కొత్త ఎక్స్ హ్యాండిల్ ద్వారా తమ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించింది. ఇదిలా ఉండగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, పరీక్షలలో అవకతవకలపై ప్రభుత్వ జవాబుదారీతనం కోరుతూ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసన మంగళవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 10 రోజులు పూర్తయ్యాయి. కాగా, సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో ఎక్స్‌లో స్పందిస్తూ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించినప్పటి నుండి 6 కిలోలకుపైగా బరువు తగ్గారని, రక్తపోటు కూడా చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఎప్పుడు మేల్కొంటుంది? అని దీప్కే ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ప్రతినిధి బృందం ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు జంతర్ మంతర్ వద్ద నిరసన స్థలాన్ని సందర్శించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) రద్దు, ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, పరీక్షలలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు వంటి నిరసనకారుల డిమాండ్లకు రైతు సంఘం తమ మద్దతును పునరుద్ఘాటించింది. ఈ ప్రతినిధి బృందంలో హన్నన్ మొల్లా, పి. కృష్ణప్రసాద్ తదితరులతో సహా పలు ఎస్‌కెఎం అనుబంధ సంస్థల నాయకులు ఉన్నారు.

# చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇకపై ట్రస్ట్ సభ్యులు కారు

**శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రకటన**



**అయోధ్య :** శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మంగళవారం కీలక ప్రకటన చేసింది. మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా ఇకపై ట్రస్ట్ సభ్యులు కారని స్పష్టం చేసింది. ఈ ప్రకటనతో వారి హోదాకు సంబంధించి నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. సోమవారం జరిగిన సమావేశంలో చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలను ఆమోదించిన తర్వాత వారు ట్రస్ట్ సభ్యత్వం నుండి తప్పుకున్నారు అని ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి పిటిఐకి తెలిపారు. చంపత్ రాయ్ స్థానంలో రిటైర్డ్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి కృష్ణ మోహన్‌ను శాశ్వత ప్రాతిపదికన నియమించాలా వద్దా అనే విషయంపై 22న జరగబోయే తదుపరి సమావేశంలో ట్రస్ట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి కృష్ణ మోహన్‌ను ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అయితే భవిష్యత్తులో ఈ నియామకాన్ని శాశ్వతం చేయాలని ట్రస్ట్ నిర్ణయించవచ్చు అని గిరి పిటిఐకి చెప్పారు. ఈనెల 22న జరిగే సమావేశంలో కృష్ణ మోహన్ నియామకం, ఖాళీగా ఉన్న పదవులకు తగిన వారిని ఎంపిక చేయడంపై ట్రస్ట్ సభ్యులు చర్చించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా కేవలం తమ పదవుల నుండి మాత్రమే తప్పుకున్నారని, ట్రస్టీలుగా కొనసాగుతున్నారని వస్తున్న వాదనలను తోసిపుచ్చుతూ, సోమవారం జరిగిన సమావేశంలో రాజీనామాలు ఆమోదించబడిన వెంటనే వారు ట్రస్ట్ సభ్యత్వం నుండి వైదొలిగారని ఆయన స్పష్టం చేశారు. రాయ్, మిశ్రాల రాజీనామాల నేపథ్యంలో, ట్రస్ట్ ప్రత్యేక ఆహ్వానితుల జాబితా నుండి గోపాల్ నాగ (గోపాల్ రావు అని కూడా పిలుస్తారు)ను తొలగించాలని నిర్ణయించినట్లు కూడా గిరి పిటిఐకి ధృవీకరించారు.

చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల రాజీనామాకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, సీనియర్ ట్రస్టీ కె. పరాశరన్ సూచించినట్లుగా ట్రస్ట్ రాజ్యాంగం ప్రకారం రాజీనామా సమర్పించిన వెంటనే అమల్లోకి వస్తుందని, కాబట్టి దానిని ఆమోదించడం తప్ప ట్రస్ట్‌కు వేరే మార్గం లేదని గిరి వివరించారు. దీనివల్ల ఈ విషయంలో ట్రస్ట్‌కు ఎటువంటి విచక్షణాధికారం లేదని ఆయన పేర్కొన్నారు. ట్రస్ట్ నిర్ణయానికి సాధువుల సమాజం కట్టుబడి ఉందని, ట్రస్ట్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తామని జగద్గురు పరమహంస ఆచార్య పిటిఐకి తెలిపారు. ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలను ఆయన విమర్శించారు. అలాగే రామమందిర అంశంపై ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

## రామమందిర విరాళాల చోరీ కేసులో...

# దోషులను కాపాడే యత్నం

- బిజెపి-ఆర్ఎస్ఎస్‌పై మండిపడ్డ కాంగ్రెస్
- విరాళాలకు సంబంధించి పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిర విరాళాల చోరీ వ్యవహారంలో అసలు దోషులను కాపాడేందుకు బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు యత్నిస్తున్నాయని పేర్కొంది. అలాగే, విరాళాలకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని, ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ తన మౌనాన్ని వీడాలని డిమాండ్ చేసింది. అయోధ్యలోని శ్రీరామ మందిరంలో విరాళాల చోరీ వ్యవహారం దేశంలోని కోట్లాది మంది ప్రజల నమ్మకానికి జరిగిన తీవ్రమైన ద్రోహం అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'కేవలం రాజీనామాలు, పరిమిత చర్యల ద్వారా ఈ మొత్తం వ్యవహారాన్ని కప్పిపుచ్చి, అసలు దోషులను, పెద్ద వ్యక్తులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని దేశ ప్రజలు భావిస్తున్నారు' అని రమేష్ ఎక్స్ వేదికగా హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ డిమాండ్లను పునరుద్ఘాటిస్తూ, 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్'ను వెంటనే రద్దు చేయాలని, శంకరాచార్యులు, ధర్మాచార్యులు, సాధువులు, మతపరమైన ప్రతినిధులతో కూడిన కొత్త ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన సిట్‌పై ప్రజలకు నమ్మకం లేదని, సుప్రీం కోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు స్వతంత్రంగా జరగాలన్నారు. రామమందిరానికి అందిన నగదు, వస్తు రూపేణా వచ్చిన విరాళాల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కూడా రమేష్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధాని మోదీ తన మౌనాన్ని వీడాలని ఆయన అన్నారు. అంతకుముందు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ బిజెపి–ఆర్ఎస్ఎస్ ఆలయ నిర్వహణను అనధికారిక పద్ధతిలో తమ గుప్పిట్లోకి తీసుకున్నాయని ఆరోపించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన గెహ్లాట్, ట్రస్ట్‌ను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని, పారదర్శకత కోసం ప్రజలు ఇచ్చిన విరాళాల వివరాలను బహిర్గతం చేయాలన్న పార్టీ డిమాండ్లను పునరుద్ఘాటించారు. బిజెపి–ఆర్ఎస్ఎస్ దశాబ్దాల పాటు రామమందిర ఉద్యమాన్ని నడిపాయని, ఆ ఉద్యమం వల్లే వారు అధికారంలోకి రాగలిగారని గెహ్లాట్ పేర్కొన్నారు.

## కరూర్ తొక్కిసలాట కేసు....

# తమిళనాడు సిఎం పర్యటనలను కోర్టు నియంత్రించలేదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- డిఎంకె పిటిషన్ స్వీకరణకు నిరాకరణ



**న్యూఢిల్లీ:** కరూర్ తొక్కిసలాట కేసులో ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నిందితుడు కాదని, ఆయన పర్యటనలను కోర్టు నియంత్రించలేదని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆయన పర్యటనను ప్రశ్నిస్తూ, ఈ విషయంలో మంత్రులు సాక్షులను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ 'ద్రవిడ మున్నేట్ర కజగం' (డిఎంకె) దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా మండలించింది. న్యాయమూర్తులు జస్టిస్ కె.వి.విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ఒక పాక్షిక కార్యదిన ధర్మాసనం డిఎంకె పిటిషన్‌ను స్వీకరించడానికి నిరాకరించి, కార్యనిర్వాహక అధిపతి పర్యటనను కోర్టు ఎలా నియంత్రించగలదని ప్రశ్నించింది. తొక్కిలాట బాధితుల కుటుంబాలను జులై 10న ముఖ్యమంత్రి కలువనున్నారు. 'ఈ కేసులలో నమోదైన ఎఫ్ఐఆర్‌లలో ముఖ్యమంత్రి నిందితుడు కాదు. ఈ రోజు ఈ కోర్టును రాజకీయ వేదికగా మార్చడం ఎలా సాధ్యం?' అని డిఎంకె కార్యదర్శి ఆర్.ఎస్.భారతి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్‌ను జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు. గతేడాది సుప్రీంకోర్టు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేసిన తీర్పును ఉల్లంఘిస్తూ, తొక్కిసలాట కేసుకు సంబంధించి టివికె మంత్రులు ఒక కథనాన్ని సృష్టించేలా బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని రంజిత్‌కుమార్ వాదించారు. ఈ సందర్భంగా జస్టిస్ కె.వి.విశ్వనాథన్ స్పందిస్తూ 'ముఖ్యమంత్రి పర్యటనను సుప్రీంకోర్టు నియంత్రించి, ఆయన పర్యటన ప్రణాళికను ఖరారు చేయాలని మీరు కోరుకుంటున్నారా? ఇది ఎలా సాధ్యం అవుతుంది' అని ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించి తమిళనాడు మంద్రి ఆదవ్ అర్జున చేసిన కొన్ని వ్యాఖ్యలపైనా, గత ఏడాది సుప్రీంకోర్టు విధించిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు, ఆయనపైన డిఎంకె ధిక్కార పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉందని రంజిత్‌కుమార్ తెలిపారు. ఈ కేసు యోగ్యతల గురించి ముఖ్యమంత్రి, ఇతర రాష్ట్ర మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను నియంత్రించడానికి పార్టీ ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. అప్పుడు న్యాయమూర్తి విశ్వనాథన్ న్యాయవాది రంజిత్‌కుమార్‌ను ఉద్దేశించి 'అంటే మీరు భావ ప్రకటనా స్వేచ్ఛపై నిషేధాజ్ఞ విధించాలని కోరుకుంటున్నారా? మీరు మీ ప్రసంగంతో వారి ప్రసంగాన్ని ఎదుర్కొంటున్నారు. సుప్రీంకోర్టు సిబిఐకి బదిలీ చేసిన కేసులో రాజకీయ ప్రత్యర్థి తమను తాము ఎలా ప్రతివాదిగా చేర్చుకోగలరు ?' అని ప్రశ్నించారు. కుమార్ ఈ విషయమై స్పందిస్తూ 'లేదు, నేను అలా కాదు. నా ప్రార్థన ఏమిటంటే, సిబిఐ దర్యాప్తు పూర్తి అయ్యేవరకూ, నిష్పక్షపాతమైన, స్వతంత్ర దర్యాప్తునకు ఆటంకం కలిగించే విధంగా, నేర బాధ్యతను తొలగించే బహిరంగ ప్రకటనలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులతో మాట్లాడటం, లేదా పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు యోగ్యతపై మాట్లాడటం వంటివి ఏవీ ఉండకూడదు. భావ ప్రకటనా స్వేచ్ఛను మరింత బాధ్యతగా ఉపయోగించాలని పార్టీ కోరుకుంటోంది' అని న్యాయవాది రంజిత్‌కుమార్ చెప్పారు. అప్పటికే ప్రకటించిన రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో పరిహారం పంపిణీ, తొక్కిసలాట బాధితుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాల ఉత్తర్వులు ఈ కేసు దర్యాప్తును ఎలా ప్రభావితం చేస్తాయని జస్టిస్ విశ్వనాథన్ న్యాయవాది రంజిత్‌కుమార్‌ను ప్రశ్నించారు. డిఎంకె తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుని, చట్టప్రకారం మరేదైనా ఇతర మార్గాన్ని పొందవచ్చని లేనిపక్షంలో ఆ పిటిషన్‌ను కొట్టివేస్తామని కోర్టు రంజిత్‌కుమార్‌కు తెలిపింది. సిబిఐ విచారణ పెండింగ్‌లో ఉన్నంతకాలం ఈ కేసుపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, మంత్రి ఆదవ్ అర్జున, ఇతర నిందితులు బహిరంగ ప్రకటనలు చేయకుండా నిరోధించాలని, బాధితుల కుటుంబాలతో వారి సంభాషణలను నియంత్రించాలని కోరుతూ డిఎంకె కార్యదర్శి పిటిషన్ దాఖలు చేసారు. మృతులు, గాయపడిన బాధితుల కుటంబాలకు ప్రభుత్వ ఉత్తర్వులు, కారుణ్య నియామకాలు, ఇతర ప్రయోజనాలను పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి కరూర్ పర్యటనకు రానున్నారనే వార్తలను ఆ పిటిషన్‌లో ప్రస్తావించారు.

## టిఎంసి బ్యాంక్ ఖాతాల నిధుల కేసులో...

# 5 ప్రాంగణాలలో 'ఇడి' సోదాలు

- 3 బ్యాంక్ ఖాతాలు స్వాధీనం
- పార్టీ అకౌంట్లలో దాదాపు రూ.440 కోట్లు ఉన్నట్లు అంచనా

**కోల్‌కతా/న్యూఢిల్లీ :** తృణమూల్ కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాల్లోకి అనుమానాస్పద నిధులు మళ్లించిన వ్యవహారానికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మంగళవారం కోల్‌కతాలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ విషయాన్ని అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్ రాజధాని నగరంలోని సుమారు 5 ప్రాంతాలలో ఈ సోదాలు జరుగుతున్నాయని వారు చెప్పారు. విమానయాన, ప్రయాణ సంస్థల ద్వారా రూ.150 కోట్లకు పైగా నిధులు మళ్లించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కోల్‌కతాకు చెందిన ప్రైవేట్ చార్టర్ విమానాల అద్దె 'కేర్‌వెల్ ఏవియేషన్' ప్రాంగణంలో, దాని డైరెక్టర్లు, ఒక ఎన్నికల ట్రస్ట్‌గా భావిస్తున్న సంస్థ ప్రాంగణాలలో సోదాలు జరుగుతున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు చెప్పారు. అయితే 'పిటిఐ' కు కంపెనీ నుంచి ఇంకా సమాధానం రావాల్సి ఉంది. గత నెలలో కోల్‌కతా పోలీసులు డెబిట్ కార్యకలాపాలను స్థంభింపజేశారు. ప్రతిపక్షపార్టీ ఆర్థిక నియంత్రణపై తీవ్రమైన అంతర్గత కలహాలు కొనసాగుతున్నప్పటికీ నిధుల మూలంపై విచారణ కోరుతూ రెబల్ పార్టీ ఎమ్మెల్యేలు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో పార్టీకి చెందిన మూడు బ్యాంక్ ఖాతాలను స్వాధీనం చేసుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలలో దాదాపు రూ.440 కోట్లు ఉన్నట్లు అంచనా.

# 8వ తరగతి సోషల్ సైన్స్‌లో మార్పులు

**సుప్రీంకోర్టు ఆదేశాలతో దిగొచ్చిన ఎన్‌సిఇఆర్‌టి**




**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థపై వివాదానికి దారితీసిన 8వ తరగతి సోషల్ సైన్స్ పాఠ్యపుస్తకాన్ని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) పూర్తిగా సవరించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వివాదాస్పద అంశాల్ని తొలగించి కొత్త అధ్యాయాన్ని విడుదల చేసింది. న్యాయ వ్యవస్థలో అవినీతి, కోర్టుల్లో భారీగా కేసుల పెండింగ్, కీలక తీర్పులకు సంబంధించిన అంశాల్ని తొలగించగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్), ట్రైబ్యునల్స్, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై కొత్త సమాచారాన్ని చేర్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో తీవ్ర వివాదం చెలరేగింది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపైనే సుప్రీంకోర్టు సుమోటాగా విచారణ చేపట్టింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తయిన, అలాగే డిజిటల్ కాపీలు అన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో ఎన్‌సిఇఆర్‌టి కూడా క్షమాపణలు చెప్పింది. కాగా, తాజాగా సవరించిన పాఠ్య పుస్తకంలో పలు కీలక మార్పులు చేశారు. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూరకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చారు. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించారు. ఇందులో కోర్టుల్లో కేసుల భారీ పెండింగ్‌కు న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని పేర్కొన్నారు. గతంలో విడుదలైన పుస్తక రూపకల్పన బృందంలో మొత్తం 51 మంది సభ్యులు ఉండగా, తాజా సవరించిన ఎడిషన్‌లో 48 మంది మాత్రమే ఉన్నారు. వివాదాస్పద అధ్యాయానికి బాధ్యత వహించినట్లు భావించిన మిషెల్ డానినో, సుపర్ణా దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్ పేర్లను జాబితా నుంచి ఎన్‌సిఇఆర్‌టి తొలగించింది. ఈ మార్పులతో 8 వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని న్యాయ వ్యవస్థ అధ్యాయాన్ని పూర్తిగా కొత్త రూపంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చింది.

IN THE COURT OF THE HON'BLE 1st ADDL JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY

OS. NO. 292 of 2024

Between:
1. Pillamari Ramesh
2. Pillamari Venkatswamy
... Petitioners / Plaintiffs
Vs
1) The state of Telangana Rep By District collector
2) Whom so ever it may concern
... Respondents / defendants

NOTICE

Where as the above named plaintiffs have filed a suit for declaration, declare the plaintiffs are legal heirs of the Deemed dead person i.e. Pillamari Nagamallu the said case is posted on **22.07.2026** for your appearance at **10.30 AM** before the said court.

Therefore you are here by directed to appear before the said court along with documents to claim your defence if any otherwise the matter will be decided ex parte against you.

" By order of the court "

Sd/- CHEERLA ASHOK REDDY
B.tech, LLB
ADVOCATE
9849109050

# ట్రై కార్పొరేషన్‌లలో 'స్కై' స్కామ్ ?

### 'చారాణ కోడికి బారాణ మసాల' చందంగా మారిన పరిస్థితి
### సొంతంగా కొనకుండా.. అవసరానికి మించి భారీ అద్దెలకు టెండర్లు !
### కాంట్రాక్టర్‌ల జేబుల్లోకి కోట్లాది రూపాయల ప్రజాధనం?




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'చారణ కోడికి బారాన మాసాల' అన్న చందంగా తయారైంది గ్రేటర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్‌ల తీరు. వీధి దీపాల నిర్వహణ, చెట్ల కొమ్మల కత్తిరింపు (ప్రూనింగ్) కోసం ఉపయోగించే 'స్కై బకెట్ లాడర్స్' వాహనాల టెండర్లలో భారీ ఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అక్రమార్కుల జేబుల్లోకి నింపేందుకు కొందరు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

**లీజు ధర చూస్తే మతిపోవాల్సిందే !**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి)లో ఇటీవల జరిగిన స్కై బకెట్ లాడర్స్ టెండర్ ప్రక్రియను పరిశీలిస్తే ఈ అవినీతి భాగోతం స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా ఒక కొత్త స్కై బకెట్ లాడర్ వాహనం కొనుగోలు విలువ రూ. 23 లక్షలు మాత్రమే ఉంటుంది. కానీ, దానికి ఏడాదికి చెల్లిస్తున్న అద్దె అక్షరాలా రూ. 44 లక్షలు కావడం గమనార్హం!. వాహనం కొనే ధర కంటే, ఏడాది అద్దె ధర రెట్టింపు ఉండటం వెనుక ఉన్న అంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సొంతంగా వాహనాలు కొనుగోలు చేయకుండా, ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చడానికే ఈ అద్దె నాటకమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు బేఖాతర్.. నచ్చిన వారికే కట్టబెట్టారు! వాస్తవానికి నెలకు రూ. 1.20 లక్షల అద్దె చెల్లించాల్సి ఉండగా, ఏకంగా రూ. 3.50 లక్షలు చెల్లించేందుకు టెండర్లు ఖరారు చేసినట్లు సమాచారం. 30 నుంచి 40 శాతం తక్కువ (లెస్) టెండర్లు దాఖలు చేసిన నమ్మకమైన సంస్థలను పక్కనబెట్టి, అత్యధిక ధరలు కోట్ చేసిన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున కమిషన్లు చేతులు మారాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నియమాలు ఉల్లంఘించి టెండర్లు..**

సాధారణంగా ఈ టెండర్ల ప్రక్రియను ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా అర్బన్ బయోడైవర్సిటీ (యుబిడి) విభాగం ద్వారా టెండర్లు ఆహ్వానించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది ఉన్నతాధికారులు కమిషనర్లనే తప్పుదోవ పట్టిస్తున్నట్లు సమాచారం.

**సర్కిల్‌కో వాహనం.. అవసరానికి మించి దుబారా !**

గతంలో జిహెచ్‌ఎంసిలోని ఆరు జోన్‌ల పరిధిలో, జోన్‌కు రెండు చొప్పున మాత్రమే స్కై బకెట్ లాడర్లను ఏర్పాటు చేసేవారు. అది కూడా కేవలం వినాయక చవితి, వర్షాకాలం సమయాల్లో (మే నుంచి డిసెంబర్ వరకు) మాత్రమే వాడేవారు. కానీ ఇప్పుడు ఏడాది పొడవునా అద్దె ప్రాతిపదికన వీటిని కొనసాగించాలని నిర్ణయించారు. మూడు కార్పొరేషన్ల (జిహెచ్‌ఎంసి, సిఎంసి, ఎంఎంసి) పరిధిలో జోన్‌ల వారీగా కాకుండా, ఏకంగా సర్కిల్‌కు ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 60 సర్కిళ్ల పరిధిలో 60 స్కై బకెట్ లాడర్లను అద్దెకు తీసుకునేందుకు పావులు కదుపుతున్నారు.

**ఆర్థిక సంక్షోభంలో ఉన్నా పట్టించుకోరా?**

ఇప్పటికే తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ట్రై కార్పొరేషన్‌లలో, ఈ తరహా నిధుల దుర్వినియోగం ఇష్టారాజ్యంగా సాగుతోంది. సిఎంసిలో అమలు చేసిన ఈ 'దోపిడీ' విధానాన్నే జిహెచ్‌ఎంసి, ఎంఎంసిల్లో కూడా అమలు చేసేందుకు అధికారులు ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది. నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాల్సిన ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ టెండర్ల వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## 'సౌందర్య వైద్యం'పై ఎంబిబిఎస్ విద్యార్థులకు దంత వైద్యునితో శిక్షణ

### 'హెయిర్‌సైన్స్ క్లినిక్'ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెడికల్ కౌన్సిల్
### వైద్యునిపై చర్యలకు 'డెంటల్ కౌన్సిల్'కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అర్హత,నైపుణ్యంలేని వారితో 'సౌందర్య వైద్య కోర్సు'లో శిక్షణ ఇస్తున్న హైదరాబాద్‌లోని ఒక శిక్షణ సంస్థను తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ (టిఎంసి) మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసింది. ఎంబిబిఎస్ విద్యార్థులకు ఒక దంత వైద్యునితో సౌందర్య వైద్యంలో శిక్షణ ఇవ్వడం పట్ల టిఎంసి విస్మయం వ్యక్తం చేసింది. హైదరాబాద్,హైటెక్ సిటీలో ఉన్న 'హెయిర్‌సైన్స్ క్లినిక్'ను డాక్టర్ జలగం విజయ్‌తో కలిసి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ గుండగాని శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ క్లినిక్ ప్రాంగణంలో స్కూల్ ఆఫ్ ఎస్తెటిక్స్ పేరుతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిండాన్ని వారు గుర్తించారు. అర్హత లేని ఒక దంత వైద్యునితో ఎంబిబిఎస్ వైద్యులకు 'ఎస్తెటిక్' విధానాలపై శిక్షణ ఇస్తున్నట్టు వారు గుర్తించారు. సరైన అర్హతలేని వారు ఇలాంటి శిక్షణ ఇవ్వడం ప్రజారోగ్యానికి, రోగుల భద్రతకు తీవ్రమైన ముప్పుగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అభిప్రాయపడింది.ఈ అంశా న్ని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశంలో చర్చించి, ఆ సంస్థపైన తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. శిక్షణకు అర్హత లేని దంత వైద్యునిపైన చర్యలు తీసుకోవాలని డెంటల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయనున్నారు. అనధికారిక శిక్షణ, నకిలీ సర్టిఫికెట్లు, శాస్త్రీయ ఆధారాలు లేని ఎస్తెటిక్ కోర్సుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రజలకు సూచించింది .



## గురుకులాల్లో నాణ్యతకు పెద్దపీట..

### బిసిల ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిశుభ్రత, పచ్చదనం, ప్రభుత్వ మెనూ అమలులో ఎలాంటి రాజీ ఉండరాదని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో బిసి స్టడీ సర్కిల్స్‌ను బలోపేతం చేయడం, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడం, కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. అన్ని గురుకులాలు, హాస్టళ్లలో పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు.జిల్లా బిసి సంక్షేమ అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన మంత్రి, ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి పరిస్థితులను పరిశీలించాలని కోరారు.బిసి స్టడీ సర్కిల్స్‌లో నాణ్యత పెంపొందించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూలై 16 నుంచి హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కుట్టు మిషన్ పథకానికి సమగ్ర విధివిధానాలు రూపొందించాలని మంత్రి తెలిపారు.

## గెస్ట్ లెక్చరర్ల వేతనం పెంచాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు, గెస్ట్ ఫ్యాకల్టీల వేతనాలను ఎన్నికల హామీ మేరకు నెలకు రూ.50 వేలుకు పెంచడంతోపాటు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన సిఎంకు లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ,240 మంది గెస్ట్ లెక్చరర్లు గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ ప్రస్తుతం నెలకు రూ.28 వేలవేతనంతోనే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో ఈ వేతనంతో కుటుంబాలను పోషించడం కష్టమవుతోందని తెలిపారు.అలాగే యూనివర్సిటీలు, కళాశాలల్లో సుమారు 1,940 అధ్యాపక పోస్టులు ఖాళీ ఉండటంతో విద్యాబోధనపై ప్రభావం పడుతోందని, దీర్ఘకాలంగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేయాలని కోరారు.గెస్ట్ లెక్చరర్లకు సాధారణ సెలవుల సౌకర్యం కూడా లేకుండా అనిశ్చిత పరిస్థితుల్లో పనిచేస్తున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం తక్షణమే వేతన పెంపు, ఉద్యోగ భద్రత, ఖాళీ పోస్టుల భర్తీపై నిర్ణయం తీసుకోవాలని జాన్‌వెస్లీ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## అయోధ్య రామమందిరం ట్రస్ట్ వ్యవహారంపై సిబిఐ విచారణ

### వి. హనుమంతరావు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అయోధ్య రామమందిరం ట్రస్ట్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలపై వెలువడుతున్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే సిబిఐ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. రాముడి పేరుతో వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. గాంధీభవన్‌లో మీడియాతో మంగళవారం మాట్లాడిన ఆయన, రాముడిని రాజకీయంగా వినియోగించుకున్న బిజెపి నాయకులు ఇప్పుడు రామమందిరం ట్రస్ట్‌పై వస్తున్న ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. రాముడి పేరుతో ప్రజల విశ్వాసాన్ని దుర్వినియోగం చేసి కోట్లాది రూపాయలు కాజేశారనే ఆరోపణలు తీవ్రమైనవని అన్నారు. తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీ అంశంపై సిబిఐ విచారణకు డిమాండ్ చేసిన బిజెపి, అయోధ్య రామమందిరం ట్రస్ట్ వ్యవహారంలో మాత్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. రాముడి డబ్బుతో కొందరు బంగ్లాలు, విల్లాలు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు.



## 'సర్' ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### అడిషనల్ సిఇఒ వాసం వెంకటేశ్వర్లు రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు రెడ్డి ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జల్‌పల్లి, మీర్‌పేట్ ప్రాంతాలతో పాటు, ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని సరూర్ నగర్ ప్రాంతాలలో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ పురోగతిని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయడంలో సూపర్‌వైజర్లు ముఖ్య భూమిక పోషించాలని, ఫారాల నింపే ప్రక్రియలో బిఎల్‌ఓలకు పూర్తిస్థాయిలో సహకరించాలని స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాలలో వాలంటీర్ల సేవలను సైతం వినియోగించుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా, ప్రతి ఎన్యూమరేషన్ ఫారంలో ఓటరు సంతకంతో పాటు తప్పనిసరిగా వారి గుర్తింపు ఫోటో ఉండేలా చూసుకోవాలన్నారు. పర్యటనలో భాగంగా జల్‌పల్లి పరిధిలోని సుమారు 32 ప్రాంతాలలో నివసిస్తున్న రోహింగ్యాల ఆవాసాలను వాసం వెంకటేశ్వర్లు రెడ్డి సందర్శించారు. అక్కడ నివసిస్తున్న వారి వివరాలను అడిగి తెలుసుకుని, వారిని ప్రత్యేకంగా గుర్తించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో స్థానిక ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి కష్టాలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం : కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వర్షాకాలంప్రారంభమైన తర్వాత కూడా హైదరాబాద్‌లో నీటి కష్టాలు కొనసాగటం దారుణమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జూలై నెలలో రోజుకు 10 వేల ట్యాంకర్లు బుక్ చేసుకునే పరిస్థితి ఉందంటే హైదరాబాద్ మహా నగరంలో తాగునీటి సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు కవిత తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో నీటి కష్టాలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నగర దాహార్తిని తీర్చేందుకు కొండ పోచమ్మ సాగర్ నుంచి ప్లాన్ చేసిన తాగు నీటి పథకాన్ని కాదని, మల్లన్నసాగర్ నుంచి గోదావరి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు ఫేజ్ 2, ఫేజ్ 3 ను చేపట్టారని, ఇది కేవలం ఒక సంస్థకు భారీ లాభాన్ని చేకూర్చి, తద్వారా భారీ మొత్తంలో కమీషన్లను దండుకోవాలనే కుట్ర అని ఆరోపించారు. నీటి కొరత లేకుండా చేసేందుకు ప్రభుత్వం వద్ద కనీసం ఒక ముందస్తు ప్రణాళిక కూడా లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వెంటనే గోదావరి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు



## వర్షాకాలంలో రైలు భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం

### - దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వర్షాకాలంలో రైళ్ల రాకపోకలు ఎలాంటి అంతరాయం లేకుండా సురక్షితంగా కొనసాగేందుకు అన్ని స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో జోన్‌లో చేపట్టిన ముందస్తు భద్రతా చర్యలను మంగళవారం రైల్ నిలయంలో సమీక్షించిన ఆయన, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలపై 24 గంటల నిఘా కొనసాగించాలని సూచించారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్, ప్రిన్సిపల్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్‌తో కలిసి నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్‌ఎంలు, సీనియర్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.సమావేశంలో వర్షాకాలానికి సున్నితమైన ట్రాక్‌లు, వంతెనలు, సొరంగాలు, రోడ్ అండర్ బ్రిడ్జిల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిఎం సమీక్షించారు. నీరు నిలిచే అవకాశం ఉన్న అండర్ బ్రిడ్జిల వద్ద లిఫ్టింగ్ బ్యారియర్లు, డ్రైనేజీ వ్యవస్థలు, హెచ్చరిక బోర్డులు, నీటిని తొలగించే పంపులు, 24 గంటల సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జోన్‌లోని మొత్తం భద్రతా పనితీరును కూడా సమీక్షించిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లకు గ్రూప్ సమావేశాలు, వ్యక్తిగత కౌన్సెలింగ్ ద్వారా భద్రతపై నిరంతర అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

## హుస్సేన్ సాగర్ ఎఫ్‌టిఎల్‌లో భారీ భవనాలు

### బిల్డర్‌కు జిహెచ్‌ఎంసి నోటీసులు !

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన హుస్సేన్ సాగర్ చెరువు పూర్తి నీటి మట్టం (ఎఫ్‌టిఎల్) పరిధిలో నిర్మించిన ఒక భారీ బహుళ అంతస్తుల భవన సముదాయం ఇప్పుడు తీవ్ర వివాదంలో చిక్కుకుంది. సోమాజిగూడ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా, వాస్తవాలను మరుగుపరిచి నిర్మించిన ఈ ట్విన్ టవర్ల బిల్డర్‌కు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. తప్పుడు సమాచారంతో నిర్మాణ అనుమతులు పొందినందుకు గాను, ఆ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని అధికారులు బిల్డర్‌ను ఆదేశించింది. రెండు సెల్లార్లు, ఒక స్టిల్ట్, 17 అంతస్తులతో కూడిన రెండు భారీ టవర్ల నిర్మాణానికి జిహెచ్‌ఎంసి గత ఎనిమిదేళ్ల క్రితం డిపిఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేసింది. అయితే, ఈ నిర్మాణ స్థలం హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టిఎల్ పరిధిలోకి వస్తుందని జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు తాజాగా ధృవీకరించారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే ముందు చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

**అధికారుల మధ్య దోబూచులాట?**

ఈ భవన నిర్మాణ స్థలానికి సంబంధించి గతంలోనే యాజమాన్య హక్కుల వివాదం నడిచింది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు కూడా వెళ్ళింది. 'ప్రైవేట్ భూములకు సంబంధించి కోర్టు స్టే ఉత్తర్వులు లేనంతవరకు, దరఖాస్తుదారులు సమర్పించిన యాజమాన్య పత్రాల ఆధారంగా మేము అనుమతులు ఇస్తాము' అని ఒక ఉన్నతాధికారి తెలిపారు. నిర్మాణం ప్రారంభ దశలోనే ఈ స్థలం హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టిఎల్ పరిధిలోకి వస్తుందని సాగునీటి శాఖ అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేసింది. సాగునీటి పారుదల శాఖ అభ్యంతరం తెలపడంతో, ఈ ఫైల్‌ను అప్పట్లో చెరువుల రక్షణ బాధ్యతలు చూస్తున్న హెచ్‌ఎండిఎ సమీక్షకు పంపారు. అక్కడ ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఫైల్ క్లియర్ అయిపోవడం గమనర్హం. చెరువుల ఎఫ్‌టిఎల్ పరిధి నిర్ధారణలో నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌ఓసి) ఇచ్చే అధికారం హెచ్‌ఎండిఏకు లేదని, కేవలం నీటిపారుదల శాఖకే ఆ అధికారాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. దీన్ని బట్టి అనుమతుల ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించినట్లు స్పష్టమవుతోంది.

**బయటపడ్డ అక్రమాలు**

నిర్మాణమంతా పూర్తయ్యాక, బిల్డర్ భవన ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసి) కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఈ అక్రమాలపై జిహెచ్‌ఎంసికి ఫిర్యాదు అందింది. దీనిపై నీటిపారుదల శాఖతో జరిపిన విచారణలో ఆరోపణలు నిజమేనని తేలింది. అనుమతుల మంజూరులో 'విధానపరమైన లోపాలు' జరిగాయని, చట్టప్రకారం తదుపరి చర్యలు ఉంటాయని ఈ వ్యవహారంపై జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పష్టం చేశారు. అయితే బిల్డర్‌కు నోటీసులు ఇచ్చిన విషయాన్ని ఆయన ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. సోమవారం రోజున జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాతో కలిసి వివాదాస్పద నిర్మాణ స్థలాన్ని స్వయంగా పరిశీలించడం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్నందున ఈ భవనాలపై ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

## మాజీ ఎంఎల్‌ఎ కొమ్మిడి నర్సింహారెడ్డి మృతికి సిఎం రేవంత్ రెడ్డి సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భువనగిరి మాజీ ఎంఎల్‌ఎ కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నర్సింహారెడ్డి తుదిశ్వాస వరకు నీతి, నిజాయితీతో జీవించారని కొనియాడారు. గోదావరి జలాల సాధన, మూసీ పరిరక్షణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషిస్తూ ప్రజల పక్షాన నిరంతరం నిలిచారని సిఎం గుర్తుచేశారు. భూదానోద్యమానికి తన 300 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప మానవతావాది అని అభివర్ణించారు. 1978, 1983 సంవత్సరాల్లో రెండుసార్లు భువనగిరి నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఏగా ప్రాతినిథ్యం వహించిన కొమ్మిడి నర్సింహారెడ్డి నిరాడంబర జీవితాన్ని గడుపుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. నేటి తరానికి ఆయన ఆదర్శప్రాయుడని సిఎం కొనియాడారు. కొమ్మిడి నర్సింహారెడ్డి ఆత్మకు శాంతి చేకూర్చాలని ముఖ్యమంత్రి ఆంక్షించారు. కొమ్మిడి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు సిఎం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**తెలంగాణకు తీరని లోటు : మంత్రి అడ్లూరి**

భువనగిరి మాజీ ఎంఎల్‌ఎ తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకుడు కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన నాయకుడిగా, తెలంగాణ ఉద్యమం, మూసీ పరిరక్షణలో ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన మృతి తెలంగాణకు తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**రాపోలు ఆనంద భాస్కర్ సంతాపం**

కొమ్మిడి నరసింహారెడ్డి మరణంతో వీర తెలంగాణ కాంగ్రెస్ తరం కనుమరుగైందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపి రాపోలు ఆనంద భాస్కర్ అన్నారు. . ప్రజాహిత అంకిత భావం నిలువెత్తు నిదర్శనంగా నరసింహారెడ్డి జీవించారని, తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఆయన మార్గదర్శనం, ప్రోత్సాహం తనకు ఎంతో క్రియాశీలకంగా ఉపకరించిందని పేర్కొన్నారు. కొమ్మిడి నరసింహారెడ్డి కి నివాళ్లు అర్పిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు, రాపోలు ఆనంద భాస్కర్ తన ప్రగాఢ సంతాపం, సానుభూతినితెలిపారు.

## మాది అభివృద్ధి పథమే తప్ప... విస్తరణవాదం కాదు

### ఇండో–పసిఫిక్ నౌకాస్వేచ్ఛకే కట్టుబడి ఉన్నాం
### భద్రతామండలి సంస్కరణలే ప్రపంచానికి కీలకం
### ఇండోనేసియా పార్లమెంటులో మోదీ ప్రసంగం



**జకర్తా:** భారతదేశం అనుసరిస్తున్నది అభివృద్ధి పథమే తప్ప విస్తరణ వాదం కాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా అనుసరిస్తున్న విస్తరణవాద ప్రవర్తన ఆగ్నేయాసియా దేశాలలో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్న తరుణంలో ఇండోనేసియా పార్లమెంటులో మంగళవారం నాడు మోదీ ప్రసంగిస్తూ, భద్రతామండలిలో సంస్కరణలే ప్రపంచానికి ఎంతో కీలకమని అన్నారు. 140 కోట్ల మంది భారతదేశ ప్రజలు, 29 కోట్ల మంది ఇండోనేసియా పౌరులు ఉమ్మడి శ్రేయస్సుకోసం సంపద్వంతమైన ప్రగతిని ముందుకు తీసుకువెళ్ళేందుకు కలిసి సాగించే ప్రయాణంలో సృష్టించే ఒక చరిత్రను ప్రపంచదేశాలు రెండు కళ్ళతో వీక్షిస్తాయని అన్నారు. ఇండోనేసియా పార్లమెంటులో ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో,ఆయన సహచర అగ్రశ్రేణి మంత్రులు, చట్టసభ సభ్యులు మోదీ ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు.''స్వేచ్ఛాయుతమైన,బహిరంగ,సర్వసమ్మిళిత ఇండో–పసిఫిక్ జలమార్గాన్ని, రాకపోకలను భారతదేశం చాలా గట్టిగా సమర్థిస్తుంది, ఈ ప్రాంతంలో నౌకాయాన స్వేచ్ఛను భారత్ ఎల్లప్పుడూ విశ్వసిస్తుంది'' అన్నారు. ''భారతదేశం అభివృద్ధి మార్గాన్నే నిరంతరం అనుసరిస్తుంది తప్ప విస్తరణవాదాన్ని కాదు'' అన్నారు. 1950వ దశకం నుండి భారత్–ఇండోనేసియా మధ్య కొనసాగుతున్న సంబంధాల చరిత్రను ఆయన ఉటంకించారు. ''రెండు దేశాలూ 1955లో ప్రఖ్యాత బాండంగ్ సదస్సులో కీలకపాత్ర వహించాయి, ఇప్పుడు ఇరు దేశాలకు అనేక రంగాలలో అపారమైన, పరిమితిలేని ఎన్నో అవకాశాలు ఎదురుచూస్తున్నాయి, వాటిని అందిపుచ్చుకుని ఇరు దేశాల ప్రజలకోసం మనం ఉమ్మడిశ్రేయస్సు దిశగా ప్రయాణం చేయాలి'' అన్నారు. ఆనాడు కొత్తగా స్వాతంత్ర్యం పొందిన, ప్రపంచంలో సగం జనాభాకు ప్రాతినిధ్యం వహించే ఆసియా–ఆఫ్రికాలకు చెందిన 29 దేశాల ప్రతినిధులు ఇండోనేసియా బాండుంగ్‌లో జరిగిన సదస్సుకు హాజరైన విషయాన్ని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రచ్ఛన్నయుద్ధం సమయంలో ఈ దేశాలు అలీన ఉద్యమానికి పునాదులు వేశాయని గుర్తుచేశారు. ''భారత్–ఇండోనేసియాలకు సంబంధించి మాట్లాడుకుంటే, ఇరు దేశాలమధ్య సముద్ర జలాలు పెద్ద దూరం కాదు, రెండింటిమధ్యా బంధాన్ని ఈ సముద్ర జలాలు దూరం చేయలేవు, రెండు దేశాల మధ్యా ఎప్పటికీ ఇది ఒక వంతెనా ఉంటుంది, మన ఉమ్మడి భవిష్యత్తుకు ఇదొక కేంద్రంగా ఉంటుందని మోదీ అన్నారు. మన రెండు దేశాలు కలిసి ఒకటిగా నిలబడినప్పుడు ప్రజాస్వామ్యం అవకాశాలు సృష్టిస్తుందని, ప్రజాస్వామ్యం విశ్వాసాన్ని నిర్మిస్తుందన్న ప్రపంచానికున్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తాయని, ప్రజాస్వామ్యమే దేశాల భవిష్యత్తును తీర్చి దిద్దుతాయని అన్నారు. ఇండియా–ఇండోనేసియా–ఇండియన్ ఓషన్ వంటి ఈ మూడు పేర్లూ మన రెండు దేశాలమధ్యా ఉన్న లోతైన సంబంధాలకు ప్రతీకగా ఉంటాయని ఉద్ఘాటించారు. రెండు దేశాలమధ్యా ఉన్న సద్భావన ఇరు దేశాల పౌరులకు కొత్త అవకాశాలను సృష్టించాలన్నారు. ఇరు దేశాలమధ్యా ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో సహకారాన్ని మోదీ ప్రస్తావించారు. సహకారాన్ని విస్తరించడం ద్వారా శాంతిని ఆకాంక్షించే శక్తులను ఇరు దేశాలు బలోపేతం చేయాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకున్న భౌగోళిక రాజకీయ వాతావరణాన్ని మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావాలని, ఈ సంస్కరణలనే భారత్ చాలా బలంగా విశ్వసిస్తోందని చెప్పారు. ఈ సంస్కరణల ప్రక్రియ ఇప్పటికే దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు.

## హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో బిజెపి, కాంగ్రెస్ విఫలం : బిఆర్‌ఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్రంలోని బిజెపి,రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని బిఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. భూమి యజమానులతో సంబంధం లేకుండానే భూ భారతిలో భూమిని బదలాయించారన్నారు.'ఎల్ నినో' పట్ల కేంద్రం అప్రమత్తం చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, నాయకులు వేర్వేరుగా మాట్లా డారు. బిఆర్‌ఎస్‌ఎల్‌పి విప్ కె.పి.వివేకానంద మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి 'హైడ్రా, మెట్రో, మూసీ,హిల్ట్ పాలసీ లాంటి' విధ్వంస నిర్ణయాలు తీసుకున్నారన్నారు. మెట్రో విషయంలో ఎల్ అండ్ టితో చేసుకున్న ఒప్పందం వల్ల ప్రభుత్వంపైన ప్రతి రోజు రెండున్నర కోట్ల రూపాయల భారం పడుతోందన్నారు. ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూల్చాలనే ఎపి సిఎం చంద్రబాబు కుట్ర మేరకే తెలంగాణ రాష్ట్రంలో ఆదిత్యనాథ్ దాస్ పని చేస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంలో జలాశయాలు, చెరువుల్లో నీరు లేదని, భూగర్భ జలాలు పడిపోయాయని, నాట్లు వేయడం కాదు కదా కనీసం నార్లు పోసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు, తాగు నీటితో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న భూ భారతి పోర్టల్‌లో 22 వేల భూ బదలాయింపులు జరిగాయన్నారు. భూమి యజమానులకు సంబంధం లేకుండా భూ భారతి పోర్టల్ లో మార్పులు చేశారని ఆరోపించారు. రంగారెడ్డి,మేడ్చల్,సంగారెడ్డి,సిద్దిపేట,సిరిసిల్ల జిల్లాల్లో పోర్టల్ మార్పు చేశారని, శేరిలింగంపల్లిలో 13 గుంటల భూమిని సహస్ర ఇన్‌ఫ్రా కంపెనీకి బదలాయించారన్నారు. హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాల్లో 200 ఎకరాలకు పైగా భూమిని బదలాయింపు చేశారు.

## 10 నుంచి 13 వరకు 'ఇంట్రా కాలేజ్ ఫేజ్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)2026 మూడో విడత సీట్ల కేటాయింపు పక్రియ ముగిసిన నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 13 వరకు ఇంట్రా కాలేజ్ ఫేజ్‌కు అవకాశం కల్పించినట్టు దోస్త్2026 కన్వీనర్, ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట్రా కాలేజ్ ఫేజ్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 14న సీట్లను కేటాయించనున్నారు. మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లను కేటాయించనున్నారు. దోస్త్2026 మూడు విడతల సీట్లు కేటాయింపు పూర్తయింది. విద్యార్థులు కాలేజీల్లో చేరే గడువు కూడా ముగిసింది. మూడో విడత కేటాయింపు సందర్భంగా కాలేజీల్లో చేరడానికి ఈ నెల 4వ తేదీ వరకు అవకాశం కల్పించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దోస్త్ ద్వారా 1,17,658 మంది కాలేజీల్లో చేరినట్టు తెలిసింది. నాన్ దోస్త్ కాలేజీల్లో 21,034 మంది చేరారు.



## హాస్టల్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

### డిపో మేనేజర్‌కు ఏఐవైఎఫ్ వినతి

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్టలోని ప్రభుత్వ హాస్టల్ నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులకు వెంటనే ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఏఐవైఎఫ్ నాయకులు యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట ప్రభుత్వ హాస్టల్లో సుమారు 80 మంది విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. హాస్టల్ నుండి పాఠశాల చాలా దూరంలో ఉండటంతో, బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ప్రతిరోజూ కాలినడకన తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత విద్యాసంవత్సరంలో విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన అధికారులు, ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులవుతున్నా పట్టించుకోక పోవడం సరికాదన్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా వెంటనే హాస్టల్ నుండి పాఠశాల వరకు బస్సు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, సంఘం నాయకులు అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, కంబాల నరసింహ, తాడూరి వెంకటేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి, మోడల్ పాఠశాలల్లో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేపడతున్న మరమ్మతు పనుల గురించి ఎస్‌వో విజయలక్ష్మి ని అడిగి తెలుసుకొని త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం కేజీబీవి లో ఆరవ తరగతిలో విద్యార్థులను చదివించడం జరిగింది. బాలికల హాస్టల్ గదులను, కిచెన్ షెడ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను సందర్శించి మాట్లాడుతూ ప్రాంగణం ముందు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నిర్వాహకులు కేర్ కావాలని కోరగా పరిశీలిస్తామని తెలిపారు. మోడల్ స్కూల్‌లో మరుగుదొడ్లను పరిశీలించి ప్రిన్సిపాల్ రాముపై అసహనం వ్యక్తం చేశారు. నిధులు, స్కూల్ గ్రాంట్లు వచ్చిన ఇంకా ఎందుకు మరమ్మతులు చేయించలేదని దినిపై స్పెషల్ ఎంక్వైరీ కమిటీని ఏర్పాటు చేస్తామని అన్నారు. రెండు రోజుల్లో మరమ్మతులను చేపట్టాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, మండల విద్యాధికారి అగ్గిరాములు, సర్పంచ్ ఐలయ్య, ఎంపిడివో ఛండీరాణి, కేజీబివి స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాము, పిఆర్‌ఏఈ దామోదర్, సిడిపివో నాజీ, సిఆర్‌పి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా రమేష్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట చేనేత పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ అధ్యక్షుడిగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన 38వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గండూరి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 5 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ ఎన్నిక మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో అధికారులు నిర్వహించారు. సహకార సంఘంలో 305 మంది సభ్యులు ఉండగా 9 మంది డైరెక్టర్లను ఎన్నుకున్న అనంతరం ఇందులో ఒకరిని అధ్యక్షుడిగా గండూరి రమేష్‌ను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా చిలువేరు నర్సింహారావు, కార్యదర్శిగా భీమనపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ముశం హరిప్రసాద్, డైరెక్టర్లు ముశం యాదమ్మ, వీడం నీరజ, పెద్ది శ్రీనివాస్, యలగందుల లక్ష్మయ్య, యలగందుల సాయినేతలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి షేక్ బాజీ ప్రకటించారు. అనంతరం నూతన డైరెక్టర్ల సమక్షంలో అధ్యక్షుడిగా ఎన్నికైన గండూరి రమేష్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పారిశ్రామిక సహకార సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన డైరెక్టర్లకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**గండూరి ఎన్నిక పట్ల హర్షం...**

కౌన్సిలర్ గండూరి రమేష్ చేనేత పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల వేరువేరు ప్రకటనల్లో పలువురు హర్షం వ్యక్తం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారుడిగా, సామాజిక సేవకుడిగా, ప్రజా నాయకుడిగా రాణిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న రమేష్ చేనేత పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ అధ్యక్ష పదవికి కూడా వన్నె తేవాలని ఆకాంక్షించారు.

## ఫీ నియంత్రణ చట్టం అమలుకు డిమాండ్

**ప్రజాపక్షం/నల్గొండ టౌన్ :** ప్రైవేటు పాఠశాలల్లో పెంచిన ఫీజులను తగ్గించి,ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు.ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీ చైతన్య, ఇతర ప్రైవేటు విద్యాసంస్థలు పుస్తకాలు, డైరీలు, యూనిఫామ్‌లను ఇష్టారాజ్యంగా అమ్ముతూ విద్యార్థుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నా, వాటిని ఉల్లంఘించి దోచుకుంటున్నారని మండిపడ్డారు.శ్రీ చైతన్య, ఇతర ప్రైవేటు పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు వినయ్, శ్రీకాంత్, శివ, వాసు, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి

### కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం




**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులతో యూరి యా, విత్తనాలు, రైతు నమోదు అంశాలపై ఆయన సమీక్షించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులు ఉన్నందున రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా కంది, జొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌ను పరిశీలించి రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా సలహాలు ఇవ్వాలన్నారు.

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు**

అన్ని ప్రాంతాల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కౌలు రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, సాగు చేయని వ్యక్తులు యూరియా బుక్ చేసి అక్రమంగా విక్రయించకుండా పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రతి కేంద్రంలో యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ రైతు వేదికల్లో అందుబాటులో ఉండాలని, విత్తనాలు, ఎరువుల నిల్వలు, సరఫరా సమయాల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు వేదికలను పరిశుభ్రంగా ఉంచి, రైతులకు అవసరమైన సమాచారం ఎప్పటికప్పుడు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

**ఎస్‌సి, ఎస్‌టిల రక్షణకు జిల్లా యంత్రాంగం ప్రాధాన్యం**

**దాడులపై తక్షణ చర్యలు.. న్యాయం జరిగేలా కృషి**

ఎస్‌సి, ఎస్‌టిలపై దాడుల నిరోధం, వారి హక్కుల రక్షణకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. 1995 పౌర హక్కుల రక్షణ చట్టం, ఎస్‌సి, ఎస్‌టిలపై దాడుల నిరోధక చట్టం 1989 అమలు తీరుపై సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కమిటీ సభ్యుల సహకారంతో దాడులు జరగకుండా నిరోధిస్తామని కలెక్టర్ చెప్పారు. దాడికి గురైన వారికి తక్షణమే కేసులు నమోదు,ఎఫ్‌ఐఆర్, నష్టపరిహారం అందజేత, కేసుల సత్వర పరిష్కారానికి పోలీస్, రెవెన్యూ శాఖల ద్వారా ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులకు సంబంధించి 49 కేసులు విచారణలో ఉండగా, 798 ట్రయల్ పెండింగ్ కేసులు ఉన్నాయని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శశికళ తెలిపారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు దళితవాడలకు అందేలా చూడాలన్నారు. తన నియోజకవర్గంలోని 7, 8 తండాల్లో నాటుసారా ఎక్కువగా ఉందని, దీనివల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, అక్కడ జీవనోపాధి పథకాలు అమలు చేయాలని కోరారు. అటవీ భూములపై గిరిజనులకు హక్కులు, రుణాల సకాల అందజేతపై దృష్టి పెట్టాలన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్వో దశరథ్, ఆర్‌డిఓలు రమణారెడ్డి, శ్రీదేవి, దేవరకొండ, నల్గొండ డీఎస్పీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరూ జాబితాలో ఉండాలి

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండాలని దీనికోసం బిఎల్‌ఓ అప్రమత్తంగా ఉండి సరైన జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై పోచంపల్లి పట్టణ, మండల బిఎల్‌ఓ, బిఎల్‌ఏలతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి బూత్లో అర్హులైన ఒక్క కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, చిరునామా మార్పుల ప్రక్రియలో ప్రజలకు సహకరించాలని కోరారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలకు ముందే ప్రతి బూత్‌ను పూర్తిగా పరిశీలించి, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాగా పట్టణ కేంద్రంలో 57 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సమావేశంలో తాసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు పాక మల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, పోచంపల్లి పట్టణ, మండల ప్రజాప్రతినిధు లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్‌ఏ, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ‘సర్’లో బిఎల్‌ఎలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలి

### ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/చందంపేట :** ఎస్‌ఐఆర్ ప్రక్రియలో బిఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ సూచించారు. మంగళవారం చందంపేట, నేరేడుగొమ్ము మండలాల కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు ఎస్‌ఐఆర్ విధానంపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌లో ఒక్క ఓటు కూడా తొలగించకుండా బిఎల్‌ఏలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్‌ఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. దేశంలో రాహుల్ గాంధీ , తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి అధికారంలో ఉండొద్దని బిజెపి కుట్ర చేస్తున్నదని తెలిపారు. దేశ ఎన్నికల కమిషన్‌ను బిజెపి చేతిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు మరియు కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తగ్గించాలని కుట్ర చేస్తుందన్నారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా నింపించి, నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన వారందరి పేర్లు ఓటరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌ఐఆర్ కార్యక్రమంలో చురుగ్గా పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్లను కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను ఎంఎల్‌ఏ బాలునాయక్ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈకార్యక్రమంలో నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్‌నేత, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, వెంకటయ్య, గోవిందు, చందంపేట మండల అధ్యక్షులు మల్లారెడ్డి, నేరేడుగొమ్ము మండల అధ్యక్షులు బిక్కునాయక్, బద్య, కృష్ణయ్య, యుగేందర్ రెడ్డి, హరికృష్ణ, రాంసింగ్, బిఎల్‌ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో జాప్యం వద్దు

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న ఎస్‌ఐఆర్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు వార్డుల పరిధిలో ఉన్న 74 నుండి 86 వరకు గల పోలింగ్ బూత్‌లతో పాటు 119 నుండి 122 వరకు గల కేంద్రాలలో జరుగుతున్న ఓటరు నమోదు, సవరణల తీరును ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద ఓటర్ల నుండి అందుతున్న దరఖాస్తులను పరిశీలించి, సవరణల కొరకు ఫారాలు నింపే విధానంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన మౌలిక వసతులు కల్పించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగాలన్నారు. బూత్ లెవల్ అధికారులు తమ పరిధిలో కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను గుర్తించి వారి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా బూత్ లెవల్ ఏజెంట్లు కూడా వార్డులలో చురుగ్గా ఉంటూ ప్రజలకు అవసరమైన మార్గదర్శకత్వం చేయాలని, అధికారుల పనితీరుకు సహకరిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, బూత్ స్థాయి ప్రతినిధులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి చేసుకుంటానని మోసం.. నిందితుడికి జైలుశిక్ష, జరిమానా

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఒక యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై అనేక సార్లు అత్యాచారం చేసిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమాన విధిస్తూ హుజూర్‌నగర్ రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శివరామ ప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొబ్బ కోటిరెడ్డి తెలిపిన ప్రకారం హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో గల గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన కటారి అరుణ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ వివాహ సంబంధాల కోసం మ్యారేజ్ బ్యూరోకు తనకు సంబంధించిన విషయాలను పంపించారు. ఆ విషయాలను తెలుసుకున్న హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నివాసముంటున్న గొర్రె ప్రభుదాస్ ఆమెను సంప్రదించి తాను తనను వివాహం చేసుకుంటానని నమ్మించి తను నిరుద్యోగి అయినందున తన అవసరాల కోసం కొంత డబ్బు కావాలని తన నుంచి పెద్ద మొత్తంలో వివిధ దఫాలలో డబ్బులు తీసుకుని తన స్వగ్రామమైన కర్నూల్‌లో నివాసముంటున్న తన తల్లిదండ్రులను బయటకు పంపించి ఆ రాత్రి తనను బలవంతంగా శారీరకంగా వాడుకున్నాడని, తదుపరి హైదరాబాద్‌లో కూడా తన రూమ్‌కి తరచుగా పిలిపించి తనను బలవంతంగా అనుభవించాడని తదుపరి అధిక కట్నం ఆశించి వేరే సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నాడని తెలిసి తనను కలిసి పెళ్లి చేసుకోమని కోరగా అతను అందుకు నిరాకరించి వేరే సంబంధం చేసుకుంటానని ఖరాఖండిగా చెప్పడంతో పాటు తనను బండబూతులతో దూషించి చంపుతానని బెదిరించాడని ఫిర్యాదు చేయగా, అప్పటి గరిడేపల్లి ఎస్ఐ రామకృష్ణారెడ్డి మోసం, అత్యాచారం, దూషణ, బెదిరింపు, సెక్షన్ కింద కేసు నమోదు చేయగా అప్పటి హుజూర్‌నగర్ సిఐ భాస్కర్ దర్యాప్తును పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షుల పూర్తి విచారణ అనంతరం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొబ్బ కోటిరెడ్డి వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం నిందితుడు గొట్టు ప్రభుదాస్‌పై మోసం చేసిన సెక్షన్ కింద మాత్రమే నేరం నిరూపణ కావడంతో ప్రభుదాసుకు మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, 1500 రూపాయల జరిమాన, జరిమాన చెల్లించని పక్షంలో మరో నెల రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శివరాంప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు.

# మునగాల పోలీస్ స్టేషన్ సందర్శించిన ఎస్‌పి



విధుల నిర్వహణ, సేవల పట్ల సిబ్బందికి ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ నందు నిర్వహిస్తున్న రిసెప్షన్ సెంటర్‌ను తనిఖీ చేసి ఫిర్యాదుల నిర్వహణ, ఫిర్యాదులపై పోలీసు సేవలు, బాధితులతో పోలీస వ్యవహరించే తీరు, రికార్డు నమోదు మొదలగు అంశాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితునికి భరోసా కల్పించే విధంగా రిసెప్షన్ సెంటర్ సిబ్బంది పనిచేయాలని అదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో స్వాదీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డ్స్, కేసుల స్థితిగతులు, సాంకేతికత సద్వినియోగం, సిసి కెమెరాల నిర్వహణ, సమస్యాత్మక వ్యక్తుల రికార్డుల నిర్వహణను క్షుణంగా తనిఖీ చేసి సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. సిబ్బంది పనితీరు, సేవల్లో సామర్థ్యం అంశాలను తనిఖీ చేశారు. జాతీయ రహదారి వెంట నిరంతరం గస్తీ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు పోలీస్ సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. పోలీస్ సేవలు పనితీరును ప్రతి సిబ్బంది మెరుగుపర్చాలని ఆధునిక పోలీస్ అనుసరిస్తూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ శాఖ పూర్తిస్థాయి నిఘా వచ్చిందని వీటికి పాల్పడే వారిని ఉపేక్షించమని అన్నారు. ఈ కార్యక్రమంలో మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, ఎఎస్ఐ రత్నం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల సందేహాలకు హెల్ప్‌డెస్క్

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఓటర్ల సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. జిల్లాలో ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా ప్రజలకు ఎదురయ్యే సందేహాలను తీర్చేందుకు, ఎన్యుమరేషన్ ఫారమ్ నింపే విధానంపై అవగాహన కల్పించేందుకు హెల్ప్‌డెస్క్ సహాయపడుతుందన్నారు. 2002 ఓటరు జాబితాలో వివరాల పరిశీలనతో పాటు ఇతర సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి ఈ కేంద్రం నిరంతరం అందుబాటులో ఉంటుందని వివరించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు లేదా ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్ ఆఫీస్ హెల్ప్‌డెస్క్ 6281492368, బి.భరత్ (డిటి ఎలక్షన్) 9573 085943, కె.రణదీప్ (ఐటి సపోర్ట్) 9059170790లను సంప్రదించవచ్చన్నారు. జిల్లాలోని ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా 2002 ఓటరు జాబితాలో తమ వివరాలు ఎలా ఉన్నాయో చూసుకోవాలని, ఎన్యుమరేషన్ ఫారమ్‌లను తప్పులు లేకుండా నిపేందుకు హెల్ప్‌డెస్క్ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# హై టెక్నాలజీతో ఎకో డంపింగ్ యార్డు

### దేశ రక్షణకు సిక్కుగా మారి సైన్యంలో చేరిన కళ్లెం పాపిరెడ్డి త్యాగం చిరస్మరణీయం

### విగ్రహాల ఆవిష్కరణలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌లు రెడ్డి స్పష్టీకరణ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అప్పుడే సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరుతాయని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. పిల్లాయిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య, డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సైనికుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కళ్లెం పాపిరెడ్డి జయంతి సందర్భంగా పాపిరెడ్డి, అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయనతోపాటు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వలన ప్రతి మనిషి స్వేచ్ఛ హక్కులు కాపాడుకుంటున్నారని అన్నారు. పిల్లాయి పల్లి పరిసర ప్రాంతాలలోప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ వల్ల ఎలాంటి ప్రమాదం లేదని అధునాతన టెక్నాలజీతో దుష్ప్రభావాలు జరగకుండా ప్రభుత్వం చూస్తుందని వెల్లడించారు.ఈ గ్రామానికి ఒక చరిత్ర ఉందని రజాకార్లను ఎదిరించే పోరాటకాంక్షతో ప్రజల కోసం సైన్యంలో చేరి ధీరోదాత్తుడిగా దేశ రక్షణలో చేరిన మహాత్యాగశీలి పాపిరెడ్డి అని కొనియాడారు. మారుమూల గ్రామంలో ఉన్న కళ్లెం పాపిరెడ్డి ఆనాటి పరిస్థితులను కళ్లారా చూసి మనసు చలించి దేశ రక్షణ కోసం తనవంతుగా ప్రాణాలర్పించేందుకు సిద్ధమని తలంచి సిక్కువుగా మారి భారత సైన్యంలో చేరిన ఆహా యోధుడని అన్నారు. మూసీనది పునరుజ్జీవ మహా యజ్ఞంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చొరవ దేశంలోనే మహా ఘట్టమని అభివర్ణించారు. ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. ప్రతి గ్రామంలోని ముఖ్య నాయకులు కార్యకర్తలు కష్టించి పనిచేశారు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. అదేస్ఫూర్తితో రెండో మారు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తీరుతుందని ప్రజల యొక్క ప్రతి హామీని నిలబెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పిల్లాయిపల్లి పాపి రెడ్డి ఆశయ స్ఫూర్తిని దేశభక్తిని కొనసాగించాలని ఆయన చరిత్రను భావితరాలకు తెలిసేలా చేయాలని ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి కుమారులు మాజీ ఆర్మీ హార్స్ ట్రైనర్ చంద్ర శేఖర్ రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, గాంధీ గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ వేదిరే అరవింద్ రెడ్డి, ఉపసర్పంచ్ బందారపు లక్ష్మణ్ గౌడ్, గూడూరు అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అందెల హరీష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ బందారపు సుమలత, జిల్లా సీనియర్ నాయకులు పాక మల్లేష్ యాదవ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కాసులు అంజయ్య గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ళ అరెస్టు

### రూ.6,300 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం



**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలోని మల్లారెడ్డిగూడెంలో పోలీసులు మంగళవారం పేకాట రాయుళ్ళను పట్టుకున్నారు. ఇందులో గంధం రామచంద్రయ్య, గూడెపు నాగేశ్వర్‌రావు, గూడెపు వీరబాబు, అంబటి లింగారెడ్డి, గూడెపు సైదులు, కాటబోయిన లచ్చయ్యలు ఉన్నారు. వీరి నుండి రూ.6,300 నగదు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు.

‘వాల్తేరు వీరయ్య’ భారీ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి,దర్శకుడు బాబీ కొల్లి మళ్లీ కలిసి పనిచేస్తున్న చిత్రం కోసం ప్రస్తుతం భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ విస్తృతంగా జరుగుతోంది.

రీల్

# ఫైట్ చేస్తున్న చిరంజీవి



వాల్తేరు వీరయ్య’ భారీ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి,దర్శకుడు బాబీ కొల్లి మళ్లీ కలిసి పనిచేస్తున్న చిత్రం కోసం ప్రస్తుతం భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో విస్తృతంగా జరుగుతోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్న భారీ యాక్షన్ సన్నివేశం ఈ చిత్రంలో మేజర్ హైలెట్స్ లో ఒకటి. భారీ సంఖ్యలో ఫైటర్లతో అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సన్నివేశం, మెగాస్టార్ చిరంజీవిని పవర్ ఫుల్ , డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని రూపొందుతున్న ఈ యాక్షన్ ఘట్టంలో, మెగాస్టార్ స్వయంగా పాల్గొంటూ చాలా సాహసోపేతమైన స్టంట్స్ చేస్తున్నారు. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ అద్భుతమైన విజువల్స్ అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాష్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్ ఆంటోనీ రూబెన్ పని చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పోట్లూరి అడిషినల్ స్క్రీన్‌ప్లేను సమకూర్చారు. స్టార్ రచయితల ద్వయం భానునందు సంభాషణలు రాస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి సరసన అనశ్వర రాజన్.



## ‘ఓ.. సుకుమారి’ సెన్సార్ పూర్తి

హీరో తిరువీర్,హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఎంటర్టైనర్ ‘ఓ. సుకుమారి’తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు.విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా ’శివం భజే’ తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్స్ మంచి రెస్పాన్స్ వచ్చింది.తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ యు/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. వినోదం, ప్రేమ, నవ్వులతో నిండిన ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రం అలరించబోతోంది. రజాకార్, పోలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచి రాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు.జూలై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: భరత్ మంచిరాజు, ఆర్ట్ డైరెక్టర్: తిరుమల ఎం తిరుపతి, లిరిక్స్: పూర్ణాచారి, ఫైట్స్ : అంజి, కొరియోగ్రఫీ: జెడి మాస్టర్.

## ‘రాజా ది రాజా’ డిఫరెంట్ జానర్ సినిమా

### ట్రైలర్ లాంచ్ లో నిర్మాత రవిశంకర్




రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన ’రాజా ది రాజా’ చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్ కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. బృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి నిర్మించిన ఈ చిత్రాన్ని కె. శ్రీలత రెడ్డి సమర్పిస్తున్నారు. ఈ సినిమా జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ డిస్ట్రిబ్యూషన్ రైట్స్ దక్కించుకోవడం ద్వారా, సినిమా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర బృందం ఇప్పుడు సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేసింది.రాజరిక కాలంలో సాయికుమార్ రాజా వీరాట వర్మ దేవరాయగా కనిపిస్తారు. సంప్రదాయాలను గౌరవించే రాజ్యంలో, ఆధ్యను ప్రాణంగా ప్రేమించే హీరోపై రాజ్యంలో జరిగిన కల్లోలానికి కారణమని నేరం మోపి మరణశిక్ష విధిస్తారు. ఆ తర్వాత వర్తమాన కాలంలో హీరో ఫ్యాషన్ డిజైనర్‌గా, ఆధ్య మోడల్‌గా మళ్లీ పుడతారు. విధి వారికి మరో అవకాశం ఇస్తుంది. ఈసారి వారి ప్రేమ గెలుస్తుందా? గత జన్మలో మిగిలిపోయిన కథకు ముగింపు పలుకుతాడా? అనేదే సినిమా ప్రధాన కథాంశం.పీరియాడిక్ ఎపిసోడ్స్‌లో రాజకుమారుడి హుందాతనాన్ని, ప్రస్తుత కాలంలో స్టైలిష్, ఎనర్జిటిక్ యువకుడిగా చక్కగా కనిపించారు. సాయికుమార్ తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, డాక్టర్ నరేష్ విజయ కృష్ణ కూడా తన పాత్రలో మంచి నటన కనబరిచారు.ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ ’రాజా ది రాజా’ ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. ఈ సినిమా హీరో రుత్విక్ తో పాటు నిర్మాత నిహారిక కూడా చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. ట్రైలర్‌లో రుత్విక్ యాక్టింగ్ చూస్తుంటే అసలు కొత్త హీరో చేస్తున్నట్లు అనిపించలేదు.17న అందరం థియేటర్లలో ఈ సినిమా చూద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో రుత్విక్, నిర్మాత నిహారిక దాసరి, దర్శకుడు అనిల్ పాల్గొన్నారు.




## ‘వ్యూ’ టీజర్ లాంచ్

మహేష్ కాంపెల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ’వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ’ చిత్ర టీజర్‌ను చిత్రబృందం ఘనంగా విడుదల చేసింది. మిస్టరీ, సస్పెన్స్, ఎమోషనల్ అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించారు. కార్తికేయ సమర్పణలో పరవాణి చలనచిత్ర బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం విభిన్నమైన కథనంతో తెరకెక్కుతోంది. ‘ది పాయింట్ ఆఫ్ వ్యూ‘ అనే ట్యాగ్‌లైన్‌నే కథలోని ప్రధాన అంశాన్ని ప్రతిబింబిస్తోంది. టీజర్ విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ఘనంగా మీడియా సమావేశాన్ని నిర్వహించింది.ఈ సందర్భంగా నిర్మాత సత్య చౌదరి మాట్లాడుతూ నేను వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌ని. కానీ సినిమాలపై ఉన్న ఆసక్తితో ఈ రంగంలోకి వచ్చాను. దాదాపు పదేళ్ల క్రితం మహేష్ ఈ కథను నాకు వినిపించారు. ఒక మహిళా ప్రధాన కథతో మంచి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించాను. దర్శకుడు మహేష్ కాంపెల్లి మాట్లాడుతూ ఇది నా తొలి దర్శకత్వ చిత్రం. నేను ఇంతకుముందు ఏ దర్శకుడి దగ్గరా పని చేయలేదని నిర్మాత సత్య గారికి ముందే చెప్పాను. అయినప్పటికీ నేను రాసుకున్న కథపై పూర్తి నమ్మకం ఉంది. దిశ ఘటనతో పాటు కొన్ని వాస్తవ సంఘటనల నుంచి ప్రేరణ పొందిన ఈ కథ ద్వారా మహిళల పట్ల సమాజంలో అవగాహన పెంచే బలమైన సందేశాన్ని ఇవ్వాలనుకున్నాను. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తారని ఆశిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు అర్జున్ , హీరోయిన్ సోనియా నాయుడు, హీరోయిన్ పూజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రొమాంటిక్ కామెడీ చిత్రంగా ‘లవ్ ఓ లవ్’



లవ్ ఓ లవ్’ ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. పావిష్ నారాయణన్, నాగ దుర్గా జంటగా నటించిన ఈ చిత్రానికి మాగేశ్ రాజేంద్రన్ దర్శకత్వం వహించారు. రొమాన్స్, కామెడీ, సమ్మేళనంగా రూపొందించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మాస్ కా దాస్ విశ్వక్ సేన్ చిత్ర బృందానికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ నిర్మాతలు సి. కళ్యాణ్, దామోదర్ ప్రసాద్, జి. నాగేశ్వర రెడ్డి గార్లు కూడా హాజరయ్యారు. లవ్ ఓ లవ్ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, చిత్ర యూనిట్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ, నగరానికి ఏమైంది 2 సినిమా షూటింగ్‌లో ఉన్నాను. పవిష్ సినిమా ఈవెంట్‌కు వెళ్లాల్సి ఉందని తరుణ్ భాస్కర్‌కు చెప్పగా, ఆయన కూడా రెండు గంటల ముందే షూటింగ్ నుంచి వెళ్లమని ప్రోత్సహించారు. లవ్ ఓ లవ్ గురించి చెప్పాలంటే, ఇది భాషలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే యూనివర్సల్ రొమాంటిక్ కామెడీ చిత్రంలా అనిపిస్తోంది. కథ, కంటెంట్ బాగుంటే తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ మంచి సినిమాలను ఆదరిస్తారు. అది తెలుగు సినిమా అయినా, తమిళ సినిమా అయినా ఎలాంటి తేడా చూపించరు. సూర్య, కార్తీ, ధనుష్, ప్రదీప్ రంగనాథన్ చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎంతగా ఆదరించారో మనందరికీ తెలుసు. అదే విధంగా పవిష్ కూడా ఆ జాబితాలో చేరాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత జి. ధనంజేయన్, దర్శకుడు మాగేశ్ రాజేంద్రన్ , నిర్మాత దినేష్ రాజ్, హీరో పవిష్, హీరో పవిష్ నారాయణన్ , హీరోయిన్ నాగ దుర్గా, నటి వనిత విజయకుమార్ పాల్గొన్నారు.

## రెండోసారి కలిసి నటిస్తున్న ప్రదీప్ – మమిత బైజు



రచయితగా, దర్శకుడిగా, హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు నిర్మాతగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారు. పీఆర్ షో పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ బ్యానర్‌లో తొలి సినిమాగా, డ్యూడ సినిమాలో ఆయనతో కలిసి నటించిన మమిత బైజు, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో శివాజీ సొంటినేని, స్వాసిక, అనామిక మహి, లిజ్జీ ఆంటోని కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న సాయి అభ్యంక్కర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ది ఆల్ఫా యూనిట్ పేరుతో పరిచయం చేసిన ఆరుగురు సభ్యుల బృందం నిర్వహిస్తోంది. ఇందులో విశాల్ టీఆర్, యష్ వి, నరేన్ సౌడా, చాణక్కియన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఉన్నారు. సినిమాటోగ్రఫీని దినేష్ పురుషోత్తమన్, ఎడిటింగ్‌ను ప్రదీప్ ఈ రాఘవ్, ప్రొడక్షన్ డిజైన్‌ను అశ్విన్ లారా చూస్తున్నారు. ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్: రమేష్ నారాయణన్, డీవోపీ: దినేష్ పురుషోత్తమన్, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ్, ప్రొడక్షన్ డిజైనర్: అశ్విన్ లారా, యాక్షన్: దినేష్ కాశీ.

### పారదర్శకంగా వేతనాల చెల్లింపులకు

# డిజిటల్ గవర్నెన్స్

## ప్రణాళికలతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలి




కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాల చెల్లింపు

ఏజెన్సీలకు సమయానికి ప్రభుత్వం నిధులు చెల్లిస్తున్నా ఉద్యోగులకు ఇవ్వడం లేదు

అలాంటి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతన సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలకు సబంధించిన నిధులను ప్రభుత్వం ఏజెన్సీలకు చెల్లించినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీ నుంచి గరిష్టంగా 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు చేసేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని, అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ ఖాతాల వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పిఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సిఎం స్పందిస్తూ డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని అధికారులకు సూచించారు.

**పరిపాలనలో పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు**

ప్రభుత్వ పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని, కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని సిఎం ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర సదుపాయాలను అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలన్నారు. నిరంతరం పర్యవేక్షించేందుకు చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపి వేం నరేందర్ రెడ్డి, సిఎం సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి వైస్ చైర్ పర్సన్ ఎ.శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్.శివ శంకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

### సిఎం రేవంత్ రెడ్డికి 125 మంది విద్యావేత్తలు, ప్రముఖుల బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే ప్రతిపాదనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యావేత్తలు, మేధావులు, పౌరసమాజ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. విద్య హక్కు చట్టం, రాజ్యాంగ పరిరక్షణలు, కాంగ్రెస్ ఎన్నికల హామీలకు విరుద్ధంగా ఈ నిర్ణయం ఉందని, వెంటనే ఆ ప్రతిపాదనను పునఃసమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజానికి చెందిన 125 మందితో కూడిన లేఖను సిఎంకు పంపి ంచారు. లేఖ రాసిన వారిలో మాజీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.చంద్రకుమార్, జస్టిస్ రజని, జస్టిస్ రాధారాణి, జస్టిస్ నిమ్మ నారాయణ, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ వలీ ఖాద్రీ, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, పిడిఎస్‌యు, పివైఎల్, ఎస్‌సిఐఇ, పిఎవి, టిఎస్ఇసి, పిఎవి, ఎస్‌సిఐఇ, ఎపిటిఎఫ్, డిటిఎఫ్, టిపిటిఎఫ్, హెచ్‌సియు, ఒయు నేతలు ఉన్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలలో దాదాపు 8,769 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దళిత, ఆదివాసీ, పేద, వెనుకబడిన వర్గాల పిల్లలు, బాలికలు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. సమీపంలో పాఠశాలలు లేకపోతే రవాణా, భద్రతా సమస్యల కారణంగా డ్రాప్‌ఔట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ‘విద్యపై ఖర్చు భవిష్యత్తుపై పెట్టుబడి’ అని పేర్కొంటూ విద్యకు బడ్జెట్‌లో 15 శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రస్తుతం కేటాయింపులు 8.2 శాతానికే పరిమితమయ్యాయని లేఖలో వారు గుర్తు చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మూసివేసిన సుమారు 6,000 పాఠశాలలను పునరుద్ధరిస్తామని చెప్పి, ఇప్పుడు 23,000 పాఠశాలల మూసివేత దిశగా అడుగులు వేయడం విచారకరమని వారు విమర్శించారు. రాష్ట్ర విద్యాశాఖలో పర్యవేక్షణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని కూడా లేఖలో పేర్కొన్నారు. మొత్తం 33 జిల్లాల్లో 25 జిల్లాలకు రెగ్యులర్ డిఈఓలు లేరని, 633 మండలాల్లో 612 మండలాలకు మండల విద్యాధికారులు లేరని వివరించారు.

పర్యవేక్షణ లోపం, ఉపాధ్యాయుల కొరత, ప్రైవేట్ పాఠశాలల విస్తరణ వంటి కారణాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు తగ్గుతున్నాయని అభిప్రాయపడ్డారు.

# తెలంగాణ టూరిజంపై ప్రభుత్వం ఫోకస్..

### కొత్త టూరిస్ట్ ప్రాజెక్టుల వరకు సమగ్ర కార్యాచరణకు ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను దేశంలోనే అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాలని, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ స్థాయి ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్‌లో అంతర్జాతీయ కార్నివాల్ నిర్వహణ అవకాశాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన పర్యాటక సలహా మండలి సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రస్తుత పర్యాటక కేంద్రాలతో పాటు కొత్తగా అభివృద్ధి చేయగల ప్రాంతాలను గుర్తించి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యాటకుల సంఖ్యను పెంచడంతో పాటు పర్యాటక ప్రాజెక్టులు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా నిలిచే విధంగా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, ఆహారం, వసతి వంటి మౌలిక సదుపాయాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేసి, పర్యాటక కేంద్రాల నిర్వహణపై రెండు మూడు రోజుల్లో సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తాత్కాలిక కాటేజీల ఏర్పాటుపై కూడా అధ్యయనం చేయాలని సూచించారు. పర్యాటక రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు పిపిపి, లీజ్ విధానాల్లో అనువైన ప్రాంతాలను గుర్తించాలని, ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని చార్మినార్, కోఠి, పుత్లీబౌలి, లాడ్‌బజార్ ప్రాంతాల్లో హెరిటేజ్ వాక్‌లను విస్తరించాలని, తెలంగాణ సంస్కృతి, కళలు, నృత్యాలు, సంగీతం, బోనాలు, బతుకమ్మ, స్థానిక వంటకాలను పర్యాటక ప్రచారంలో భాగం చేయాలని మంత్రి సూచించారు. పాతబస్తీ, కొత్త నగరంలోని రూపొందించాలని ఆదేశించారు. సోమశిలలోని 1,600 ఎకరాల భూమిని పర్యాటక వెడ్డింగ్ డెస్టినేషన్లు, వాటర్ గోల్ఫ్ కోర్సు వంటి ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పర్యాటక, భాషా సాంస్కృతిక ఎండీ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, పర్యాటక సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కాళేశ్వరాన్ని అప్పగిస్తా!

(మొదటి పేజీ తరువాయి)

రాయాలని, తాము కూడా వారికి విజ్ఞప్తి చేసి ఉభయ సభల(జాయింట్ సెషన్)ను ఏర్పాటు చేయిస్తామన్నారు. “ కూలిన కాళేశ్వరం: వైఫల్యం నుంచి పునర్మిణం వైపు” అనే అంశంపైన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం నాడు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, వారం రోజులు కెసిఆర్‌కు అప్పగిస్తే కన్నెపల్లి పంపు హౌజ్‌లను నడిపిస్తాడని కెటిఆర్, ముందుచూపుతో కాళేశ్వరం కట్టారని హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అదే నిజమైతే ప్రతిపక్ష నేత చంద్రశేఖర్‌రావు శాసనసభకు వచ్చి ఒప్పించాలని కోరారు. ‘సభలో వాస్తవాలు అన్నీ మాట్లాడుదాం. ఒకవేళ ఎందుకు కాళేశ్వరం ఆయనకు అప్పగించాలనే అంశంపై చంద్రశేఖర్‌రావు కన్విన్స్ చేసిండంటే నూరు శాతం కెసిఆర్‌కు అప్పజెబుదాం. మొత్తం మూడింటికి మూడు అప్పజెప్పుదాం . రాబోయే మూడేళ్ళు అప్పజెబుదాం. ఏమి చేయిస్తడో చేయని. వారం రోజులు కాదు ప్రాజెక్టును ఎల్ అండ్ టిని మిగతా కాంట్రాక్టర్‌లను తీసేసి హోల్ సేల్‌గా మేజర్ కాంట్రాక్టర్‌ను చేసి కెసిఆర్‌కే ఇస్తామని’ రేవంత్ రెడ్డి అన్నారు. నిజంగా తప్పు చేయకపోతే, ప్రమాదవశాత్తు కాళేశ్వరం కూలిపోయినట్లు కెసిఆర్ భావిస్తే కోరిన రోజు, కోరినన్నీ రోజులు ఉభయ సభలు ఏర్పాటు చేయిస్తామని, సబ్జెక్ట్ నిపుణులను కూడా కూడా పిలిపించి చర్చిద్దామన్నారు. వన్స్ ఫర్ ఆల్ కాళేశ్వరం అంశంపై చర్చ చేద్దామని, నిజంగానే మీ అనుభవంలో ఏమైనా చెబితే అమలు చేస్తామన్నారు.

**ప్రభుత్వం కట్టినవి వాడతలేదా?**

తెలంగాణ ప్రజలు కట్టిన పన్నులు, సోమ్ము వృథా కాకూడదని, నీళ్ళు గోదావరి పాలు కాకూడదనే ఉద్దేశ్యంతో కెసిఆర్ హయాంలో నిర్మించిన అనేక భవనాలు, ప్రాజెక్టులను వినియోగించటం లేదా అని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన కట్టిన సచివాలయాన్ని వినియోగిస్తలేమా, ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి అందరూ వచ్చిపోయేలా ఉపయోగించడం లేదా, వాళ్ళిచ్చిన రైతు భరోసాకు రూ. 2 వేలు అదనంగా ఇచ్చి రైతులకు ఇవ్వడం లేదా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీని ఇవ్వడం లేదా అని అన్నారు. నిజంగా కాళేశ్వరం ప్రాజెక్టును ఏమైనా చేయగలుగుతామంటే రాత్రి పగలు అక్కడే కూర్చొని మరమ్మతు పూర్తి చేయలేమా అని ప్రశ్నించారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం వృథా అవుతుందని, ఏమీ చేయలేకపోతున్నామనే బాధ తమకు, నిస్సహాయత, అవినీతికి పాల్పడిన వారిని ఏమి చేయలేకపోతున్నామనే ఆవేదన తమకు ఉన్నదన్నారు. అలాంటిది పాతవన్నీ మరిచిపోయి ఎదురు దాడి చేయాలని పిల్లలను అబద్ధాలు చెబుతూ జనం మీదికి పంపిస్తున్నాడని, అది ప్రజలు నమ్మితే కెసిఆర్ తాను వద్దామనుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు ఆర్థిక ఉగ్రవాదులు అని, తెలంగాణ వనరులను దోచుకున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించిన ప్రాంతాల్లో సరైన భూసర్వేలు, భూ పరీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. ఇసుక మేటలపై బ్యారేజీలు నిర్మించారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ వెన్నెముక లాంటిదని, అది పనిచేయకపోతే మొత్తం ప్రాజెక్టు ప్రభావితమవుతుందని చెప్పారు. ప్రాజెక్టుపై చర్చకు రావాలని కోరితే మిడిమిడి జ్ఞానం ఉన్న వారిని బిఆర్‌ఎస్ పంపిస్తున్నదన్నారు. ప్రాజెక్టు దెబ్బతిన్న తర్వాత ఇంజనీర్‌పై కేసు పెట్టింది కూడా బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ హయాంలోనే ఎన్‌డిఎస్‌ఎ ప్రాథమిక నివేదిక వచ్చిందని, నాణ్యత లోపాలు, నిర్వహణ వైఫల్యం, నిబంధనల ఉల్లంఘనల వల్లే బ్యారేజీ దెబ్బతిన్నట్లు అందులో పేర్కొన్నారని సిఎం వెల్లడించారు.

**కాళేశ్వరానికి రూ.30 వేల కోట్లు అప్పులు కట్టాం**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 30 నెలల్లో సుమారు రూ.1.80 లక్షల కోట్ల రుణాలు తీసుకువస్తే , తాము వచ్చాక ఒక్క చుక్క నీరు కాళేశ్వరం నుంచి తీసుకోకపోయినా, రైతుకు అణా పైసా ప్రయోజనం లేకున్నా కాళేశ్వరం కార్పొరేషన్ చేసిన అప్పుల కోసమే 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ. 33,574.11 కోట్లు కట్టామని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే రూ.2.08 లక్షల అప్పు తిరిగి చెల్లించామన్నారు. ఇందిరమ్మ జయంతి రోజు తెలంగాణలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. అలాగే రైతు భరోసా సభను ఈ నెల 10న మధ్యాహ్నం 2 గంటలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో సభ నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

**2027 జూలై నాటికి అందుబాటులోకి తెస్తాం : ఉత్తమ్**

దొంగే వేరేవాళ్లను తిట్టినట్లు, కాళేశ్వరం విషయంలో బిఆర్‌ఎస్ చేసిన తప్పులకు తమ ప్రభుత్వాన్ని నిందిస్తోందని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు వద్ద పరీక్షలు జరుగుతున్నాయని, తమ అంచనా ప్రకారం నెల రోజుల్లో అవి పూర్తి అవుతాయన్నారు. వర్షాకాలం పూర్తయ్యాక 2027 జూన్, జూలై మాసాలకు మూడు బ్యారేజ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సర్వశక్తుల ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ ప్రసాద్ బాబు, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, కార్పొరేషన్ చైర్మన్‌లు హాజరయ్యారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com